www.velthuru.com

RNI TEL TEL/ 2019 / 78609

రంగారెడ్డి

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దినపత్రిక

శనివారం 19 ఏప్రిల్ 2025

సంపుటి :06 సంచిక : 318 , పేజీలు : 12 వెల:రూ.5/-

TELANGANA, ANDHRA PRADESH




## రుణమాఫీ రైతు భరోసా పూర్తిస్థాయిలో అమలు చేయాలి

- పేదలతో పాటు మీడియా మిత్రులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి
- అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ నగేష్

**ఆదిలాబాద్ జిల్లా వెలుతురు ఏప్రిల్ 18:**
మండలంలోని పూసాయి గ్రామంలో భూభారతి అవగాహన సదస్సుకు హాజరై ఆయన మాట్లాడారు అనేక మంది పేదలకు ఇళ్ల స్థలాలు లేవని ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చే మీడియా మిత్రులకు సైతం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన అన్నారు, ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ రైతు భరోసా పూర్తిస్థాయిలో అమలు కాలేదని వాటిని రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు అలాగే ఆదిలాబాద్ లో కొమరం భీం కాలనీకి వస్తువులు కల్పించాలని కోరారు జొన్న పంటను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేసిన కొనుగోళ్ళకి ఆంక్షలు విధించడంతో రైతులు విక్రయించుకోలేని పరిస్థితి ఏర్పడింది కొనుగోళ్లపై ఉన్న పరిమితిని పెంచితే రైతులకు మేలు జరుగుతుందని ఆయన అన్నారు దీనికి స్పందించిన మంత్రి పేదలతో పాటు మీడియా మిత్రులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా కృషి చేస్తానని అన్నారు

## టెంపుల్ సిటీ లో వేద పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం

- త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి వేద పాఠశాల కు శంకుస్థాపన
- వేద పాఠశాల కు 15 ఎకరాల భూముల కేటాయింపు
- 23,78 కోట్ల రూపాయలతో వేద పాఠశాల నిర్మాణం



(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 18:**
తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి భువనగిరి జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయం( టెంపుల్ సిటీ) లో త్వరలో 15 ఎకరాల భూవిస్తీర్ణంలో 2 లో..





## తెలంగాణ లో పెట్టుబడులు పెట్టేందుకు రండి

- జపాన్ పారిశ్రామిక వేత్తలు- వ్యాపార సంస్థలు లకు సీఎం ఆహ్వానం
- టోక్యో లోని హెూటల్ ఇంపీరియల్ లో జరిగిన ఇండియా- జపాన్ సదస్సులో పాల్గొన్న సీఎం

(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 18:**
తెలంగాణకు పెట్టుబడులతో రావాలని, చైనా ప్లస్ వన్ ప్రత్యామ్నాయంగా ఎదుగుతోన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చెందాలని జపాన్ పారిశ్రామికవేత్తలు, వ్యాపార వేత్తలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం పలికారు. టోక్యోలోని హెూటల్ ఇంపీరియల్‌లో జరిగిన ఇండియా–జపాన్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ రోడ్‌షోలో ముఖ్యమంత్రి 2 లో..

## వర్షాల నేపథ్యం హైదరాబాద్ లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్



(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 18:**
హైదరాబాద్ లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలకు జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు, హైదరాబాద్ లో ఒక్కసారిగా ఈదురు గాలులు భారీ వర్షం కురవడంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. 2 లో..

# మరో బెంగాల్‌గా తెలంగాణ

## తెలంగాణలో బెంగాల్ తరహా పరిస్థితులు వచ్చే ప్రమాదం


## జరగబోయే పరిణామాలకు రేవంత్ రెడ్డి సర్కార్ దే బాధ్యత

- నేడు మజ్లిస్ సభ కాంగ్రెస్ స్పాన్సర్డ్ ప్రోగ్రాం
- రేవంత్ ఆర్థిక సహకారంతోనే వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా మజ్లిస్ ఆందోళన చేస్తోంది
- ఎంఐఎం పార్టీకి కాంగ్రెస్ దూరంగా ఉండాలని రాహుల్ చెప్పడం పెద్ద జోక్
- లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎంకు వ్యతిరేకంగా ఓటేసి చిత్తశుద్ధి నిరూపించుకుంటారా?
- కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్పొరేటర్లారా మీ అంతరాత్మ ప్రకారమే ఓటేయండి
- ఓటింగ్ కు దూరంగా ఉంటే హైదరాబాద్ ప్రజలు మిమ్ముల్ని క్షమించబోరు
- వక్ఫ్ ఆస్తులను ఒవైసీలాంటి కుటుంబాలు ఆక్రమించుకుని లబ్ది పొందుతున్నాయి
- వక్ఫ్ ఆస్తులు, ఆదాయంతో పేద ముస్లింలకు నయాపైసా ప్రయోజనం లేకుండా చేశారు




**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 18:**
వక్ఫ్ భూములు, నేషనల్ హెరాల్డ్ ఆస్తులపై కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ హైదరాబాద్ లో నిర్వహించబోతున్న బహిరంగ సభకు రేవంత్ రెడ్డి సర్కార్ ఆర్థిక సహకారం అందిస్తోందని వ్యాఖ్యానించారు. సభలు, సమావేశాలు, ఆందోళనల పేరుతో అల్లర్లకు కుట్ర చేస్తున్నాయని చెప్పారు. ఇదే జరిగితే హైదరాబాద్ లో బెంగాల్ తరహా పరిస్థితులు ఉత్పన్నమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కట్టడి చేయాల్సిన అవసరం ఉందని, లేనిపక్షంలో జరగబోయే పరిణామాలకు రేవంత్ రెడ్డి సర్కారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలో బీజేపీకి ఏం సంబంధమని బండి సంజయ్ ప్రశ్నించారు. 'నేషనల్ హెరాల్డ్ పత్రిక ఆస్తులను కాజేసేందుకు యంగ్ ఇండియా ట్రస్ట్ పేరుతో డూప్లికేట్ గాంధీ కుటుంబం కుట్ర చేసింది. దానవీరశూర కర్ణ సినిమాను మించి పాత్రలను పోషించింది డూప్లికేట్ గాంధీ కుటుంబమే. నేషనల్ హెరాల్డ్ పత్రికకు వాళ్లే డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీకి వాళ్లే అధినేతలు, యంగ్ ఇండియా ట్రస్టుకు వాళ్లే డైరెక్టర్లు. పత్రిక ఆస్తులను వ్యక్తిగత ఆస్తులుగా మార్చుకునేందుకు చేసిన కుట్ర కోణంపై 2012లో కేసు వేశారు. దీనిపై 2013లో కోర్టు నోటీసులు జారీ చేసింది. సీబీఐ విచారణకు ఆదేశించింది. అరెస్ట్ కాకుండా బెయిల్ పై ఉన్న నిందితులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలు... ఆ కేసుతో మోదీ ప్రభుత్వానికి ఏం సంబంధం" అని మండిపడ్డారు. నేషనల్ హెరాల్డ్ పత్రికలో 5 వేల మంది స్వాతంత్ర్య సమరయోధులు వాటాదారులుగా ఉన్నారని, ఆ ఆస్తుల్లో కాంగ్రెస్ కార్యకర్తలకు సైతం వాటా ఉందని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేతలంతా ధర్నా చేయాల్సింది ఈడీ ఆఫీస్ ముందు కాదని, ఆ ఆస్తులను కాజేసేందుకు కుట్ర చేసిన సోనియాగాంధీ నివాసం ఎదుట అని సూచించారు.
శుక్రవారం రోజున సాయంత్రం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోహర్ రెడ్డి, కార్యదర్శులు ఎస్.ప్రకాశ్ రెడ్డి, ఉమారాణి, అధికార ప్రతినిధులు విఠల్, రాణి రుద్రమాదేవి, ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతమ్ రావు, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు మహేందర్ తదితరులతో 2 లో..

## టీ న్యూస్ ఛానల్ కు నోటీసును ఇచ్చిన రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్



**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 18:**
తన పై తప్పుడు వార్త ప్రసారం చేసిన మీడియా సంస్థ(టీ న్యూస్) పై పరవు నష్టం దావా నోటీసు ఇచ్చిన రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం ఏ ఫహీమ్ పేర్కొంటూ ఈ మేరకు ఓ 2 లో..

## పేదల రైతుల కన్నీటికి భూ భారతి తో వేడుకోలు

- పార్ట్- బి లో ఏడు లక్షలు ఎకరాలకు పరిష్కారం చూపిస్తాం
- అబాదీ ఇళ్లకు కూడా డాక్యుమెంట్లు
- త్వరలో భూభారతి టోల్‌ఫ్రీ నెంబర్
- గిరిజన ప్రాంత సమస్యలపై కమిటీ ఏర్పాటు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు,హైదరాబాద్ బ్యూరో**
(వెంకటాపూర్ – భోరజ్ )
గత బిఆర్ఎస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా పార్ట్ –బి లో పెట్టిన 18 లక్షల ఎకరాలలో ఆరు నుంచి ఏడు లక్షల వరకు వ్యవసాయ భూములు ఉన్నాయని ఈ భూములకు ఈ భూభారతి చట్టంతో పరిష్కారం చూపిస్తామని రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం నాడు ములుగు జిల్లా 2 లో..

## జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**నిర్మల్ జిల్లా వెలుతురు ఏప్రిల్ 18:**
రైతులందరూ జొన్నల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ లో FSCS ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి 2 లో..

## గ్రూప్ వన్ అభ్యర్థులకు అండగా ఉంటాం

- ఇందిర పార్క్ ధర్నా చౌక్ లో పాల్గొన్న కృష్ణయ్య






**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 18:**
టీజీపీఎస్సీ లోపాలను సరిదిద్దుకోవాలని గ్రూపు 1 అభ్యర్థులకు అన్యాయం చేయొద్దని శుక్ర వారం నాడు ఇందిర పార్క్ వద్ద జరిగిన మహాధర్నా కార్యక్రమంలో పాల్గొన్న రాజ్య సభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు, ఈ ధర్నా 2 లో..

## హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో భారీ వర్షం

- కొన్నిచోట్ల వడగళ్ల వర్షంతో ఈదురుగాలులు
- పలుచోట్ల కూలిన చెట్లు..ట్రాఫిక్‌కు అంతరాయం
- నగరంపై క్యుమ్యులోనింబస్ మేఘాలు ఆవరణ

**హైదరాబాద్,ఏప్రిల్18( వెలుతురు):**
హైదరాబాద్ నగర పరిధిలో పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. ఎస్ఆర్‌నగర్, బోరబండ, అమీర్‌పేట, పంజాగుట్ట, మధురానగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కోఠి, సుల్తాన్‌బజార్, బేగంబజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, హిమాయత్‌నగర్, నారాయణగూడలో 2 లో..

## బీఆర్ఎస్ సభ విజయవంతం కోసం కేసీఆర్ ప్రత్యేక సమావేశం

(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 18:**
ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో జరుగనున్న పార్టీ రజతోత్సవ సభ నేపథ్యంలో, సభలో మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, సభ విజయవంతంలో వారి భాగస్వామ్యం, అనుస రించాల్సిన వ్యూహాలు, 2 లో..





(మొదటి పేజీ తరువాయి..)

## టెంపుల్ సిటీ లో వేద పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం

23,78 కోట్ల రూపాయలతో నూతన వేద విద్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది, ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర దేవాదాయ శాఖకు ప్రతిపాదనలు పంపింది,అలాగే టెంపుల్ సిటీ పరిధి లో ఏర్పాటు చేయనున్న వేద విద్యాలయం కు త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేస్తారని దేవాదాయ శాఖ అధికారులు చెబుతున్నారు, అయితే గత బీఆర్ ఎస్ ప్రభుత్వం రాయగిరిలో ఏర్పాటు తలపెట్టిన వేద పాఠశాల కు నిర్మాణ పనులను ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్న అది అప్పట్లో సాధ్యం కాలేదు, అయితే ఇప్పుడు ఈ ప్రభుత్వం టెంపుల్ సిటీ వరకు రైల్ సౌకర్యం ను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది,అంతే కాకుండా ఇప్పుడు టెంపుల్ సిటీ పరిధిలోని వేద పాఠశాల నిర్మాణం కోసం నిధులు కేటాయించడం తో పాటుగా 15 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది, అంతే కాకుండా 23,78 కోట్లను మంజూరు చేసింది, అలాగే అధికారులు ఇక్కడ ఏర్పాటు చేయబోయే వేద పాఠశాల శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆహ్వానించారు,

## తెలంగాణ లో పెట్టుబడులు పెట్టేందుకు రండి

నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ అధికారిక బృందం రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనేక అవకాశాలను సమగ్రంగా వివరించింది. వివిధ రంగాలకు చెందిన 150 మందికి పైగా జపాన్ పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ వ్యాపారవేత్తలను ముఖ్యమంత్రి సాదరంగా ఆహ్వానించారు. "భారతదేశంలోనే అతిపిన్న రాష్ట్రమైన తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతూ మీకు హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నది. జపాన్‌ను 'ఉదయించే సూర్యుడి దేశం' అని పిలుస్తారు. మా ప్రభుత్వ నినాదం 'తెలంగాణ రైజింగ్'. ఈ రోజు తెలంగాణ జపాన్‌లో ఉదయిస్తున్నది," అని ఉద్ఘాటించారు. "టోక్యో చాలా గొప్ప నగరం. ఇక్కడి మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, ఆవిష్కరణలు అద్భుతం. జపాన్ ప్రజల సౌమ్యత, మర్యాద, క్రమశిక్షణ నన్ను ఎంతగానో ఆకర్షించాయి. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంలో టోక్యో నుంచి మేము చాలా నేర్చుకున్నాము," అని పేర్కొన్నారు. లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, టెక్స్‌టైల్స్, ఏఐ డేటా సెంటర్స్, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో నిధులు పెట్టాలని జపాన్ పారిశ్రామికవేత్తలను సీఎం కోరారు. తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, స్థిరమైన విధానాలను అందిస్తుందని వారికి భరోసా ఇచ్చారు. "భారత్, జపాన్ కలిసి ప్రపంచానికి ఉజ్వల భవిష్యత్తును నిర్మిద్దాం," అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జపాన్‌లోని భారత రాయబారి సిబి జార్జ్ మాట్లాడుతూ, భారత్-జపాన్ మధ్య బలపడుతున్న ఆర్థిక సంబంధాలను వివరించారు. జెట్రో (జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) బెంగళూరు డైరెక్టర్ జనరల్ తోషిహిరో మిజుటానీ మాట్లాడుతూ, తెలంగాణతో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని భావిస్తున్నట్టు చెప్పారు.ఇదే వేదికపై తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్మిస్తున్న దేశంలోనే మొదటి నెట్ జీరో ఇండస్ట్రియల్ సిటీ 'ఫ్యూచర్ సిటీ' మరియు మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్ట్‌లకు సంబంధించిన ప్రచార వీడియోలను ప్రదర్శించారు. ఎలక్ట్రానిక్స్, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, టెక్స్‌టైల్స్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణం, అవకాశాలను రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ వివరించారు.రోడ్‌షో అనంతరం, తెలంగాణ ప్రతినిధి బృందం జపాన్‌లోని పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించింది, భవిష్యత్ సహకార అవకాశాలను చర్చించింది.

## వర్షాల నేపథ్యం హైదరాబాద్ లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

వర్షపాతం ప్రభావం జీహెచ్ ఎంసీ ప్రాంతాలలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఒక్కసారిగా ఈదురుగాలులతో నగరంలో పలు ప్రాంతాల్లో చెట్లు విరిగినట్టు అధికారులు మంత్రి దృష్టికి తీసుకురావడంతో ఎమర్జెన్సీ టీమ్స్ డిఆర్ఎఫ్ బృందాలు విరిగిన చెట్లను తొలగించాలని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో చార్మినార్ బహుదూర్ పుర ,నాంపల్లి , అంబర్పేట్ , ఖైరతాబాద్ ,ఎల్బీనగర్ ,కూకట్పల్లి ,సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో వర్షపాత ప్రభావం ఉందని వెల్లడించారు.వర్షానికి నగరంలో ఉన్న వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు వెంట వెంటనే నీటిని తొలగించాలని ఆదేశించారు. వచ్చే మూడు గంటల్లో నగరంలో మరోసారి భారీ వర్షం పడనుందని వాతావరణ శాఖ అధికారులు సూచించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. డ్రైనేజీ పొంగిపొర్లకుండా hmwssb జెట్టింగ్ మిషన్స్ ద్వారా అరికడుతున్నాయి. పోలీస్ , జీహెచ్ఎంసీ , వాటర్ బోర్డు ,విద్యుత్ అధికారులు సమన్వయం చేసుకొని వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.

## టీ న్యూస్ ఛానల్ కు నోటీసును ఇచ్చిన రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్

ప్రకటన విడుదల చేశారు,పరువు నష్టం దావా నోటీస్ పంపిన ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్ తనకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు, హైడ్రా పేరుతో వేధింపులు అంటు తప్పుడు వార్తలు ప్రసారం చేశారని ఆయన ఆరోపించారు, టిన్యూస్ క్రైమ్ బ్యూరో భాస్కర్ కు నోటీస్లను పంపిన విషయంను ఆయన తెలిపారు ,కోటి రూపాయల పరువు నష్టం నోటీసుతో పాటు తప్పుడు ప్రసారం చేసిన వీడియోలను తొలగించాలని నోటీసులో పేర్కొన్నట్లుగా ఫహీమ్ పేర్కొన్నారు,

## గ్రూప్ వన్ అభ్యర్థులకు అండగా ఉంటాం

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్య సభ సభ్యులు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ వన్ అభ్యర్థులు అన్యాయం చేయరాదని సూచించారు, అయితే గ్రూప్ వన్ అభ్యర్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలన్నారు, అలాగే గ్రూప్ అభ్యర్థులకు ఎలాంటి అన్యాయం జరిగినా ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని కృష్ణయ్య హెచ్చరించారు జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం.నీల వెంకట్,ఇతర బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు,

## హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో భారీ వర్షం

ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడింది. మెహదీపట్నం, మాసబ్‌ట్యాంక్, కార్వాన్, బోయినపల్లి, తిరుమలగిరి, అల్వాల్, మారేడ్‌పల్లితో పాటు- కుత్బుల్లాపూర్ పరిసరాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుంది. గుండ్లపోచంపల్లి, దుండిగల్, దూలపల్లి, బహదూర్‌పల్లి, మియాపూర్, నానక్‌రామ్‌గూడలో వానపడుతున్నది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, చైతన్యపురి, దిల్‌షుఖ్‌నగర్, మియాపూర్, గచ్చిబౌలి, వనస్థలీపురం తదితర ప్రాంతాల్లో వానకురిసింది. గాంధీ భవన్ ప్రాంతంలో భారీ చెట్టు నేలకూలింది. చంపాపేట, సైదాబాద్, సరూర్‌నగర్‌తో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిచిపోయింది. మరో వైపు వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులుపడ్డారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తుందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నాంపల్లి రెడ్‌హిల్స్‌లో రోడ్డుపై ఓ భారీ వృక్షం కూలిపోయి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. దీంతో అది ఒక్కసారిగా పేలిపోయింది. అస్మాన్‌గఢ్ విద్యుత్ డివిజన్ పరిధిలో 67 ఫీడర్లు ట్రిప్ అయ్యాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో జాప్యం చోటు- చేసుకుంది. బషీర్‌బాగ్‌లో పీజీ లా కాలేజ్ ఎదుట రోడ్డుపై ఓ చెట్టు కూలిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ట్యాంక్ బండ్ నుంచి లోయర్ ట్యాంక్‌బండ్ వెళ్లే రోడ్డులో చెట్టు- కూలిపోయి.. వాహనాలు భారీగా నిలిచిపోయాయి. లంగర్ హౌస్ బాపునగర్ కాలనీలో చెట్టు కూలి.. రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. వర్షానికి భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కొన్ని చోట్ల గాలి వానకు చెట్లు విరిగిపడ్డాయి.దీంతో రోడ్డు మార్గాన వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ , ఖైరతాబాద్, లక్డీకపూల్, పంజాగుట్ట, సికింద్రాబాద్,కూకట్ పల్లి, బషీర్ బాగ్, అల్వాల్, బాల్ నగర్ , ఎరియాల్లో గాలి దుమారం, రాళ్ళ వాన పడింది. గచ్చిబౌలి, హైటెక్ సిటీ-, కొండాపూర్, భారీ వర్షానికి ఎక్కడిక్కడ నీళ్లు నిలిచిపోయాయి. భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఒక్కసారిగా మారిన వాతావరణంతో పలు చోట్ల గాలి వాన కురిసింది. నగరంపై క్యుములో నింబస్ మేఘాలు ఆవరించాయి. సాయంత్రం 5 గంటల వరకు ఎండగా ఉన్న వాతావరణం.. ఒక్కసారిగా మారిపోయింది. చిమ్మ చీకట్లు అలుముకున్నాయి. దట్టమైన మేఘాలతో పగలే చీకట్లు అన్నట్లుగా వాతావరణం మారిపోయింది.

# మరో బెంగాల్‌గా తెలంగాణ

- కాంగ్రెస్ పాలనలో చేసిన వక్ఫ్ చట్టం అత్యంత ఘోరమైనది
- టైటిల్ ఉన్న వాళ్ల భూములను కూడా వక్ఫ్ కు ధారాదత్తమయ్యాయి
- ఆలయాల, గురుద్వారా, క్రైస్తవ, మత్సకారుల, లింగాయత్ సాగు భూమలను కూడా వక్ఫ్ పేరుతో ఆక్రమించుకున్నారు
- ఆఖరుకు పార్లమెంట్ కూడా వక్ఫ్ పరిధిలో ఉందంటూ అవాకులు పేలుతున్నారు
- సీఎంకు దమ్ముంటే తెలంగాణలోని వక్ఫ్ భూములు, ఆస్తులు, ఆదాయంపై హైడ్రాతో విచారణ చేయించాలి
- వక్ఫ్ ఆస్తులు, ఆదాయ, వ్యయాలపై శ్వేత పత్రం విడుదల చేయాలి
- డూప్లికేట్ గాంధీ కుటుంబానికి భారతీయ చట్టాలు వర్తించవా?
- రాజ్యాంగానికి అతీతులని అనుకుంటున్నారా?
- నేషనల్ హెరాల్డ్ ఆస్తులను కాజేసేందుకు డూప్లికేట్ గాంధీ కుటుంబం చేసిన కుట్ర
- యూపీఏ హయాంలోనే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి
- అరెస్ట్ కాకుండా బెయిల్ తెచ్చుకున్న నిందితులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ
- ఇందులో బీజేపీ, మోదీ పాత్ర ఏముంది?
- కాంగ్రెస్ కార్యకర్తలారా నేషనల్ హెరాల్డ్ ఆస్తుల్లో మీ వాటా ఉంది
- మీరు ధర్నా చేయాల్సింది, టెన్ జన్ పథ్ సోనియా ఇంటి ముందు
- తప్పు చేస్తే సోనియాసహా అందరూ జైలుకు వెళ్లక తప్పదు
- రాహుల్ స్ఫూర్తితో యంగ్ ఇండియా బ్రాండ్ పేరుతో ఫోర్త్ సిటీకి చెందిన 50 వేల కోట్ల ఆస్తులను కాజేసే కుట్ర
- సుబ్రమణ్యస్వామి కేసులతో బీజేపీకి ఏం సంబంధం?
- బూతులు మాట్లాడితే చప్పట్లు కొడుతుంటే నివారించాల్సింది పోయి సమర్థిస్తారా?
- దావోస్ పెట్టుబడులు ఎటు పోయాయ్? జపాన్ పర్యటన కూడా అంతే
- కాంగ్రెస్, బీఆర్ఎస్ జాన్ జబ్బలు.... బీఆర్ఎస్ అవినీతి కేసులన్నీ నీరుగార్చడమే నిదర్శనం
- విద్యుత్ కొనుగోళ్ల స్కాంపై నివేదిక ఇచ్చినా కేసీఆర్ కు కనీసం నోటీసు ఎందుకు ఇవ్వలేదు?
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్....

కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఏమన్నారంటే...
నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుట్రలు చేస్తోంది. గురువారం రోజున హైదరాబాద్ లో కాంగ్రెస్ నేతలు చేసింది బూతు ధర్నా. ప్రధానిని, కేంద్ర మంత్రిపట్ల గౌరవం లేకుండా బూతులు మాట్లాడిన కాంగ్రెస్ నేతలను ఏమనుకోవాలో పార్టీ రాష్ట్ర ఇంఛార్జీ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి సమాధానం చెప్పాలే. వాళ్లు మాట్లాడిన బూతులను మీరు సమర్థిస్తున్నారా? నేషనల్ హెరాల్డ్ కేసును చూస్తే దానవీరశుర్ణ లెక్క సినిమా కన్పించింది. నేషనల్ హెరాల్డ్ కేసు కూడా అట్లనే ఉంది. కాంగ్రెస్ పార్టీ వాళ్లదే. నేషనల్ హెరాల్డ్ పేపర్ వాళ్లదే, యంగ్ ఇండియా ట్రస్ట్ వాళ్లదే. నష్టాల పేరుతో 90 కోట్లు ఇచ్చింది వాళ్లే. యంగ్ ఇండియా ట్రస్ట్ పెట్టి ఆ ఆస్తులను కొట్టేయాలనుకుంది వాళ్లే. దీనిపై కేసు విచారణ స్టార్ట్ అయ్యింది యూపీఏ హయాంలోనే... కోర్టుకు వెళ్లి బెయిల్ తెచ్చుకుంది వాళ్లే...ఇందులో మోదీ పాత్ర ఏముంది? బీజేపీకి ఏం సంబంధం?
1938లో జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ హెరాల్డ్ వార్తా పత్రికను స్థాపించారు. 5 వేల మంది స్వాతంత్య ఉద్యమకారులు ఇందులో భాగస్వాములు(షేర్ హోల్డర్స్). అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (%ూజీూ%) సంస్థ పేరుతో ప్రచురిస్తుంది. %ూజీూ% సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందులలో చిక్కుకుంది. ఆర్థిక సంక్షోభం కారణంగా 2008లో నేషనల్ హెరాల్డ్ పత్రికను మూసివేశారు. 2010లో సోనియాగాంధీ కుటుంబం యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (%×ూ%) కంపెనీ స్థాపించారు. ఇందులో సోనియా గాంధీ 38 శాతం, రాహుల్ గాంధీ శాతం వాటా కలిగి ఉన్నారు. వీరితోపాటు కాంగ్రెస్ నేతలు మోతీలాల్ హోరా, శ్యాంపిట్రోడా, సుమన్ దుబేలు మిగిలిన 24 శాతం వాటాలను కలిగి ఉన్నారు.
నేషనల్ హెరాల్డ్ ఆస్తుల విలువ 2,000 కోట్లకు పైమాటే. యంగ్ ఇండియా సంస్థ కేవలం 50 లక్షలు చెల్లించి నేషనల్ హెరాల్డ్ ఆస్తుల వాటాలను కొనుగోలు చేసింది. వ్యక్తిగత ప్రయోజనాల కోసమే యంగ్ ఇండియా సంస్థను స్థాపించి నేషనల్ హెరాల్డ్ ఆస్తులను కాజేసేందుకు కుట్ర చేశారని, ఇది అతిపెద్ద అవినీతి అని పేర్కొంటూ 2012లో సుబ్రమణ్య స్వామి నేషనల్ హెరాల్డ్ కేసు దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానం (రౌస్ ఎవిన్యూ కోర్ట్) దీనిపై నోటీసులు జారీ చేసింది. 2013లో సీబీఐ ఈ కేసుపై దర్యాప్తు ప్రారంభించింది. ఈ కేసులో అరెస్ట్ కాకుండా బెయిల్ తెచ్చుకుని బయట ఉన్న నిందితులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలే. 2023, నవంబర్ లో అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (%ూజీూ%) యొక్క ?661 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ స్వాధీనం చేసుకుంది. అట్లాగే %×ూ% సంస్థకు చెందిన మొత్తం ?751.9 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నది.
ఈ కేసు విచారణను పూర్తి చేసిన ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ 2025 ఏప్రిల్ లో ఛార్జ్ షీట్ దాఖలు చేసి కోర్టుకు సమర్పించింది. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రధాన నిందితులుగా పేర్కొన్నది. ప్రైవేట్ వ్యక్తులైన సోనియాగాంధీ కుటుంబం కాంగ్రెస్ పార్టీ నిధులను వాణిజ్య అవసరాల కోసం వాడుకుని మనీ లాండరింగ్ కు పాల్పడిందని అందులో పేర్కొంది. దాదాపు 998 కోట్ల రూపాయల మనీ లాండరింగ్ జరిగినట్లు పేర్కొంది. ఈ అంశం ఇప్పుడు కోర్టు పరిధిలో ఉంది. ఏప్రిల్ 25న ఈడీ చార్జ్ షీట్ పై విచారణ చేయాలా? వద్దా? అనే అంశంపై న్యాయస్థానం నిర్ణయం తీసుకోబోతోంది.
ఇప్పుడు మీరు చెప్పండి... ఇందులో కక్ష సాధింపు ఏముంది? అసలు ఈ కేసుకు, మోదీ ప్రభుత్వానికి, కిషన్ రెడ్డికి ఏం సంబంధం? 2012లో ఈ కేసు దాఖలైంది. ఈ కేసుపై న్యాయస్థానం విచారణ చేస్తోంది. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ఈ కేసులో ముద్దాయిలు. బెయిల్ తీసుకున్న నిందితులు. ఇందులో బీజేపీ పాత్ర ఏముంది? బీజేపీని తిట్టుపోసుడేంది?
ఈ డూప్లికేట్ గాంధీ కుటుంబం ఏమైనా రాజ్యాంగానికి అతీతులా? ఇటలీ మూలాలున్నయ్ కాబట్టి భారతీయ చట్టాలు వర్తించవనుకుంటున్నారా? ఒక చేతిలో రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరుగుతారు? ఇంకో చేత్తో మేం రాజ్యాంగానికి అతీతులమని చెబుతూ ధర్నాలు, ఆందోళనలు చేయిస్తూ రాజ్యాంగ వ్యవస్థలను కించపరుస్తారా?
నిన్న మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఏం మాట్లాడుతున్నారు? అసలు సభ్యత ఉన్నోళ్లు మాట్లాడే భాషేనా అది? ఈ డూప్లికేట్ గాంధీ కుటుంబం కాంగ్రెస్ నేతలకు ఇచ్చే ట్రైనింగ్ ఇదేనా? ప్రధాని, కేంద్ర మంత్రులమీద ఇష్టమొచ్చినట్లు మాట్లాడాలని ట్రైనింగ్ ఇస్తున్నారా? గాంధీ వారసులమని చెప్పుకుంటూ 50 ఏళ్లపాటు ఈ దేశాన్ని దోచుకున్నది చాలదా? చేసిన తప్పులను ఎత్తి చూపి విచారణ చేస్తుంటే ధర్నాలు, ఆందోళనలతో అడ్డుకోవాలని చూస్తారా?
ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వానికి డూప్లికేట్ గాంధీ కుటుంబమే స్ఫూర్తిగా తీసుకుని 'యంగ్ ఇండియా' బ్రాండ్ నినాదంతో ముందుకు పోతోంది. యంగ్ ఇండియా పేరుతో డూప్లికేట్ గాంధీ కుటుంబం 5 వేల మంది స్వాతంత్ర్య సమరయోధులకు చెందిన 2 వేల కోట్ల విలువైన ఆస్తులను దోచుకుని మనీ లాండరింగ్ పాల్పడితే... ఇక్కడ కాంగ్రెస్ నేతలు యంగ్ ఇండియా బ్రాండ్... ఫోర్త్ సిటీ పేరుతో వేలాది ఎకరాల విలువైన భూములను స్వాధీనం చేసుకుంటూ 50 వేల కోట్లను దోచుకునేందుకు సిద్ధమైంది. ప్రజలు వాస్తవాలు ఆలోచించాలని కోరుతున్నా...
సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ (సీడబ్ల్యూసీ) నివేదిక ప్రకారం దేశంలో 8 లక్షల ఎకరాలకుపైగా వక్ఫ్ ఆస్తులున్నాయి. వీటి విలువ 10 లక్షల కోట్ల రూపాయలకు పైమాటే. వీటిపై ఏటా 12 వేల కోట్ల రూపాయలకు పైగా ఆదాయం వస్తోంది. ఈ సొమ్మును ఏం చేస్తున్నారు? దీనికి లెక్కా పత్రం జమ లేదు. ఆడిటింగ్ ఉండదు. ముస్లింలలో కోట్ల మంది పేదలున్నారు. కనీసం వాళ్ల ప్రయోజనాల కోసమైనా ఖర్చు చేయడం లేదు? ఆ సొమ్మునంతా బడా ముస్లిం సంపన్నులు, ఎంఐఎం నాయకులు, ఒవైసీ కుటుంబం దోచుకుంటోంది. వక్ఫ్ ఆస్తులను కూడా వాళ్లే వాడుకుంటున్నరు. ఒక్క తమిళనాడులోనే వక్ఫ్ ఆస్తుల అన్యాక్రాంతంపై హైకోర్టు ఆదేశం మేరకు విచారణ చేస్తే 2 వేల కోట్ల విలువైన ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని తేలింది.
ఇంకా బాధాకరమేందంటే స్వాతంత్ర్య సమరయోధుల స్మారక చిహ్నాలను, మందిరాలను, గురుద్వారా భూములను కూడా వక్ఫ్ ఆస్తిగా పేర్కొంటూ ఆక్రమించుకుంటున్నారు. తమిళనాడులోని తిరుచిరాపల్లి జిల్లాలోని తిరుచెందురాల్, కడ్లకురిచి గ్రామాలను, ఆ గ్రామాల్లోని 15 వందల ఏళ్ల నాటి పురాతన చంద్రశేఖర ఆలయ భూములను కూడా వక్ఫ్ భూములను పేర్కొంటూ క్లెయిమ్ చేసుకుంది. హర్యానాలోని జత్లానా గ్రామంలో గురుద్వారా భూమిని ఆక్రమించుకున్నారు. కర్నాటకలో లింగాయత్ లకు చెందిన వ్యవసాయ భూమిని, కేరళలలోని మునంబమ్ లో నివసిస్తున్న క్రైస్తవ మత్స్యకారుల భూములను కూడా వక్ఫ్ భూములని క్లెయిమ్ చేసుకుంది. ఇదెక్కడి న్యాయం? వక్ఫ్ బోర్డు పేరుతో ఏం చేసినా చూస్తూ ఊరుకోవాలా? పోనీ వక్ఫ్ ఆస్తులను పేద ముస్లింలకు పంచకుండా, వారి సంక్షేమానికి వినియోగించుకుండా సంపదనంతా ఎంఐఎం నేతలు దోచుకుంటే చూస్తూ ఊరుకోవాలా?
అంతెందుకు అధికారిక లెక్కల ప్రకారం తెలంగాణలో 77 వేల ఎకరాల వక్ఫ్ లాండ్స్ ఉన్నాయి. వీటిలో కేవలం 20 శాతం అంటే 16వేల ఎకరాల భూములు మాత్రమే దర్గాలు, మసీదులు ఆధీనంలో ఉన్నాయి. మిగిలిన 80శాతం లాండ్స్ ఎవరి చేతిలో ఉన్నాయనుకుంటున్నారు? ఓవైసీ లాంటి వారు అక్రమించుకున్నారు. ఆసుపత్రులు, ఆఫీసులు, వ్యాపారాలు చేసుకుంటూ సంపద పెంచుకుంటున్నారు తప్ప పేద ముస్లింలకు ఏనాడైనా సాయం చేశారా? వాళ్ల ఆసుపత్రుల్లోనైనా ఫీజు తీసుకోకుండా ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారా? దమ్ముంటే చెప్పమనండి. వక్ఫ్ ఆస్తులంతే ఒవైసీ తాత సొమ్మనుకుంటున్నారా?
77వేల ఎకరాల్లో ఒక్క గజం కూడా పేదముస్లీంలు అనుభించే పరిస్థితిలో లేరు... వక్ఫ్ భూముల ద్వారా వచ్చే ఆదాయంతో ఒక్క పేదింటి ముస్లీం ఆడపిల్ల పెళ్లి అయినా చేశారా? చాలా వక్ఫ్ లాండ్ కబ్జా కేసుల్లో కాంగ్రెస్ బీఆర్ఎస్, ఎంఐఎం నాయకులు ఉండడంతో కేసులు ఓడిపోయి వక్ఫ్ భూములు కోల్పోయింది... అక్కడ వక్ఫ్ భూములన్నీ కబ్జాలోకి వెళ్లిపోయాయి ఇంకా కేంద్రం తెచ్చే కొత్త చట్టంతో భూముల యాజమాన్య హక్కులను లాక్కుంటుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు.
రాష్ట్రంలో ఉన్న వక్ఫ్ ఆస్తుల విలువ సుమారు 5లక్షల కోట్ల రూపాయలు. ఇంత పెద్దం మొత్తం ఆస్థి కలిగి ఉన్నప్పటికీ, పెద్ద ఎత్తున వీటిని ద్వారా ఆదాయం వస్తున్నా వాటికి లెక్కా పత్రం లేదు. ఈ సొమ్ముతో ఒక్క పేద ముస్లిం జీవితాన్ని బాగుచేయలేదు. పైగా వక్ఫ్ ఆస్తులపై అనేక వివాదాలున్నాయి. కోర్టుల్లో 4వేలకుపైగా కేసులున్నయ్. కనీసం కౌంటర్ ఫైల్ చేయకుండా వక్ఫ్ బోర్డు కావాలనే ఆలస్యం చేస్తోంది... కేసులు రోజురోజుకు పెరుగుతున్నా వక్ఫ్ బోర్డు మాత్రం పూర్తి నిర్లక్ష్యంగా ఉంది. ధరణి సమయంలో కూడా వేలాది ఎకకరాల వక్ఫ్ భూములు చేతులు మారాయి. ఇవన్నీ మాట్లాడుతుంటే వక్ఫ్ ఆస్తుల్లో హిందువుల జోక్యమా? అంటూ అడ్డగోలుగా మాట్లాడుతున్నరు. అరే వక్ఫ్ ఆస్తుల ద్వారా వచ్చిన ఆదాయంతో ఇంతవరకు ఏ ఒక్క పేద ముస్లిం జీవితాన్నైనా బాగు చేశారా? అంతెందుకు ఇక్కడ హైడ్రాను ఏర్పాటు చేశారు కదా? వక్ఫ్ ఆస్తులపై సర్వే చేయించే దమ్ముందా? తక్షణమే విచారణ జరిపించి ఎన్ని భూములు ఆక్రమణకు గురయ్యాయి? వక్ఫ్ ఆస్తులపై ఏటా ఎంత ఆధాయం వస్తోంది? ఆ సొమ్మును వేటి కోసం ఖర్చు చేస్తున్నారు? పేదల సంక్షేమం కోసం ఎంత ఖర్చు చేశారనే వివరాలపై శ్వేత పత్రం విడుదల చేసే దమ్ముందా? కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంటే శ్వేత యో వైట్ పేపర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

# పేదల రైతుల కన్నీటికి భూ భారతి తో వేడుకోలు

వెంకటాపూర్ లో మంత్రులు కొండ సురేఖ, సీతక్కతో కలిసి భూభారతి పైలెట్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు . తర్వాత ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలం పుసాయ్ గ్రామంలో భూభారతి చట్టంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కన్నీటిని తీర్చేందుకే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చాం. ఎన్నికలకు ముందు ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని మేము ఇచ్చిన హామీని ప్రజలు విశ్వసించి ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారు.ఇందిరమ్మ రాజ్యంలో భూ సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యంగా పనిచేస్తాం. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా రైతులకు సేవలు అందిస్తాం. రైతులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే చెప్పులు అరిగేలా అధికారుల చుట్టూ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగారని ఇప్పుడు ఇంకా ఆ అవసరం రైతులకు లేదని అధికారులే రైతుల వద్దకు వచ్చి వారి భూ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ధరణిపై గత పాలకులు ఏనాడు కూడా రెవెన్యూ సదస్సు పెట్టలేదని ఒకవేళ రెవెన్యూ సదస్సులు పెట్టి ఉంటే ఆనాడే ఆ ప్రభుత్వం పై ప్రజలు తిరగబడేవారు. గత బిఆర్ఎస్ పాలకులు చేసిన తప్పులను ఇప్పటికీ గ్రహించడం లేదని వారికి జ్ఞానోదయం కావడం లేదన్నారు.గతంలో గులాబీ దళం కోసం కేసీఆర్ 2020- ధరణి చట్టాన్ని తీసుకువస్తే మేం దానిని బంగాళాఖాతంలోకి విసిరేసి సామాన్య ప్రజల కోసం 2025- భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చాం. రాష్ట్రంలో ఇంతవరకు డాక్యుమెంట్లు లేని అబాదీ ఇల్లు అని పిలుచుకునే నివాసగృహాలకు డాక్యుమెంట్లు ఇచ్చే దిశగా చర్యలు చేపడుతున్నాం.ధరణి దళారులు, గులాబీ పార్టీ గులాములు ఇచ్చే డబ్బుతో ఇందిరమ్మ ప్రభుత్వాన్ని పడగొడితే మీరు ఊరుకుంటారా? అని మంత్రి పొంగులేటి ప్రశ్నించగా ఊరుకోం అని ప్రజల నుంచి స్పందన వచ్చింది.భూ భారతి సమస్యల పరిష్కారానికి గాను తమ కార్యాలయం, సిసిఎల్ఎ కార్యాలయంను అనుసంధానించే టోల్‌ఫ్రీ నెంబరును త్వరలో ప్రజలకు తెలియజేస్తామనీ మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు , గిరిజన, గిరిజనేతరులు ఉండే ప్రాంతంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి కేంద్రప్రభుత్వ నిబంధనలకు లోబడి ఒక కమిటీని నియమిస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

## బీఆర్ఎస్ సభ విజయవంతం కోసం కేసీఆర్ ప్రత్యేక సమావేశం

కార్యాచరణకు సంబంధించిన తగిన సూచనలు చేస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవెల్లి నివాసంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత , ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు, పార్టీ మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు.వారిలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, ఒడితెల సతీష్ కుమార్, పార్టీ మహిళా నేతలు మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, టీఎస్‌పీఎస్సీ మాజీ మెంబర్ సుమిత్రా తనోబా, గిడ్డంగుల శాఖ మాజీ ఛైర్పర్సన్ రజినీ సాయిచంద్, నవీనాచారి, పార్టీ నేతలు మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గాదరి బాల మల్లు, కల్వకుంట్ల వంశీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.



ప్రారంబించారు. నిర్మల్ నియోజకవర్గంలోని రైతులందరూ ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కనీస మద్దతు ధర 3371 /- ఉందని, రైతులందరూ తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని లబ్ధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మ రాజు, ఆకుల కార్తీక్, సుంకరి సాయి, నవీన్, నరేందర్, పద్మాకర్, తో పాటు ధర్మాజీ రాజేందర్, భీమ్ రెడ్డి, రైతులు, మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ గారిని రాజభవన్ లో మర్యాదపూర్వకంగా కలిసిన కేంద్ర హెూమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 18:

## మాయ మాటలతో రంగురంగుల బ్రోచర్లతో తల్లిదండ్రులను మోసం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలు

- జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 18:** రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల ఇండ్ల చుట్టూ తిరుగుతూ మీ పిల్లల భవిష్యత్ మాదేనని మాయ మాటలతో, రంగురంగుల బ్రోచర్లతో అబద్ధపు వాగ్దానాలతో తల్లిదండ్రులను, విద్యార్థులను మోసం చేస్తున్నాయని వీటిపై రాష్ట్రప్రభుత్వ పర్యవేక్షణ కరువైందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ తల్లిదండ్రుల యొక్క బలహీన తలను ఆసరాగా చేసుకొని ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థలు పోటీపడి మోసం చేస్తున్నాయని అన్నారు. దీనికి తోడు పీఆర్వోలు తల్లిదండ్రుల అడ్రస్సులను మరియు ఫోన్ నెంబర్లను తీసుకొని వాళ్లకు ఫోన్ చేస్తూ ఇప్పుడు అడ్మిషన్ తీసుకుంటే మీ పిల్లలకు ఫీజులో రాయితీ ఉంటుందని లేకపోతే లక్షలకు లక్ష రూపాయలు కట్టాల్సి వస్తుందని చెప్తున్నారు. కనీస మౌలిక వసతులు కూడా కల్పించకుండా విద్య పేరుతో పెద్ద ఎత్తున దోపిడీకి సిద్ధమయ్యారని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలం గాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ గౌడ్ బీసీ విద్యార్థి సంఘం నాయకులు గోదా రవీందర్ పాల్గొన్నారు



## రాష్ట్రానికి ఏం చేశారో కిషన్ రెడ్డి చెప్పాలి

- ఊకదంపుడు ఉపన్యాసాలు మానాలి
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం



**హైదరాబాద్, ఏప్రిల్18 ( వెలుతురు):** తెలంగాణలో బీజేపీ,బీఆర్ఎస్ నాటకాలాడుతన్నాయని టీపీసీసీ చీఫ్ మహేహ్ కుమార్ గౌడ్ ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ తో కలిసి కిషన్ రెడ్డి లాలూచీ నాటకాలాడుతున్నారని మండిపడ్డారు. పొద్దున లేస్తే కులాలు ,మతాలు పంచాయతీ పెట్టేప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కిషన్ రెడ్డి కాదు కిస్మత్ రెడ్డి. కష్టం లేకుండా గెలుస్తున్నారని అన్నారు. మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. పొద్దున లేస్తే కిషన్ రెడ్డి ముస్లిమ్ జపం చేస్తడు. అక్బరుద్దిన్ ఒవైసీ మీదనే కిషన్ రెడ్డి రాజకీయం చేస్తడు. పోయిన జన్మలో ఒవైసీ, కిషన్ రెడ్డి బ్రదర్స్ అయి ఉంటారని అన్నారు. చెప్పుతో ఎవరిని కొడతారు కిషన్ రెడ్డి. నువ్ మగాడివి అయితే 10 ఏండ్లలో నీ నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చకు రా అంటూ సవాల్ చేశారు. దిగజారుడు భాష రాజకీయాల్లో మంచిది కాదు. 8 మంది ఎంపీలు ఎమ్మెల్యేలు,ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండీ రాష్ట్రానికి ఏం తెచ్చారని నిలదీసారు.. కిషన్ రెడ్డికి మతం తప్ప అభివృద్ధిపై దృష్టి లేదు. రాష్ట్ర అభివృద్ధిపై కిషన్ రెడ్డి, సంజయ్ ..ఎంపీలతో ఏనాడైనా మాట్లాడారా.పనికిరాని వాళ్లు ఏఐ పోస్టులు పెడితే కిషన్ రెడ్డి వాటిని కాపీ కొడతాడు. బండి సంజయ్ ఎపుడు ఏం మాట్లాడుతాడో ఆయనకే తెలియదు. సన్నబియ్యం కేంద్రానివి అంటడు. మరి బీజేపీపాలిత రాష్ట్రాల్లో ఎందుకివ్వట్లేదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## భగవద్గీత,నాట్యశాస్త్రానికి అంతర్జాతీయ గుర్తింపు

- యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చోటు
- కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పోస్ట్
- భారతీయులు గర్వించే విషయమన్న ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ,ఏప్రిల్18( వెలుతురు):** భారతీయ సంస్కృతి, వారసత్వానికి చరిత్రాత్మక గుర్తింపు లభించింది. శ్రీకృష్ణుడి బోధించిన భగవద్గీతతో పాటు భరతముని రచించిన నాట్యశాస్త్రానికి యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చోటు లభించింది. ఈ విషయాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. భారతీయ జ్ఞాన సంపద, కళాత్మక ప్రతిభను యావత్ ప్రపంచం గౌరవిస్తోంది. ఈ రచనలు మన దేశంపై ప్రపంచ దృక్పథానికి, మన జీవన విధానానికి పునాదులు. ఇప్పటివరకు మన దేశం నుంచి 14 శాసనాలు.. యునెస్కో రిజిస్టర్‌లో చోటు దక్కించు కున్నాయని కేంద్రమంత్రి తన పోస్ట్‌లో వెల్లడించారు. దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయం. గీత, నాట్యశాస్త్రాన్ని యునెస్కో రిజిస్టర్‌లో చేర్చడం.. మన జ్ఞాన సంపద, సంస్కృతికి లభించిన ఘనమైన గుర్తింపు. ఇవి శతాబ్దాలుగా మన నాగరికత, ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించాయి. ప్రపంచానికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. యుద్ధరంగంలో సోదరులు, గురువులు, బంధు జనులందరినీ చూసి ధనుర్బాణాలు విడిచి చతికిల పడిపోయిన అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసిన బోధ- భగవద్గీత. ఇందులో 18 అధ్యాయాలు ఉన్నాయి. మనుషులు ప్రవర్తించవలసిన తీరు, పారలౌకికాన్ని పొందే విధానం రెండింటినీ శ్రీకృష్ణుడు బోధించాడు. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగిన క్షణంగా అభివర్ణించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడూ గర్వించదగ్గ క్షణం. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

## ట్రైన్‌లో అత్యాచారం ఘటన అంతా..ఉత్తిదే

- యువతి నాటకం నడిపినట్లు గుర్తించిన పోలీసులు

**హైదరాబాద్,ఏప్రిల్18( వెలుతురు):** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ట్రైన్‌లో అత్యాచారయత్నం ఘటన కేసు ఇప్పుడు సంచలన మలుపు తిరిగింది. యువతి పై జరిగినదన్న అత్యాచారం అబద్ధంగా తేలింది. ఈ కేసులో రైల్వే పోలీసులు చేపట్టిన లోతైన దర్యాప్తులో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేస్తూ ట్రైన్ లోనుండి జారిపడిన యువతి, అనంతరం తనపై అత్యాచారం జరిగిందని కథ అల్లింది. ఆమె కథనాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో అనుమానితులుగా 100 మందిని పోలీసులు విచారించగా, అసలు విషయానికి దగ్గరయ్యారు. కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పోలీసులు 250 సీసీటీవీ కెమెరాల ఫుటేజీ ని పరిశీలించారు. అనేక కోణాల్లో వీడియోలను అధ్యయనం చేసిన అనంతరం, యువతి కథనాల్లో అనేక అనుమానాస్పద అంశాలు బయటపడ్డాయి. ఎటు-వంటి ఆధారాలు ఆమె చెప్పిన కథనాలను సమర్థించలేదని పోలీసులు తేల్చారు. విచారణలో చివరికి యువతి అసలు విషయం వెల్లడించింది. రీల్స్ చేస్తూ టైన్ నుంచి జారిపడిన విషయాన్ని దాచిపెట్టి, అత్యాచారం జరిగినట్టు అబద్ధం చెప్పినట్టు- ఒప్పుకుంది. పోలీసులు లీగల్ ఒపీనియన్ తీసుకుని, ఎటు-వంటి అత్యాచారం జరగలేదని నిర్ధారించి కేసును మూసివేశారు.

## రాష్ట్రానికి 10,500 కోట్ల భారీ పెట్టుబడులు: సీఎం రేవంత్

### దేశంలోనే హైదరాబాద్ ప్రముఖ డేటా హబ్ గా మారింది

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 18:** జపాన్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం రాష్ట్రానికి మరో రూ.10,500 కోట్ల భారీ పెట్టుబడిని సాధించింది.డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్, ఐటీ సేవల్లో ప్రపంచ ప్రఖ్యాతి గడించిన ఎన్‌టీటీ డేటా (NTT DATA Group Corporation), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ నెయిసా నెట్‌వర్క్స్ (Neysa Networks Pvt Ltd) లుసంయుక్తంగాహైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ AI Data Center Cluster in Hyderabad) ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాయి. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి రూ.10,500 కోట్ల పెట్టుబడితో ఈ క్లస్టర్‌ను నిర్మించేందుకు త్రైపాక్షిక ఒప్పందం (MoU) కుదిరింది.టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఎన్‌టీటీ డేటా, నెయిసా నెట్‌వర్క్‌ల నుంచి బోర్డు సభ్యుడు కెన్ కట్సుయామా డైరెక్టర్ తడావోకి నిషిమురా ఎన్‌టీటీ గ్లోబల్ డేటా సెంటర్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ బాజ్‌పాయ్ నెయిసా సీఈవో, ఎన్‌టీటీ గ్లోబల్ డేటా ఛైర్మన్ శరద్ సంఘీ ఈ ఒప్పందంలో పాల్గొన్నారు.ఈ ఒప్పందం ద్వారా హైదరాబాద్‌లో 400 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ నిర్మితమవుతుంది. 25,000 జీపీయూలతో భారతదేశంలోనే అత్యంత శక్తివంతమైన ఏఐ సూపర్‌కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను ఈ క్లస్టర్ అందిస్తుంది.తెలంగాణను దేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు రూపొందుతోంది. ఎన్‌టీటీ డేటా, నెయిసా




కంపెనీలు సంయుక్తంగా ఏఐ-ఆధారిత సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేసేందుకు ఈ క్లస్టర్ ఆవిష్కరణల కేంద్రంగా నిలుస్తుంది.ఈ ఏఐ డేటా సెంటర్ క్లస్టర్‌ను 500 మెగావాట్ల వరకు గ్రిడ్ విద్యుత్‌తో, మిగిలినది పునరుత్పాదక శక్తి ద్వారా నిర్వహిస్తారు. లిక్విడ్ ఇమ్మర్షన్ వంటి అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీలను అవలంభిస్తారు. ఈ ప్రాజెక్టును ఉన్నత ఈఎస్‌జీ (ఎన్విరాన్‌మెంటల్, సోషల్, గవర్నెన్స్) ప్రమాణాలతో అభివృద్ధి చేస్తారు. తెలంగాణలోని విద్యా సంస్థలతో భాగస్వామ్యంతో ఈ క్యాంపస్ ఏఐ ప్రతిభను పెంపొందిస్తుంది మరియు రాష్ట్ర డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు దోహదపడుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పెట్టుబడి ఒప్పందంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా, సింగిల్ విండో విధానంలో అనుమతులతో పాటు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ప్రతిభావంతులైన నిపుణులు ఏఐ సంబంధిత డిజిటల్ సేవల్లో తెలంగాణను అగ్రగామిగా నిలిపాయన్నారు.ఎడబ్ల్యూఎస్, ఎస్‌టీటీ, టిల్‌మన్ హెూల్డింగ్స్, సీటీఆర్ఎల్ఎస్ వంటి దిగ్గజ కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టులతో పాటు, ఎన్‌టీటీ డేటా భారీ పెట్టుబడి ఒప్పందంతో హైదరాబాద్ దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్‌గా మరింత బలపడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.టోక్యోలో ప్రధాన కార్యాలయం కలిగిన ఎన్‌టీటీ డేటా, ఐటీ సేవలు, డేటా సెంటర్లు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో ప్రముఖ సంస్థ. 50కి పైగా దేశాల్లో 193,000 మంది ఉద్యోగులతో, ప్రపంచంలోని టాప్ 3 డేటా సెంటర్ ప్రొవైడర్లలో ఒకటిగా నిలుస్తుంది. పబ్లిక్ సర్వీసెస్, బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, టెలికాం రంగాలకు సేవలు అందిస్తుంది. నెయిసా నెట్‌వర్క్, ఏఐ-ఆధారిత క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థగా, నిర్దిష్ట ఏఐ కంప్యూట్ సొల్యూషన్స్‌పై దృష్టి సారిస్తుంది.

## దళిత విద్యార్థులు వివక్షను ఎదుర్కోరాదు

- రోహిత్ వేముల చట్టాన్ని రూపొందించండి
- కర్నాటక సిఎం సిద్దరామయ్యకు రాహుల్ లేఖ

**న్యూఢిల్లీ,ఏప్రిల్18( వెలుతురు):** ఆత్మహత్య చేసుకున్న సెంట్రల్ వర్సిటీ విద్యార్థి రోహిత్ వేముల పేరు అందరికీ గుర్తుండే ఉంటుంది. గతంలో పలు కారణాలతో హెచ్‌సీయూలో ఆత్మహత్యకు పాల్పడ్డ దళిత విద్యార్థి రోహిత్ వేముల పేరును చాలా కాలం తర్వాత కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రస్తావించారు. విద్యావ్యవస్థలో నేటికి బలహీన వర్గాలు కుల వివక్షను ఎదుర్కొంటున్నాయని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దళిత విద్యార్థులెవరూ అటువంటి వివక్షను ఎదుర్కోకుండా ఉండాలంటే 'రోహిత్ వేముల' చట్టాన్ని రూపొందించాలని.. రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమలు చేయాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు సూచించారు. ఈ మేరకు కర్ణాటక సీఎంకు రాహుల్ గాంధీ లేఖ రాశారు. నేటికి కూడా మన విద్యావ్యవస్థలో దళిత, ఆదివాసీ, ఓబీసీ వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు ఇటువంటి వివక్షను ఎదుర్కోవడం సిగ్గుచేటు. వెనుకబడిన వర్గాల బిడ్డగా అంబేద్కర్ ఎదుర్కొన్న



కష్టాన్ని మరే బిడ్డా ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలి. కొందరు వ్యక్తులు చూపిన వివక్షతో రోహిత్ వేముల, పాయల్ తడ్వి, దర్శన్ సోలంకి వంటి మంచి భవిష్యత్తు ఉన్న యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఇకనైనా ఈ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని రాహుల్ గాంధీ లేఖలో పేర్కొన్నారు. వేముల రోహిత్ 2016లో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఆత్మహత్యకు యూనివర్సిటీ అధికారులు, ఇతర విద్యార్థి సంఘాలే కారణమనే ఆందోళనలు సాగాయి. దేశవ్యాప్తంగా అనేక రాజకీయపార్టీలు స్పందించాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రెండుసార్లు హైదరాబాద్‌కు వచ్చి వెళ్లారు. పోలీసులు దర్యాప్తు చేసి 2023 నవంబరులో తుది నివేదిక రూపొందించారు.గతేడాది మార్చి 21న దర్యాప్తు అధికారి ఆ నివేదికను న్యాయస్థానానికి సమర్పించారు. అతని ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని హైకోర్టుకు పోలీసులు తెలియజేశారు. అలాగే అతను ఎస్సీ అనేందుకు ఎటువంటి ఆధారాలు కూడా లేవని, బీసీ వడ్డెర కులానికి చెందినవాడని పేర్కొన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు పలు పిటిషన్లలో విచారణను ముగించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ ఈ కేసుపై పునఃదర్యాప్తు కొనసాగించాలని ఆదేశించింది. పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో రాహుల్ కర్నాటక సిఎం సిద్దరామయ్యకు లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది. వెనుకబడిన వర్గాల బిడ్డగా అంబేద్కర్ ఎదుర్కొన్న కష్టాన్ని మరే బిడ్డా ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవడానికి సిద్ధరామయ్య కృషి చేస్తారని తాను నమ్ముతున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు చూపిన వివక్షతో రోహిత్ వేముల, పాయల్ తడ్వి, దర్శన్ సోలంకి వంటి మంచి భవిష్యత్తు ఉన్న ఎందరో యువకులు ప్రాణాలు కోల్పోయారని.. ఇకనైనా ఇటువంటి హత్యలకు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని రాహుల్ అన్నారు.

## మజ్లిస్ పార్టీ ఉచ్చులో కాంగ్రెస్, బిఆర్ఎస్

- మూడు పార్టీలది తెలంగాణను ముంచే ఎజెండా
- ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్18( వెలుతురు):** ప్రజలను దోపిడీ చేసి.. ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడి.. ప్రజల రక్తం తాగిన మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు జీ హుజూరంటున్నాయని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలపై కిషన్ రెడ్డి విర్శలు గుప్పించారు. ఈ మూడు పార్టీలు కలిసి తెలంగాణను ముంచే ఎత్తుగడలు వేస్తున్నాయని ఆయన ఆరోపించారు. శుక్రవారం బేగంపేట హరిత ప్లాజాలో జరిగిన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని.. పార్టీ నాయకులు, శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎందుకు పోటీ- చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మజ్లిస్ పార్టీకి వంగి వంగి సలాం కొడుతున్న రాహుల్ గాంధీ, కేసీఆర్‌లకు బీజేపీని విమర్శించే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. రజాకార్ల వారసత్వాన్ని పొందిన మజ్లిస్ పార్టీకి వ్యతిరేకంగా జాతీయ వాద భావనతో బీజేపీ పోటీ- చేస్తోందని వివరించారు. మజ్లిస్ పార్టీ,రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, ఉద్యమకారుల వారసత్వాన్ని బీజేపీ కొనసాగిస్తోందని గుర్తు చేశారు. మజ్లిస్ పాత బస్తీకే మాత్రమే పరిమితం కాలేదని.. ఆ పార్టీ ప్రస్తుతం తెలంగాణలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో చాప కింద నీరులా విస్తరిస్తోందంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీని ఓడించాలనే లక్ష్యంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మజ్లిస్ పార్టీకి విజయాన్ని కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ మూడు పార్టీలు ఒకే తానుముక్కలుగా కలిసి పని చేస్తున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో మజ్లిస్‌ను గెలిపించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ ప్రజలు చైతన్యంగా ఆలోచించకపోతే,మళ్లీ రజాకార్ల పాలన లాంటి పరిస్థితులు దాపురించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మజ్లిస్ పార్టీ నాయకులు.. పాత బస్తీలోని



హిందువుల ఇళ్లను స్వాధీనం చేసుకుని ప్రజలను ఖాళీ చేయించిన ఘటనలు చాలానే ఉన్నాయన్నారు. తెలంగాణను, హైదరాబాద్‌ను బలి చేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వెనుకాడడం లేదన్నారు. ప్రజలను జాగృతం చేయాలనే పవిత్ర ఉద్దేశంతోనే హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పోటీ- చేస్తోందని చెప్పారు. మాకు గెలుపు ఒక్కటే ముఖ్యం కాదని.. హైదరాబాద్‌ను రక్షించడం కూడా ప్రధాన లక్ష్యమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. మజ్లిస్ పార్టీ మతోన్మాదం, గూండాయిజాన్ని ఎదుర్కొంటూ బీజేపీ ధర్మయుద్ధం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో హైటెక్ సిటీ-లో రంగులు వేసి అభివృద్ధి అంటూ ప్రచారం చేశారు. కానీ అభివృద్ధి పేరు చెప్పి ఎక్కడైతే రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎక్కువ ఉందో అక్కడే పనులు జరిగాయని ఆరోపించారు. ఇరు-కై-న రోడ్లు సైతం నిర్మించారన్నారు. జీహెచ్ఎంసీ స్థితి దారుణంగా మారిందని.. వీధిలైట్లు- కొనడానికి డబ్బుల్లేని స్థితికి దిగజారి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పనితీరు అసమర్థంగా ఉందని.. పౌర సేవల మెరుగుదలకు నిధులు సైతం పెరగడం లేదన్నారు. మజ్లిస్ పార్టీ నుంచి నగరాన్ని రక్షించాలంటే.. చైతన్యంతో ఓటు- వేయాలని ప్రజలకు ఆయన సూచించారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వచ్చినపుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ నాయకులు విదేశీ పెట్టు-బడుల గురించి చెబుతున్నారు..కానీ అవి ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్థిక, పన్నుల సంస్కరణలు ఉగ్రవాదం, మతోన్మాదాన్ని అరికట్టడంతోపాటు- సమర్థవంతమైన విదేశాంగ విధానం.. ఇలా అన్నింటిలో ప్రగతి కనిపిస్తోందని చెప్పారు. గతంలో విద్యుత్ కోసం రైతులు మోటార్ల దగ్గర నిద్రించాల్సి వచ్చేదని..మోదీ పాలనలో విద్యుత్ కోతల్లేని దేశంగా మారిందన్నారు. సనత్ నగర్,మల్కాజ్‌గిరి,దిల్‌సుఖ్‌నగర్, గౌలిపుర,చార్మినార్,నాంపల్లి, సోమాజిగూడ, ఖైరతాబాద్,కూకట్ పల్లి తదితర ప్రాంతాల్లో ప్రజల సౌకర్యాలు మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గౌతం రావు గారిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త ఐకమత్యంగా కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. మజ్లిస్ పార్టీ ఇప్పుడేం ఓల్డ్ సిటీ-కి మాత్రమే పరిమితం కాలేదని, తెలంగాణ వ్యాప్తంగా విస్తరిస్తూ కుట్రలు చేస్తున్నదని ఆయన ఆరోపించారు.

# సంపాదకీయం..

## ప్రజా సమస్యలపై పోరాడేదెవరు ?

దేశంలో సమస్య ఏదైనా ఉద్యమించాల్సిన అసవరం ఏర్పడింది. ఆయా వర్గాలు తమ అవస్థలను తెలియ చేసేందుకు ఎక్కడిక్కడ ఉద్యమ రూపంలో ప్రభుత్వాలకు తెలియచేయాల్సి ఉంటుంది. ఎందుకంటే పార్లమెంట్, అసెంబ్లీలు అధికార పార్టీ, విపక్షాల సొంత ఎజెండాలతో నడుస్తున్నాయి. కేంద్రంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు, ఆయా రాష్ట్రాల్లో పాలక,ప్రతిపక్షాలు కూడా సొంత ఎజెండానే అనుసరి స్తున్నాయి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన జరగడం లేదు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై అందరిదీ ఒకటేదారి. ఈ క్రమంలో జాతీయస్థాయి ఉద్యమం చేస్తేనే విపక్షాలను ప్రజలు నమ్ముతారు. అలాగే ఆయా రాష్ట్రాల్లో ప్రజారంజక పాలన అందిస్తేనే ఇది సాకారం అవుతుంది. తమ రాష్ట్రాల్లో నిరంకుశంగా వ్యవహరిస్తూ వస్తున్న ప్రాంతీయ పార్టీలు కేంద్రంపై యుద్దానికి కదిలినా ప్రజలు నమ్మరని గుర్తించాలి. ఇడి కేసులపై ధర్నాలు చేస్తున్న కాంగ్రెస్ కూడా అసలు ప్రజా సమస్యలపై పోరాటం చేయడం లేదు. కేవలం తన రాజకీయ లబ్దికి అవసరమైన విషయాలపైనే పోరాటాలను, విమర్శలను ఎంచుకుంటోంది. అయితే ఇవన్నీ పక్కన పెట్టి ఉద్యమం చేయడానికి అడపాదడపా లెఫ్ట్ పార్టీలు రంగంలోకి దిగుతున్నా..వాటి బలం చాలడం లేదు. ఇప్పటికే లెఫ్ట్ పార్టీలతో పాటు, దాని అనుబంధ సంస్థలు,కార్మిక సంఘాలు వివిధరూపాల్లో పోరాటాలు చేస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లో సమస్యలను ఆధారం చేసుకుని ఉద్యమిస్తున్నాయి. ఈ దశలో ఇక ఉమ్మడిగా పోరు చేయడానికి అన్ని పార్టీలను కలుపుకుని పోవడానికి సిద్దం కావాలి. అయితే ఆయా రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితుల కారణంగా కొంత వెనకడుగు తప్పడం లేదు. బెంగాల్లో మమతపై పోరాటం చేస్తున్న లెఫ్ట్ పార్టీలకు కాంగ్రెస్‌తో కలసిపోరాడలేక పోతున్నాయి. కేరళలో కూడా అలాంటి పరిస్థితులే ఉన్నాయి. అయితే స్థూలంగా స్థానిక సమస్యలపై పోరాటాలు చేసేలా ఆయా రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవడం అసవరమని అన్ని పార్టీలు గుర్తించాలి. అయితే ఆయా పార్టీల్లో ఉన్న అనైతక్యతను క్యాష్ చేసుకోవాలని బిజెపి ఊస్తోంది. విపక్ష పార్టీలు పాలిస్తున్నా రాష్ట్రాల్లో నేతల అవినీతిపై కూడా బిజెపి కాచుకుని కూచుంది. ఇవన్నీ కూడా బిజెపికి కలసివచ్చేలా ఉన్నాయి. అయితే సమస్యల ఆధారంగా పోరాడాలని వివిధ పార్టీలు ముందుకు వస్తే ప్రజల మద్దతు తప్పకుండా లభిస్తుంది. ప్రధానంగా రైతాంగ, కార్మిక సమస్యలపై ఉద్యమించాల్సిన అవసరం దేశంలో ఏర్పడింది. ఎందుకంటే పెట్రో, గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలు వంటివాటిపై పోరాడాల్సిన అసవరం నిరంతరంగా ఉంది. ఉత్తరాదిలో పది రాష్ట్రాల్లో రైతులు ఆందోళనకు దిగి కేంద్రానికి ముచ్చెమటలు పట్టించారు. గతంలో తమిళనాడు రైతులు కూడా ఢిల్లీ వేదికగా ఆందోళను దిగారు. అయితే రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్రం విఫలమయ్యింది. సాగుచట్టాలను వెనక్కి తీసుకున్నా రైతు సంక్షేమానికి ఒక్క గట్టి నిర్ణయం కూడా తీసుకోలేదు. దీనిని ఆసరగా చేసుకుని రైతులను కలుపుకుని ఉద్యమించేందుకు రాజకీయ పార్టీలు ముందుకు వస్తున్నా..వారిలో నిజాయితీ కానరావడం లేదు. మోడీ పదేళ్ల పాలనలో దేశంలోని సామాన్య ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులు దిగజారాయి. దేశంలో 50 శాతంపైబడి ప్రజానీకం వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. అలాంటి వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టబడింది. రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని ప్రధాని మోడీ హామీలు అటకెక్కాయి. దేశంలో 42 శాతం రైతుల ఆత్మహత్యలు పెరిగాయని అంటున్నారు. గత పదేళ్ల యూపిఎ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలను బిజెపి ప్రభుత్వం మరింత దూకుడుగా అమలు చేస్తోందన్న విమర్శలు ఉన్నాయి. వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకు పోయిందన్న ఇమర్శలను రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదు. దేశంలో రైతుల వద్ద భూములను వివిధ పరిశ్రమల అవసరాల కోసం బలవంతంగా లాక్కొంటున్న తీరును ఎండగట్టాల్సి ఉంది. దేశంలోని 80 శాతం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులున్నారు. ప్రజాస్వామ్య హక్కులపై దాడి కొనసాగుతోంది. ప్రజలను కుల, మత ప్రాతిపదికన విభజిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కులగణన కూడా కేవలం రాజకీయ లబ్ది కోసం తప్ప మరోటి కాదు. నిరుద్యోగం పెరిగింది. ఉన్న ఉద్యోగాలు ఊడి పోతున్నాయి. విద్యా, వైద్యం, ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణ బలంగా నాటుకుంది. కార్పొరేట్ శక్తుల ప్రభావం ప్రభుత్వ పాలనలోకి చొచ్చుకొచ్చేందుకు తలుపులు తెరిచారు. మేక్ ఇన్ ఇండియా నినాదంలో పస లేదు. ఉన్న పరిశ్రమలే మూత పడుతున్నాయి. మొత్తంగా దేశంలో ప్రజలందరూ సమస్యలను ఎదుర్కొంటున్నారు. సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని ప్రజలు గుర్తించారు. ఈ మేరకు దగాపడ్డ వర్గాలను కలుపుకుని ఉద్యమించేందుకు ఉద్యుక్తులు కావాల్సి ఉంది. ప్రజలే తమ సమస్యలను ఎజెండాగా చేయాలి. ఆయా రంగాల్లో ఉన్న వారిని గుర్తించి సమస్యలపై జాతీయస్థాయి పోరాటాలు ఉధృతం చేయాలి. ఇందుకు కలసివచ్చే రాజకీయ పార్టీలను కూడా కలపుకుని పోవాలి. ట్రంప్ సుంకాలు, ఉక్రెయిన్ యుద్ధం ఆర్థిక వ్యవస్థమీద తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆర్థివేత్తలు అంటున్నారు. వృద్ధిరేటు తక్కువగా ఉండడం, ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం, నిరుద్యోగం తీవ్రంగా ఉండడం నేటి పరిస్థితికి అద్దం పడుతోంది. ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. మార్కెట్లమీద గుత్తాధిపత్యం కలిగివున్న బడా కార్పొరేట్లు ఆ పెరిగిన ధరలను వినియోగదారుల మీదకు నెడుతున్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. నిరుద్యోగం మరింత పెరుగుతోంది. పెరిగిన ధరల వలన కొనుగోలు శక్తి తగ్గుతోంది. పెట్రోలు, డీజిల్, గ్యాస్ వినియోగాన్ని తగ్గించకపోవడం వలన రవాణాఛార్జీలు పెరిగి ధరలు అమాంతంగా పెరిగి పోతున్నాయి. విపక్షాలు ఇప్పుడు ఈ సమస్యలపై దృష్టి సారించాలి.

# అట్టడుగు వర్గాలను ఆదుకోవడంలో నిర్లక్ష్యం

- **శ్రామికులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు**

**న్యూఢిల్లీ,ఏప్రిల్18( వెలుతురు):**
సామాజిక న్యాయం అంటే సమాజంలో అట్టడుగున ఉన్న దళితులు, ఆదివాసీలు, బడుగు బలహీనవర్గాలవారు ఇతర కులాలతో పాటు సమానంగా అభివృద్ధి కావడం. అంటరానితనం, కుల వివక్ష అంతం కావాలి. బలహీనులపై దాడులు చేసిన మోతుబరులతో రాజీ కుదిర్చే అధికార యంత్రాంగం తీరు మారి, 'చట్టం తన పని తాను చేసుకునేలా' రూపొందడం విధానాల మార్పు ద్వారానే సాధ్యం. గిరిజనులు కేంద్రీకరించివున్న 30 మండలాల్లో సగం ఆవాసాలకు కనీసం రోడ్డు కూడా లేదని రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు ఘోషిస్తున్నాయి. మహిళపై నేరాలు నానాటికీ పెచ్చరిల్లుతున్నాయి. దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులు, మహిళలు, మైనార్టీ తరగతుల సమస్యల పరిష్కారానికి రాయితీలు కల్పించడం మాత్రమే పరిష్కారం కాదు. శ్రామికులకు, ఆరుగాలం కష్టపడ్డ అన్నదాతలకు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడంలేదు. వారి కష్టఫలితం వారికి దక్కితేనే జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అదే విధంగా కార్మికులకు కనీసవేతనం 18 వేలు చెల్లించడంతోపాటు, కార్మిక చట్టాలను పటిష్టపర్చడం అవసరం.అప్పుడో ఇప్పుడో నష్ట పరిహారం లేదా సబ్సిడీ ఇవ్వడం కాకుండా పంట పండించడానికి చేసిన ఖర్చుకు 50 శాతం అదనంగా ధర రైతుకు చెల్లించేలా చట్టం చేయాలి. కౌలురైతులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపట్ల ప్రత్యామ్నాయ కార్యక్రమం స్పష్టమైన డిమాండ్లు రూపొందించింది. యువ ఉద్యోగులు, ఉపాధ్యాయుల మెడ మీద కత్తిలా వేలాడుతున్న సిపిఎస్ విధానాన్ని తెచ్చింది వాజ్‌పాయ్ ప్రభుత్వమే. మన్మోహన్ సింగ్‌తో పాటు రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాలు దాన్ని యధాతధంగా అమలు చేశాయి. సిపిఎస్ రద్దు చేస్తామని



2014లో హామీనిచ్చిన చంద్రబాబు ఆ ఊసే ఎత్తలేదు. పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేస్తున్న ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర పాలక పార్టీలు ఖజానాను సంపన్నులకు దోచిపెట్టడమేగాక అవినీతిని పెంచి పోషిస్తున్నాయి. ప్రపంచబ్యాంకు ఆదేశిత సంస్కరణలు, జలయజ్ఞం వగైరా అవినీతి అందరికీ తెలిసిందే! అవినీతి రహితంగా ప్రభుత్వ పాలన, పారదర్శకంగా నిర్ణయాలు, పంచాయతీలకు మున్సిపాలిటీలకు నిధులు వంటి అంశాలను ప్రత్యామ్నాయ కార్యక్రమం పేర్కొంది. రాజకీయ అవినీతిని అంతం చేయడం ప్రత్యామ్నాయ శక్తులకే సాధ్యం. ఎన్నికల సంస్కరణలు, ప్రధానంగా దామాషా ఎన్నికల విధానం నేటి అవసరం. మౌలికమైన భూమి సమస్య మొదలు విశ్వ వ్యాపితమైన పర్యావరణ అంశం వరకు అనేక విషయాలపై ప్రత్యామ్నాయ కార్యక్రమం పూర్తిగా సామాన్య పజల కోర్కెలను ప్రతిబింబించేదిగా వుంది. సంపన్నుల కొమ్ముకాసే చర్యలవల్ల కొద్దిమంది కోటీశ్వరులవుతున్నారు. కాబట్టి ఈ విధానాలకు ప్రత్యామ్నాయం రావాలి.

# బిజెపిలో మారుతున్న సమీకరణాలు

- **సమర్ధ అధ్యక్షుడి ఎంపిక కోసం కసరత్తు**
- **పార్టీ,ప్రభుత్వంలో మార్పులు అంటూ ప్రచారం**

**న్యూఢిల్లీ,ఏప్రిల్18( వెలుతురు):**
బిజెపి తదుపరి అధ్యక్షుడి ఎంపికపై బిజెపి ఇంకా స్పష్టత ఇవ్వకున్నా.. సమర్థ నేత అన్వేషణలో ఉన్నట్లు తెలుస్తోంది. దక్షిణ్నాదికి చెందిన, బలహీనవర్గాలకు చెందిన నాయకుడిని ఎంపికచేసే పనిలో ఉన్నట్లు దేశ రాజధానిలో వార్తలు ప్రచారం అవుతున్నాయి. బిజెపి జాతీయ అధ్యక్షుడితో పాటు, పలు రాష్ట్రాల అధ్యక్షులను నియమించాల్సి ఉంది. సామాజజిక సమీకరణాలు కూడా ముఖ్యమే. అన్నింటికీ మించి ఆర్ఎస్ఎస్ భావజాలానికి దగ్గరగా ఉన్న సమర్థ నేత కూడా అవసరమే. ఈ క్రమంలో గతంలో శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు బలంగా వినిపించింది. మధ్యప్రదేశ్ సిఎంగా బలమైన ముద్ర వేసారు. ఇప్పుడు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా మంచిపేరు తెచ్చుకున్నారు. ఆయనపట్ల ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకత ఉండకపోవచ్చు. ఇదంతా ఒక ఎత్తయితే దక్షిణాదిలో పార్టీని బలోపేతం చేసుకునే దిశగా బిజెపి అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో ఇటీవల ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని మోడీ సందర్శించడం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ క్రమంలో త్వరలో భారతీయ జనతా పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ కీలక మార్పులు జరగనున్నట్లు రాజకీయ ప్రచారం సాగుతోంది. మరో వారం పది రోజుల్లో బీజేపీకి జాతీయ అధ్యక్షుడు రానున్నారు. పార్టీపై పూర్తిగా పట్టుబిగించి ప్రభుత్వానికి దిశానిర్దేశర చేయనున్న బలమైన నేతనే పార్టీ అధ్యక్షుడుగా నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నేతలకు, బీజేపీ అగ్రనేతలకు మధ్య చర్చ సాగిందన్న ప్రచారం కూడా ఉంది. ఈ క్రమంలోనే బలమైన నేత అన్వేషణలో ఉన్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, హరియాణా సహా పలు రాష్ట్రాలకు పార్టీ అధ్యక్షులను కూడా నియమించాల్సి ఉంది. పార్టీలో సిద్ధాంతానికి కట్టుబడి ఉండే నేతలను ప్రధాన కార్యదర్శులుగా, కార్యదర్శులుగా నియమించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు.. ప్రధాని మోదీ పూర్తిస్థాయి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరపనున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం ఉంది. పార్టీలో సుదీర్ఘకాలం పనిచేస్తున్నవారికి అవకాశం కల్పించనున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. పార్టీలోనూ,



మంత్రివర్గంలోనూ యువనేతలకు కూడా కీలక ప్రాధాన్యం కల్పించనున్నట్లు- తెలిసింది. నాలుగైదు రాష్ట్రాల్లో గవర్నర్లను కూడా మార్చే అవకాశాలు లేకపోలేదు. మరోవైపు హోంమంత్రి అమిత్ షా కూడా పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ తో చర్చలు జరిపారు. మోదీ కూడా వీరితో మంతనాలు జరిపినట్లు సమాచారం. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలైను కేంద్రంలోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఆయన దక్షిణాదిలో,ముఖ్యంగా తమిళనాడులో ప్రభావంచూపే నేతగా ఎదిగారు.అన్నాడిఎంకేతో బీజేపీ జతకట్టడంతో ఆయన తమిళనాడు అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకున్నారు. అన్నామలైను కేంద్ర మంత్రివర్గంలో చేర్చుకునే అవకాశం కూడా లేకపోలేదని పార్టీ వర్గాలు అంటున్నాయి.

# వైఎస్ జగన్‌కు కేసులో ఈడీ దూకుడు

- **రూ.800 కోట్ల విలువైన ఆస్తుల అటాచ్**
- **ఎంపిగా క్విడ్‌ప్రోకు పాల్పడినట్లు ఆరోపణలు**

**న్యూఢిల్లీ,ఏప్రిల్18( వెలుతురు):**
మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఈడీ బిగ్ షాక్ ఇచ్చింది. జగన్‌కు సంబంధించిన దాదాపు రూ.800 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. 14 ఏళ్లుగా కొనసాగుతున్న మనీలాండరింగ్ కేసులో రూ. 800 కోట్ల విలువైన భూములు, షేర్లను ఈడీ జప్తు చేసింది. 2009 - 2010 కాలంలో నమోదైన అవినీతి ఆరోపణలకు సంబంధించిన కేసులో ఈడీ చర్యలు తీసుకుంది. జగన్ మోహన్ రెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో, ఆయన కంపెనీలకు లాభాలు కలిగించారని దానికి బదులుగా వ్యాపార సంస్థల నుంచి లాభాలు పొందారని ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో ఉన్న భూములు, కొన్ని కంపెనీలలో ఉన్న వాటాలను ఈడీ అటాచ్ చేసినట్టు సమాచారం. ఈ ఆస్తులు జగన్ రెడ్డి వ్యక్తిగతం కంటే ఎక్కువగా ఆయన కుటుంబం, సంబంధిత కంపెనీలు, సహచరుల పేరిట ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే ఈ కేసులో సీబీఐ కూడా విచారణ కొనసాగిస్తోంది. అనేక అవినీతి కేసులో జగన్ ఏ1గా ఉన్నారు. ఆయనపై దాదాపు 14 కేసులు నమోదు అయ్యాయి. ఈ కేసులకు సంబంధించి గతంలో జైలులో దాదాపు 16 నెలల పాటు శిక్ష అనుభవించారు. ఇప్పుడు తాజాగా ఆ కేసులకు సంబంధించి ఈడీ దూకుడు



పెంచింది. జగన్‌కు సంబంధించి ప్రస్తుతం రూ.800 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. 2009- 2010- 2011 మూడు సంవత్సరాల్లో నమోదైన సీబీఐ కేసులను ఆధారంగా చేసుకుని దాదాపు 12 సంవత్సరాలుగా ఈడీ కూడా దర్యాప్తు కొనసాగిస్తోంది. జగన్ కంపెనీలు, బినామీలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారనే అభియోగాలను సీబీఐ గతంలో మోపింది. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను ఆధారంగా చేసుకుని ఈడీ అధికారులు ఈసీఐఆర్ నమోదు చేసి విచారణ కొనసాగించారు. 14 ఏళ్ల తర్వాత రూ.800 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. పునీత్ దాల్మియా కంపెనీకి చెందిన రూ.793 కోట్లు- జప్తు చేసినట్లు- ఈడీ అధికారులు అధికారికంగా ప్రకటించారు. గతంలో కడప జిల్లాలో అక్రమంగా సున్నపురాయి గనులను పునీత్ దాల్మీయా కంపెనీకి కట్టబెట్టడం, వారికి లాభాలు చేకూరడంతో ఆ కంపెనీ నుంచి డబ్బులు తీసుకున్నారనే విషయాన్ని సీబీఐతో పాటు- ఈడీ కూడా విచారణలో వెల్లడించింది. భారతీ సిమెంట్స్ క్విడ్ ప్రోకోకు పాల్పడిందంటూ గతంలో సీబీఐ తన చార్జ్‌షీట్‌లో స్పష్టం చేసింది. ఈడీ అధికారులు కూడా అదే అంశాన్ని స్పష్టం చేశారు. బినామీల పేరుపై ఉన్న ఆస్తులు, క్విడ్ ప్రోకు పాల్పడ్డాక లబ్ది పొందిన కంపెనీలకు చెందిన ఆస్తులను కూడా ఈడీ జప్తు చేసింది. కడప జిల్లాలో ఉన్న సున్నపురాయి గనులను దాల్మియా సిమెంట్స్‌కు కట్టబెట్టడం, వారికి లబ్ది చేకూర్చే విధంగా అప్పటి ఎంపీ జగన్ వ్యవహరించారని ప్రస్తుతం ఈడీ అధికారులు విచారణలో వెల్లడించారు. 2011లో కేసు నమోదు చేసిన సీబీఐ 2013లో చార్జ్‌షీట్ ఫైల్ చేసింది. ఛార్జ్‌షీట్‌లో ఎన్నో ముఖ్యవిషయాలను ప్రస్తావించింది సీబీఐ. భారతీ సిమెంట్స్‌లో దాల్మియా సిమెంట్స్ పెట్టుబడి పెట్టుందని సీబీఐ విచారణలో వెల్లడించింది.

(ఆధ్యాత్మిక చింతన )

## కోరికలే అసలు శత్రువులు !

**తిరుమల,ఏప్రిల్18( వెలుతురు):**
కోరికలు ఎప్పుడూ.. మనలను పరుగులు పెట్టిస్తుంటాయి. అదికావాలి...ఇది కావాలన్న జిహ్వను రగిలిస్తుంటాయి. శరీరమన్నాక మార్పులు సహజం. శరీరం మార్పులకు లోనై పుట్టుక నుంచి చావు వరకు యవ్వనం, వార్థకం వంటి లక్షణాలను పొందుతుంది. యవ్వనంలో ఉంటే ముసలితనం వచ్చేస్తుందని భయపడతాం. ధనవంతులమైతే అనుకోకుండా పేదవాళ్లమైపోతామేమో అని భయపడతాం. ఏ స్థితిలోనూ భయం కలిగించనిది ఒకే ఒక్కటి. అదే వైరాగ్యం. 'నాకు అక్కర్లేదు!' అనుకునే వాడు ఉన్నంత నిర్భయంగా మరెవ్వడూ ఉండడు. 'నాకిది కావాలి!' అనుకుంటే వంద రకాల తాపత్రయాలు పడాల్సిందే. శివుడు మన్మథుని గర్వాన్ని నిర్మూలనం చేశాడు. మనం కూడా శివ భక్తులమై సంసారంలో ఉంటూనే కామవాంఛలను జయించాలి. అది గ్రహిస్తే యాభై ఏళ్లు దాటే సరికి కాస్త నెమ్మదిగా వైరాగ్య మార్గంలో పడతాం. అప్పుడు నిర్భయంగా ఉండగలుగుతాం. జీవితంలో ఏదైనా భయం కలిగించేదే. పాండిత్యం సంపాదిస్తే, అంతకన్నా ఎక్కువ పాండిత్యం ఉన్న వాడు వస్తాడని భయపడతాం. అందంగా ఉంటే ఈ అందం దెబ్బతింటుందేమోనని భయపడతాం. ఆ గర్వాన్ని జయించాలంటే పార్వతీపరమేశ్వరులిద్దరినీ మనం ఆశ్రయించాలి. నారదుడు మొదలుకుని ముఖ్యమైన మునులందరూ నిరంతరం భగవంతుని ధ్యానంలో గడిపారు. వారి మనః పద్మాలలో శివుడు తుమ్మెదలా విహరిస్తున్నాడు. మనమూ అలా నిరంతరం భగవంతుని ధ్యానంలో గడుపుదాం. మనస్సులో భక్తి తప్ప మరేమీ ఉండకూడదు. 'అంతా నువ్వే!' అని భగవంతుణ్ణి వేడుకోవాలి. దేశం బాగుపడటానికి, జీవితం బాగుపడటానికి ఆధ్యాత్మికతను మించిన మార్గం లేదు. శంకరాచార్యుల నుంచి వివేకానందుల వరకు ఇదే ఆచరించి చూపారు. కావాలను కుంటేనే సమస్యలు వచ్చి పడతాయి. అందువల్ల తాహతుకు మంచి కోరికలను కోరుకుంటే సమస్యలు చుట్టుముడతాయి.

## ఓంకార్ నగర్ కాలనీ ముఖ ద్వారం ను ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**వెలుతురు, ఎల్ బి నగర్,ఏప్రిల్ 18:**
రంగారెడ్డి జిల్లా,ఎల్.బి.నగర్ శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఓంకార్ నగర్ కాలనీలోనూతనంగా ఏర్పాటు చేసిన కాలనీ ముఖ ద్వారం(ఆర్చ్ )ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గోని శ్రీధర్ గౌడ్, జైపాల్, అజయ్, అనిల్, సలీం, శ్రీనివాస్, రవి, కాలనీ అధ్యక్షులు యాదగిరి సాగర్, రామస్వామి, వీరయ్య గౌడ్, రవికుమార్, రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## నాగోల్ ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం లో పాల్గొన్న ఎమ్మెల్యే



**వెలుతురు, ఎల్ బి నగర్,ఏప్రిల్ 18:**
ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని నాగోల్ ప్రభుత్వ జెడ్.పీ.హెచ్.ఎస్. పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మంచి అధ్యాపకులు ఉన్నారని, వారు ఉత్తమ బోధన అందిస్తున్నారని పేర్కొన్నారు. చదువుల విషయంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా గట్టి పోటీ ఇస్తున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆకాంక్షించారు.అలాగే ఈ పాఠశాల విద్యార్థులు అద్భుతంగా నృత్యాలు ప్రదర్శించడం హర్షించదగ్గ విషయం అని ఆయన అన్నారు. గతంలో ఈ పాఠశాలలో విద్యార్థుల కోసం అదనపు గదులు నిర్మించడం జరిగిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చిరంజీవి, యువ నాయకులు (కాలేజ్ కమిటీ చైర్మన్) చంద్రశేఖర్ ఆజాద్, పాఠశాల హెడ్‌మాస్టర్ లక్ష్మీదేవి, ఎం.ఆర్.ఓ. రామారావు, సభ్యులు కన్నగౌడ్, మేకల సత్యనారాయణ, జిలకపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఆనంతుల శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం రవి కుమార్, విమల, అలాగే నాగోల్ గ్రామపెద్దలుతదితరులుపాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతలపై సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు: బీజేపీ



**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 18:**
దేశ ప్రధాని నరేంద్ర మోడీ , కేంద్ర మంత్రివర్యులు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డిల గురించి కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్, అంజన్ కుమార్ యాదవ్ లు చేసిన అసభ్యమైన అవమానకరమైన మాటలను తీవ్రంగా ఖండిస్తూ శుక్ర వారం నాడు సరూర్ నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నాయకులు సరూర్ నగర్ పోలీస్ స్టేషన్లో సిఐ సైదిరెడ్డి కి ఫిర్యాదు చేశారు, రాజ్యాంగబద్ధంగా ప్రజాక్షేత్రంలో ప్రజల మెప్పుతో గెలిచిన ప్రజా నాయకులను గౌరవించకుండా కేవలం కాంగ్రెస్ పార్టీ అజెండా కోసం, అసమర్థతను వైఫల్యానని కప్పిపుచ్చుకోవడానికి ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్, అంజన్ కుమార్ యాదవ్ లాంటి కాంగ్రెస్ నాయకులు చేస్తున్న కార్యక్రమాలకు, అసభ్య కరమైన మాటలకు తగిన చర్యలు తీసుకొని ఇకపైన ఇలాంటి వ్యాఖ్యలు చేయ కుండా చూడాలని పోలీస్ స్టేషన్ లో సీఐ కి విజ్ఞప్తి చేయడం జరిగింది.



తూర్కయంజాల్ గ్రామంలో శుక్రవారం రోజున శివునికి పంచామృతాలతో అభిషేకం మరియు అమ్మవారికి పార్వతి మాతకు పంచామృతాలతో అభిషేకం చేసి అష్టోత్తరాలతో పూజలు చేసి శ్రీ చక్రమునకు కుంకుమభిషేకం చేశారు అమ్మవారికి శుక్రవారం రోజున ప్రత్యేక అలంకరణ చేయబడినది భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం కూడా పోశారు

**తూర్కయంజాల్ వెలుతురు ఏప్రిల్ 18:**

# అక్రమ నిర్మాణాలు మీ అనుచరులవే...

### విమర్శించే ముందు ఆత్మ విమర్శ చేసుకో.... ఎమ్మెల్యే మాధవరం!....

### కాంగ్రెస్ యువనేత యుగంధర్ రెడ్డి....

**కూకట్ పల్లి ఏప్రిల్ 18 వెలుతురు:**
ప్రజావాణి కార్యక్రమం వచ్చిందంటే కాంగ్రెస్ నాయకులు ఎగేసుకుని వెళ్లి ఇండ్లు కట్టే వాళ్లపై ఫిర్యాదులు చేసి లక్షల రూపాయలు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, లేదంటే కూల్చివేయిస్తున్నారని, ఇదంతా అధికారుల ప్రోద్బలంతో నడుస్తోందన్న కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన ఆరోపణలు అవాస్తవమని, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించేది స్వయంగా కూకట్పల్లి ఎమ్మెల్యే నని, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ. బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. బాలానగర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అనుచరుల అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేయడానికి వెళితే ఎమ్మెల్యే బతిమిలాడి వెనక్కు వచ్చేయమని ప్రాధేయపడటం సిగ్గుచేటు అన్నారు. ఎమ్మెల్యే అనుచరులైన సతీష్ అరోరా, డేవిడ్, ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డిలు అక్రమ నిర్మాణాలను కడుతున్నారని, వాళ్లపై ఫిర్యాదులు వెళ్లేసరికి, పుండు మీద కారం చల్లినట్లు కాగానే అక్రమంగా నిర్మించిన భవనాలను అధికారులు సీజ్ చేస్తున్నారని, లేదంటే అడిగినంత లక్షల్లో డబ్బులు ఇవ్వాలని ఫిర్యాదు దారులు పేర్కొంటున్నారని, అధికారులు కూడా కుమ్మక్కై అయ్యారని లేనిపోని మాటలు ఎమ్మెల్యేకు చెప్పి ఎక్కించి, ఎమ్మెల్యేను ఉసిగోలిపారని తీవ్రంగా విమర్శించారు. ఎమ్మెల్యేకు కూడా తెలుసు వీళ్ల అక్రమ నిర్మాణాలు, కాకపోతే ఏమీ చేయలేడు, ఎందుకంటే అనుచరగణ గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్నవాళ్లు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించింది మీరు కాదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ... ఇప్పుడు మీరు ఇలా అంటారని తెలిసే... ఆనాడే మీ అనుచరులు నిర్మించే అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేశామని అన్నారు. పేదవాళ్ళు రెండంతస్తులకు అనుమతులు తీసుకుని ఒక అంతస్తు ఎక్కువ వేస్తే అటువంటి వాళ్లను కూడా వదలకుండా మొత్తం భవనాన్ని సీజ్ చేస్తున్నారని ఎమ్మెల్యే అన్న దానిలో ఎక్కడా నిజం లేదని అన్నారు. సతీష్ అరోరా పేదవాడా?...డేవిడ్ పేదవాడా...? పండాల సతీష్ గౌడ్ పేదవాడా...?ఆవుల రవీందర్ రెడ్డి పేదవాడా...? అని ప్రశ్నించారు.



1.బాలానగర్ కల్లు కాంపౌండ్ పక్కన అక్రమంగా నిర్మించిన భవనం ప్రస్తుతం సీజ్ అయిందనీ. విలేఖరులు, అధికారులను చూసుకుంటానని బిల్డర్ అవతారం ఎత్తిన ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, ఆయన మేన అల్లుడు సాయినాథ్ గౌడ్ బిల్డింగ్ యజమాని వద్ద నుండి రూ.7 లక్షలు తీసుకొని ఎవరికీ డబ్బులు ఇవ్వలేదని స్వయంగా యజమాని తేల్చి చెప్పినట్లు ఆయన అన్నారు. ఇక్కడ భవనం యజమాని వద్ద నుండి డబ్బులు బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్, ఆయన మేన అల్లుడు కాదా...? ఇది మోసం కాదా...? 7 లక్షలు రూపాయలు అధికారులకు ఇస్తామని తీసుకున్నాడు, పాపం యజమాని పరిస్థితి ఏంటి.! అని అన్నారు.

2.కూకట్పల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు డేవిడ్ సామాన్య కార్యకర్తగా ఉండి, బిల్డర్ అవతారం ఎత్తి బాలానగర్ డివిజన్ లోని ఫిరోజ్ గూడా పూల్ బాగ్ లో ఏకంగా రెండు భారీ భవనాలను అక్రమంగా నిర్మించాడు. అనుమతులు తీసుకుని ఒకరకమైతే అక్రమంగా అదనంగా మరో 4 అంతస్తులను నిర్మించాడు. డేవిడ్ పేదవాడా...? ఇతను అక్రమంగా నిర్మించిన ఈ రెండు భవనాలను కూకట్పల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేత కోసం బాలానగర్ పోలీసులకు ప్రొటెక్షన్ కోసం ఒక లేఖను కూడా పంపించడం జరిగిందన్నారు. మీరే కాదా ఎమ్మెల్యే...కూల్చివేతలు చేపట్టకుండా అధికారులకు ఫోన్ చేసి ఆపిపించి అడ్డం పడ్డది అన్నారు.

3. బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి నీ అండదండలు చూసుకునే కదా అనుమతులు ఒకరకమైతే నిర్మించింది మరో రకం. అదనంగా మరో మూడు అంతస్తులను అక్రమంగా నిర్మించాడు. ఆవుల రవీందర్ రెడ్డి పేదవాడా...? యెస్...అవును నేనే మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ప్రజావానిలో ఫిర్యాదు చేశాము, అధికారం ఉన్న సమయంలో అధికారులు చర్యలు చేపట్టకపోతే గౌరవ కోర్టులో కేసును వేశాను. గర్వంగా చెప్పుకుంటున్నాను, అది నేనే. అక్రమంగా నిర్మించిన బాలానగర్ కార్పొరేటర్ ఇల్లును ఖచ్చితంగా కూలగొట్టిస్తా అని సవాల్ విసిరారు.

## అట్టహాసంగా సాగిన అక్షర విద్యాసంస్థల నైట్ క్యాంప్...







**కూకట్ పల్లి ఏప్రిల్ 18 వెలుతురు:**
కుకట్ పల్లి లోని అక్షర ఇంటర్నేషనల్ విద్యాసంస్థలో సమ్మర్ నైట్ క్యాంప్ అట్టహాసంగా సాగింది. విద్యార్థిని, విద్యార్థుల కేరింతల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ నైట్ క్యాంపు ముగిసింది. పాఠశాల అంటే కేవలం విద్యనే కాదు వారికి జీవితంలో ఉపయోగపడే మరెన్నో మెలకువలు నేర్పించెందుకు అక్షర విద్యాసంస్థలు తోడ్పడుతున్నాయి. ఈ నైట్ క్యాంప్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య స్నేహాభవం, అవగాహనా ఏర్పడనుంది. సంవత్సర పొడవునా పరీక్షలు, క్లాసుల మధ్య గడిపిన విద్యార్థులకు ఈ సమ్మర్ నైట్ క్యాంప్ ఒక రిలీఫ్ ఇచ్చింది. ఈ నైట్ క్యాంప్ లో పాఠశాల నందు స్వేచ్ఛగా తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులతో గడపడటం ద్వారా వారి మధ్య ఒక స్నేహబంధం ఏర్పడింది. ఈ నైట్ క్యాంప్ లో విద్యార్థిని, విద్యార్థులు సంగీత, సాహిత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. క్యాంప్ ఫైర్, ఆటపాటల మధ్య ఈ నైట్ క్యాంప్ ఉల్లాసంగా జరిగింది. ఈ కాంప్ ఫైర్ వల్ల విద్యార్థులు మధ్య సమైక్యత, సమానభావం ఏర్పడింది అని ఉపాధ్యాయ బృందం తెలిపింది. ఈ సందర్భంగా విద్యాసంస్థల సీఈఓ మదన్ మోహన్ రావు మాట్లాడుతూ విద్యార్థులు మధ్య స్నేహభావం, సమతుల్యత పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా సమ్మర్ నైట్ క్యాంప్ నిర్వహించామని, తద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య ఒక మంచి స్నేహ బంధం ఏర్పడింది అని తెలిపారు. ఈ కార్యక్రంలో విద్యారిని, ఉపాధ్యాయ బృందానికి, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హైమవతి, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ కార్యవర్గ సమావేశం

- రుద్రవరం యాదగిరి విచ్చేసిన సందర్భంగా
- తెలుగు యువత మండల అధ్యక్షుడు ఫజల్ బేగ్



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 18**
మండల కేంద్రంలో మండల తెలుగు యువత అధ్యక్షులు ఫజల్ బేగ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరిన రుద్రవరం యాదగిరి రామన్నపేట మండలానికి వచ్చిన సందర్భంగా గ్రామస్థాయి నాయకులను పరిచయం జరిగింది.రుద్రవరం యాదగిరి మాట్లాడుతూ పార్టీ కోసం అందరితో పాటు కలిసి పార్టీ బలోపేతానికి నేను కూడా మీతో పాటు చేయి కలిపి ముందుకు నడుస్తానని అన్నారు.అందరం కలిసి పార్టీ పూర్వ వైభవం వచ్చు విధంగా కృషి చేద్దామని అన్నారు.అదే విధంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రామన్నపేట మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ ఐకెపి సెంటర్ సందర్శించడం జరిగింది. వడ్ల కొనుగోలు విషయంలో స్థానికంగా బాధ్యులుగా ఉన్న వారు వాళ్ళ ఇష్టానుసారంగా వడ్లను కొనుగోలు చేస్తున్నారు. ప్రతి ఒక్క గింజ ఏ గ్రేడ్ గా తీసుకోవాలని, ప్రతి ఒక్క ఐకెపి సెంటర్ ను అధికారుల సందర్శించాలని, రైతులకు ఎలాంటి నష్టం జరిగిన ఉపేక్షించే ప్రసక్తే లేదు మేము ప్రతి రోజు క్షుణ్ణంగా పరిశీలిస్తూనే ఉంటాం. ఎక్కడ చిన్న పొరపాటు జరిగిన పై స్థాయి అధికారులకు ఇక్కడ జరిగే అవకతవకల గురించి తెలియజేసి, రైతులకు న్యాయం జరిగే విధంగా ఎప్పుడూ తెలుగుదేశం పార్టీ ముందుంటుందని తెలియజేస్తున్నాం.ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి నకిరేకంటి గణేష్, దండుగుల రాములు, బతుల సత్యం, రుద్రవరం యాదగిరి, చిట్యాల అధ్యక్షులు కొంపల్లి అశోక్, చింత లక్ష్మణ్, రాపోలు బలరాం, బొబ్బలి నర్సింహా, వడ్లకొండ నర్సింహ్మా, పోచబోయిన మల్లేశం, కుర్మా మహేందర్, వడ్లకొండ సత్తయ్య, నీల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి...

### సత్ సేవ సంస్కృతి ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు...



**కూకట్ పల్లి ఏప్రిల్ 18 వెలుతురు:**
జిహెచ్ఎంసి పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు నగరానికి అవార్డులు తీసుకురావడంలో వారి పాత్ర కీలకమని సత్ సేవ సంస్కృతి ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు పేర్కొన్నారు. సత్ సేవ సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానంద నగర్ డివిజన్ లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆయన వాటర్ బాటిల్స్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజం నిద్రలేవకముందే నగరంలో ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్య పారిశుద్ధ పరిరక్షణలో నిత్యం సేవలు అందిస్తున్నారని వారు అభినందనీయులన్నారు. పారిశుద్ధ కార్మికులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. పారిశుద్ధ నిర్వహణ పరిశుభ్రతలో కార్మికుల పనితీరు గొప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్ సేవ సంస్కృతి ఫౌండేషన్ ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, కార్యదర్శి రామ్మోహన్ రావు, సలహాదారులు మహేష్ గౌడ్, సభ్యులు సాయి, సుహాస్, నరేష్ పారిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్... 8 బైకులు రికవరీ

## మీడియా సమావేశంలో వెల్లడించిన డీఎస్పీ కె. రామ్మోహన్ రెడ్డి...

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 18:**
వరుస బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు చాకచక్యంగా పట్టుకొని వారి వద్ద నుండి 8 బైక్ లను రికవరీ చేసిన సంఘటన సంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. పూర్తి వివరాల ప్రకారం....సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ డివిజన్ పోలీసు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి డీఎస్పీ కె. రామ్మోహన్ రెడ్డి చోరీ ఘటన వివరాలు వెల్లడించారు. జహీరాబాద్ పట్టణానికి చెందిన ఇంటర్ పూర్తి చేసిన యువకుడు సహా పదో తరగతి చదువుతున్న మైనర్ బాలుడు కలిసి జహీరాబాద్, సదాశివపేట, సంగారెడ్డి, హైదరాబాద్ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన బైకులు లక్ష్యంగా చేసుకొని నిందితులిద్దరూ చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. చోరీ చేసే సమయాల్లో ఎవరైనా అడ్డుకుంటే దాడి చేసేందుకు వేట కొడవలి సహా చాకును నిందితులు వెంటపెట్టుకుని తిరుగుతున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసుకుని రిమాండ్ కు తరలించినట్లు డి.ఎస్.పి వెల్లడించారు. బైకు చోరీలకు పాల్పడుతున్న దొంగలను చాకచక్యంగా పట్టుకున్న సిఐ ఎస్. శివలింగం, ఎస్సై ఎం.కాశీనాథ్, ఐడి పార్టీ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ నర్సింలు, కానిస్టేబుల్స్ సంజీవ్ రావు, ఓం దేవ్, ఎండీ అస్లమ్, ఆనంద్ లను డిఎస్పీ రామ్మోహన్ రెడ్డి అభినందించారు.





ఈ రోజు పట్టుకొన్న 8 బైకులకు సంభందించిన పూర్తి వివరాలు:
(1) AP28BP9618 Pulsar Cr.no. 794/2020 of Alwal Police station,
(2) TS13EP0241 Activa 5G Cr.no. 160/2024 of Mahankali PS(CYB)
(3) TS15ET3826 Pulsar, Cr.no.38/2025 of Zaheerabad Town PS .,
(4) TS15EV7144 CB Unicorn Cr.no.163/2025 of Sadashivpet PS.
(5) TS12EK2859 Activa 5G Cr.no. TS12EK2859 of Zaheerabad Town PS .,
(6) TS15EM 8115 Activa Duet sangareddy Dist.,
(7) TS09FZ9906Activa 6G Banjara hills, Hyderabad.
(8) OD330394 Honda CB trigger Puri District Orissa state.

# డివైఎఫ్ఐ యువ చైతన్య సైకిల్ యాత్ర ముగింపు సభను జయప్రదం చేయండి



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 18**
డ్రగ్స్,గంజాయి,ఆన్లైన్ బెట్టింగ్ లపై యువతను చైతన్య పరుస్తూ డివైఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటి ఆధ్వర్యంలో, నిర్వహిస్తున్న యువ చైతన్య సైకిల్ యాత్ర 20వ తేదీ ఆదివారం రోజున రామన్నపేట మండల కేంద్రంలో ముగుస్తుందని, ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ, డివైఎఫ్ఐ నాయకులు స్థానిక ఎస్సై మల్లయ్య చేతుల మీదుగా కరపత్రాలు విడుదల చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటి సభ్యులు మాజీ వైస్ ఎంపిపి నాగటి ఉపేందర్,జిల్లా సహాయ కార్యదర్శి మెట్టు శ్రవణ్,మండల అధ్యక్షులు శానగొండ రామచంద్రం,మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు నీల ఐలయ్య, చెన్నోజు వినయ్ చారి, గంటపాక శివ, అప్పం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలు ప్రారంభించిన జహీరాబాద్ పట్టణ ఎస్సై కాశీనాథ్



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 18:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్ హనుమాన్ మందిరంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం జహీరాబాద్ పట్టణ ఎస్ ఐ ఎం. కాశీనాథ్ చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభింపజేశారు. ఈ సందర్బంగా పట్టణ ఎస్ ఐ కాశీ నాథ్ హనుమాన్ మందిరంలో సీసీ కెమరాలను ఎర్పాటు చేయడం పట్ల ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వెంకట సాగర్, ఉపాధ్యక్షుడు కృష్ణ చారి, శ్రీశైలం ఆచారి, మాధవరెడ్డి, మఠం విశ్వనాథ్, జగదీశ్వర్, ధన్నారం మాణిక్ ,అప్పం శ్రవణ్, సంతోష్, భరత్ ఓజ తదితరులు పాల్గొన్నారు

# "ప్రతి పౌరుడు యూనిఫాం లేని పోలీసే"


- సీసీ కెమెరాలతో నేరాల అదుపు
- పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ ఎం కాశీ నాథ్ వెల్లడి...



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 18:**
నేరస్తులను పట్టుకోవడంలో దొంగతనాలు నివారించడంలో సీసీ కెమోరాలు ఎంతో ఉపయోగపడుతాయని జహీరాబాద్ పట్టణ ఎస్సై ఎం. కాశీనాథ్ పేర్కోన్నారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్ హనుమాన్ మందిరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమోరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైన దొంగతనాలు జరిగే ఆస్కారం ఉన్న ప్రదేశాలలో సీసీ కెమోరాలు ఎర్పాటు చేసినట్లయితే దొంగలను పట్టుకోనేందుకు సులభం అవుతుందన్నారు. ప్రజలు పోలీస్ లకు సహకరించినప్పుడే సమాజంలో నేరాలను అరికట్టగల్గుతామన్నారు. ప్రతి పౌరుడు యూనిఫాం లేని పోలీస్ అని, ఏక్కడైన నేరాలు, దొంగతనాలు, శాంతి భద్రతలకు విఘాతం కల్గినట్లయితే వేంటనే 100 నంబర్ కు గాని సమీపంలోని పోలిస్ స్టేషన్లకు సమాచారం అందించాలని సూచించారు. హనుమాన్ దేవాలయంలో సీసీ కెమరాలను ఎర్పాటు చేయడం పట్ల ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. వీరిని ఆదర్శంగా తీసుకోని అయా ప్రాంతాలలోని దేవాలయలు, మజ్జిద్, చర్చిలు, ముఖ్యమైన ప్రాంతాలలో సీసీ కెమోరాలను ఎర్పాటు చేసుకొని దొంగతనాలు జరగకుండా ముందు జాగ్రత చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో శాంతినగర్ హనుమాన్ దేవాలయం కమిటీ సభ్యులు, కాలని ప్రజలు పాల్గోన్నారు.

# తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ గారిని మర్యాదపూర్వకంగా కలసిన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 18:**
శుక్రవారం రోజున నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కాంగ్రెస్ కార్పొరేటర్లైన మహాలక్ష్మి రామన్ గౌడ్ మరియు ఇతర కార్పెంటర్లకు ఏఐసీసీ సభ్యులు మరియు తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నట్రాంజర్ గారికి మర్యాదపూర్వకంగా కల్పించడం జరిగింది. ఈ సమావేశంలో వారు డివిజన్ యొక్క అభివృద్ధి మరియు ఇతర అంశాలపై కార్పొరేటర్లకు దిశానియా దేశం చేయించారు. అందరు కలిసి పిసిసి అధ్యక్షులైన మహేష్ కుమార్ గౌడ్ గారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.



# రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

## - హద్నూర్ ఎస్ ఐ రాజశేఖర్....



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 18:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండలం గంగ్వార్ గ్రామ శివారులో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి శవం లభ్యమైందని హద్నూర్ ఎస్ ఐ రాజశేఖర్ శుక్రవారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం...శుక్రవారం మధ్యాహ్నాం అందజా 3 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి తన హీరో హెూండా స్ప్లెండర్ మోటార్ సైకిల్ నంబర్ AP11 M 1716 గలదానిపై ప్రయాణించే క్రమంలో బైకు అదుపు తప్పి క్రింద పడి రక్త గాయాలతో ఘటన స్థంలోనే మరణించినాడు. మరణించిన వ్యక్తి అందాజా 45 నుంచి 50 సంవత్సరాలు వయసు కలిగి ఉండి, తెల్లని షర్టు, నల్లని ప్యాంటు, తలకు ఎర్రని దస్తి ధరించి ఉన్నాడు. ఎవరైనా ఇట్టి వ్యక్తిని గుర్తించినట్లైతే హద్నూర్ పోలీస్ వారికి ఈ సెల్ నంబర్లపై తెలుపగలరని వారు కోరారు.
Hadnoor SIP Cell No:8712656769
Hadnoor PS Cell No: 8712661850
PS Writer Cell No: 8978289929.

# జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో మర్యాద దినోత్సవం






**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 18:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ డిపోలో ఎండి సజ్జనార్ ఆదేశాల మేరకు ప్రతి మాసంలో మూడవ శుక్రవారం మర్యాద దినోత్సవం (courtesy day) జరుపుకోవడం జరుగుతుందని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్పిఎస్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. దీనిలో భాగంగా ఎండి సజ్జనార్ విడుదల చేసిన క్యూఆర్ కోడ్ తో రూపొందించిన కీ చైన్స్ రూపొందించడం జరిగింది. ఈ సందర్భంగా జహీరాబాద్ డిఎస్పి పి రామ్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఈ యొక్క క్యూఆర్ కోడ్ తో రూపొందించిన కీ చైన్స్ ను విడుదల చేయడం జరిగింది. ఈ యొక్క కీ చైన్ ద్వారా అందులో కలిగిన క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే ఆర్టీసీ కి సంబంధించిన అన్ని రకాల సేవలు పొందవచ్చని డిపో మేనేజర్ తెలియజేశారు. ఈ యొక్క స్కాన్ చేసిన తర్వాత ఆన్ లైన్ ద్వారా బస్సు బుకింగ్, సోషల్ మీడియా, గమ్యం యాప్ లను, ఇతరత్రా సేవలను ఈ యొక్క క్యూఆర్ కోడ్ తో పొందవచ్చని డిపో మేనేజర్ తెలియజేశారు. ఈ యొక్క కీ చైన్స్ ను డిఎస్పి చేతుల మీదుగా వారి యొక్క పోలీస్ సిబ్బందికి అందజేయడం జరిగింది. అదేవిదంగా బస్ స్టేషన్ లో పనిచేయుచున్న అత్యుత్తమ ప్రదర్శన కలిగిన సిబ్బందికి , బస్సులో ప్రయాణిస్తున్న నమ్మకమైన కస్టమర్స్ కి ఈ యొక్క కీ చైన్స్ అందజేయడం జరిగింది.

# కొల్చారంలో ఉద్రిక్త పరిస్థితులు

- యువజన సంఘాలు దళిత నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం
- అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు










**కొల్చారం, వెలుతురు న్యూస్ ఏప్రిల్ 18:**
మండల కేంద్రమైన కొల్చారంలో యువజన సంఘాలు దళిత సంఘాల నాయకుల మధ్య వాగ్వాదంతో శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈనెల 14 అంబేద్కర్ జయంతి సందర్భంగా మండల కేంద్రమైన కొల్చారంలో మెదక్ హైదరాబాద్ జాతీయ రహదారి నుండి గ్రామంలోకి వెళ్లే రోడ్డు మధ్యలో దళిత నాయకులు అనుమతి లేకుండా రాత్రికి రాత్రి అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కాగా గతంలో అదే స్థలంలో మల్లీనాథ సూరి, వివేకానంద విగ్రహం ఏర్పాటుకు అనుమతి కోరగా అధికారులు నిరాకరించారని యువజన సంఘాల నాయకులు వాపోయారు. ఇప్పుడు తాము అక్కడ చత్రపతి విగ్రహ ఏర్పాటు ఏర్పాటు చేస్తామంటూ అదే రోజు భూమి పూజ నిర్వహించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం శివాజీ విగ్రహానికి గద్య నిర్మాణం కొరకు గుంత తీస్తుండగా ఒక్కసారిగా దళిత యువకులు, నాయకులు కలిసి జై భీమ్ నినాదాలతో అక్కడికి చేరుకున్నారు. మరోవైపు శివాజీ నినాదాలతో యువజన సంఘాల నాయకులు హెూరెత్తారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై మహమ్మద్ గౌస్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని ఇరు వర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఎవరు వినకపోగా పరిస్థితి విషమించడంతో అదనపు బలగాలను పిలిపించారు. పోలీసు బలగాలు ఇరువర్గాలను చదరగొట్టడంతో గొడవ సద్దుమణిగింది.

**అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే చర్యలు...**

వివాదాస్పదమైన అంబేద్కర్ విగ్రహాన్ని శుక్రవారం డిఎస్పి ప్రసన్నకుమార్ పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అనుమతులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. విగ్రహాలు ఏర్పాటు చేయాలనుకుంటే అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. కొల్చారంలో రెండు విగ్రహాలు అనుమతులు లేకుండా ఏర్పాటు చేశారని వాటిని తొలగించడానికి ఇరువర్గాల వారు సహకరించాలని చెప్పామన్నారు. తహసిల్దార్ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. చిన్న చిన్న సమస్యలే చిలికి చిలికి గాలి వానలా మారుతాయని, ఎవరు కూడా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా నడుచుకోవాలని నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సార భద్రమ్మ పార్థివ దేహాన్ని సందర్శించిన గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్

**కేసముద్రం వెలుతురు ఏప్రిల్ 18:**
కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామానికి చెందిన సార భద్రమ్మ శుక్రవారం పరమ పదించగా వారి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత గోపా డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్.అనంతరం వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని కోరుకుంటూ మృతురాలు భద్రమ్మ కుమారులు సార లాలయ్య గౌడ్,రాజు గౌడ్ లను పరమార్శించి ఓదార్చి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ పరామర్శలో వీరి వెంట గంధసిరి వెంకటేశ్వర్లు, పెదగాని వెంకటేశ్వర్లు,మాజీ ఎంపీటీసీ మేడి ఉపేందర్, కోతి వెంకటరమణ, యుగంధర్ బండారి,తెలంగాణ శ్రీనివాస్ నాయక్,గంధసిరి మల్లేష్, సాంబయ్య,మునికుంట్ల కన్నయ్య, సాంబయ్య తదితరులు ఉన్నారు..





# కాంగ్రెస్ పై ఈడీ ఛార్జ్ షీట్ బీజేపీ కుట్ర

- రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నేత పోలగాని వెంకటేష్ గౌడ్ ఆరోపణ
- రాహుల్, సోనియాలను కేసు లో ఇరికించే ప్రయత్నం: వెంకటేష్ గౌడ్

**వెలుతురు ,హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 18:**



నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్ గాంధీ, సోనియా గాంధీలపై ఈడీ ఛార్జ్ షీట్ దాఖలు చేయడంపై రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నేత పోలగాని వెంకటేష్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీని అణచివేసేందుకు బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. "రెండు దశాబ్దాల నాటి నేషనల్ హెరాల్డ్ ఆస్తుల వ్యవహారంలో అంతా చట్టబద్ధంగానే జరిగింది. అయినా, కాంగ్రెస్ పార్టీని ఇబ్బంది పెట్టేందుకు బీజేపీ ఈడీతో ఛార్జ్ షీట్ దాఖలు చేయించింది" అని వెంకటేష్ గౌడ్ విమర్శించారు. రెండు సంస్థల మధ్య జరిగిన వ్యాపార లావాదేవీలపై ఈడీ కేసులు బనాయించడం చట్టపరంగా చెల్లదని ఆయన పేర్కొన్నారు.దేశంలో కాంగ్రెస్ ఎదుగుదలను బీజేపీ జీర్ణించుకోలేకపోతోందని, అందుకే సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను సొంత ఏజెన్సీలుగా వాడుకుంటోందని వెంకటేష్ గౌడ్ ఆరోపించారు. దేశంలో బీజేపీ మతతత్వ రాజకీయాలను ఎదుర్కొనేందుకు అన్ని రాజకీయ పార్టీలను కేసుల పేరుతో భయపెట్టినట్లుగా కాంగ్రెస్ పార్టీని భయపెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు సాగనివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. భారత స్వాతంత్ర సమర యోధులను, దేశ మహోన్నత నేతలను, వారు చేసిన కృషిని బీజేపీ అవమానపరుస్తోందని వెంకటేష్ గౌడ్ అన్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని వ్యాఖ్యానించారు. బీజేపీ చేస్తున్న నీచ రాజకీయాలకు, ప్రతీకార చర్యలకు ఇది నిదర్శనం అన్నారు. త్వరలో బీజేపీ మీద ప్రజలే ఛార్జ్ షీట్ వేసే సమయం దగ్గరపడిందన్నారు. కార్పోరేట్ శక్తులకు దేశాన్ని ఎలా దోచిపెడుతున్నారో ప్రజలు గ్రహిస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ తరపున ఖచ్చితంగా న్యాయ పోరాటం చేస్తామని, చివరకు సత్యమే గెలుస్తుందని వెంకటేష్ గౌడ్ స్పష్టం చేశారు.

## కాచిగూడలో రోడ్డుపై పడిన భారీ వృక్షం....

- సకాలంలో స్పందించి వృక్షాన్ని తొలగించి, ట్రాఫిక్ ను క్లియర్ చేసిన ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది...
- కాచిగూడ ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి అభినందన వెల్లువ...






**వెలుతురు,హైదరాబాద్ 19ఏప్రిల్:**
నగరంలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి కాచిగూడ డీమార్ట్ సమీపంలో ఉన్న ఓ భారీ వృక్షం రోడ్డు పై కూలి పడింది. ఆ సమ యంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో పెను ప్రమాదమే తప్పింది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్న కాచిగూడ రైల్వేస్టేషన్ ప్రధాన రోడ్డు వద్ద పెద్ద చెట్టు రోడ్డు మధ్యలోకి కూలి పోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. విషయం తెలుసుకున్న కా చిగూడ ట్రాఫిక్ ఇన్స స్పెక్టర్ ఎ.శ్రీని వాస్ సకాలంలో స్పందించి, హుటా హుటిన ఘటన స్థలానికి చేరుకొని, స్థానిక యువకులు, పోలీస్ సిబ్బం దితో దాదాపు 2గంటల పాటు శ్రమించి కూలిన వృక్షాన్ని తొలగిం చారు. రోడ్డును క్లియర్ చేసి ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు. దీంతో స్థానికు లు, వాహన దారులు కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ శ్రీనివాస్ ను, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎఎస్ఐ అనిల్ గౌడ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## బేగంపేట్ లోతట్టు ప్రాంతాలు జలమయం

- ఇబ్బందులను ఎర్కొన్న పలు వాహన దారులు.

**వెలుతురు, బేగంపేట్, ఏప్రిల్, 18,**
బేగంపేట్ లోని పలు లోతట్టు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం పడిన వర్షానికి జలమయం అయ్యాయి. దింతో పలు వాహన దారులు, పాదాచరులు నానా ఇబ్బందులను ఎర్కొన్నారు. బేగంపేట్ లోని శ్యామ్ లాల్, ప్రకాష్ నగర్, పాటిగడ్డ, రసూల్ పురా, బ్రమ్మనవాడి, తదితర ప్రాంతాల్లో వర్షం నీరుతో విధుల్లో జలమయం అయింది. దింతో ఆయా విధుల్లో పలు వాహన దారులు,



ప్రజలు మోకాళ్ళ లోతో వర్షపు నీటిలో నుంచి దాటి వెళ్లే పరిస్థితి నేలకొంద ని పలువురులు పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో వర్షపు నీరు ఆగకుండా తగు చర్యలు తీసుకోవాలని జి హెచ్ యమ్ సి అధికారులకు ఎన్నిసార్లు దృష్టికి తీసుకెళ్లిన వారు పట్టించుకోవడం లేదని ఆయా కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బేగంపేట్ డివిజన్ లోని అయా విధుల్లో చిన్న పాటి వాన పడిన రోడ్ల పైన నీరు చేరుతుందని ప్రజలు పేర్కొన్నారు. ఇప్పటి కైనాఆయా కాలనీ లో వర్షపు నీరు నిలువకుండా తగు శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

# రాచాల ఉదయపు నడకలో ఉప్పెనలా తరలివచ్చిన జనం

- శ్రీరంగాపూర్ మండలాన్ని అభివృద్ధి చేయండి
- డిగ్రీ కళాశాల మరియు 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలి
- రంగనాయక స్వామి ఆలయానికి పర్యాటక శోభ కల్పించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి రాచాల విజ్ఞప్తి



**వనపర్తి జిల్లా వెలుతురు ఏప్రిల్ 18:**
అభివృద్ధికి నోచుకోని శ్రీరంగాపూర్ మండలాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన రాచాల మార్నింగ్ వాక్ కార్యక్రమానికి ప్రజలు ఉప్పెనలా తరలివచ్చారు. ఉదయం మండల కేంద్రానికి చేరుకున్న రాచాలకు నాయకులు డప్పు చప్పుళ్ళతో స్వాగతం పలికారు. పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేద్కర్, భగీరథ, వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి, స్థానిక ప్రజలతో కలిసి వారి సమస్యలు తెలుసుకుంటూ గ్రామంలోని అన్ని వార్డులలో నడక సాగించి రంగనాయక స్వామి ఆలయంలో ముగించారు. ఈ సందర్భంగా రాచాల



మాట్లాడుతూ మండల కార్యాలయాలు లేక ప్రజలు, ఉద్యోగులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే వాటిని నిర్మించాలన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరియు 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరారు. రంగ సముద్రం కట్ట కింద నివాసం ఉంటున్న ప్రజలు వర్షాకాలం భయంతో జీవిస్తున్నారని, ఊట నీరు ఇండ్లలోకి రావటంతో ఇండ్లు మెత్తబడి కూలిపోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి మరోచోట పునరావాసం కల్పించి ఆదుకోవాలని కోరారు. మండల కేంద్రంలో బస్టాండు లేకపోవడంతో ప్రజలు ఎండకు, వర్షానికి రోడ్డుమీద నిలబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఉందని, ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండు నిర్మించాలని లేనిపక్షంలో కనీసం బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని కోరారు. వందల ఏళ్ల చరిత్ర.. సంస్థానాదీశుల కాలంనాటి ఆలయాలకు పర్యాటక శోభ ప్రతిపాదనలకే పరిమితమవుతోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే గారు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రసిద్ధిగాంచిన శ్రీ రంగనాయక స్వామి ఆలయం అభివృద్ధి, టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించి, ఈప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల అధ్యక్షులు ధర్మేంద్ర సాగర్, ప్రధాన కార్యదర్శి అస్కని రమేష్, నాయకులు పాండురంగ యాదవ్, వివి గౌడ్, రాఘవేందర్, మహీందర్ నాయుడు, దేవర శివ, గుంటి రవి, రాజేష్, రవి నాయుడు,బీసన్న, సుమన్, ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# వనస్థలి పురం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ సుధీర్ బాబు

**వెలుతురు, వనస్థలి పురం,ఏప్రిల్ 18:**
వనస్థలి పురం పోలీస్ స్టేషన్ ను శుక్ర వారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు తనిఖీ చేశారు, ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు, అలాగే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన వెంటనే వాటిపై విచారణ చేపట్టాలని ఆదేశించారు, అలాగే పోలీస్ స్టేషన్ లో సిబ్బంది తమ విధులు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు, అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళలకు భద్రత కల్పించాలని ఆదేశించారు, అలాగే మహిళా ఫిర్యాదులపై విచారణ తక్షణం చేపట్టాలని ఆదేశించారు,పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు, వేసవి సెలవుల సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు



తావు లేకుండా అలాగే దొంగ తనాలు జరుగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను సీపీ సుధీర్ బాబు ఆదేశించారు, సీపీ తనిఖీ కార్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ సీఐ,ఎస్ ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు,

# మద్యం విక్రయాల్లో ఎప్పడూ జోక్యం చేసుకోలేదు

- అందుకు కర్త,కర్మ, క్రియ అంతా రాజ్ కసిరెడ్డి
- లిక్కర్ స్కామ్ సిట్ విచారణలో విజయసాయిరెడ్డి

**విజయవాడ,ఏప్రిల్18( వెలుతురు):**



గత జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం విక్రయాల్లో తాను ఎప్పుడు జోక్యం చేసుకోలేదని రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. నాటి మద్యం విక్రయాల్లో కర్మ, కర్త, క్రియ అంతా రాజ్ కసిరెడ్డి అని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఏపీ లిక్కర్ స్కామ్ వ్యవహారంపై విజయవాడ నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సిట్ విచారణకు విజయసాయిరెడ్డి హాజరయ్యారు. అనంతరం విజయసాయిరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాజ్ కసిరెడ్డి మూడు కంపెనీలు ఏర్పాటు- చేసి.. కొత్త మద్యం బ్రాండ్‌లను తయారు చేసి విక్రయించిన సంగతి తనకు తెలియదన్నారు. అందులో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి పాత్ర గురించి సైతం తనకు తెలియదని సిట్ అధికారులకు స్పష్టం చేశానన్నారు. వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సిట్ విచారణకు హాజరయ్యారు. సిట్ బృందం దాదాపు 3 గంటల పాటు ఆయన్ని విచారించింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ..మద్యం అమ్మకాల విషయంలో ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని స్పష్టం చేశాను. అన్ని ప్రశ్నలకూ రాజ్ కసిరెడ్డే సరైన జవాబులు చెప్తాడని చెప్పా. మొత్తం నాలుగు ప్రశ్నలు అడిగారు. నా సమాధానాలతో తృప్తి చెందారని భావిస్తున్నా. మరోసారి పిలిచినా వస్తానని సిట్ అధికారులకు చెప్పాను. రాజ్ కసిరెడ్డిని ప్రశ్నిస్తే మరిన్ని వివరాలు తెలుస్తాయి. జగన్ పక్కనున్న కోటరీ నాపై లేనిపోనివి చెప్పి ఆయన మనసు మార్చింది. కోటరీ వేధింపులు తాళలేక అనేక ఇబ్బందులు పడ్డా. నా నెంబర్-2 స్థానం రెండువేల స్థానానికి పడిపోయింది. గతంలో జరిగిన రెండు సమావేశాల గురించి సిట్ అధికారులు తనను ప్రశ్నించినట్లు తెలిపారు. ఆ రెండు సమావేశాల్లో ఏం చర్చించారని, ఎవరెవరు పాల్గొన్నారని సిట్ అధికారులు అడిగారన్నారు. మొదటి సమావేశం హైదరాబాద్‌లో జరిగిందని, విజయవాడలో జరిగిన రెండో సమావేశంలో లిక్కర్ పాలసీపై చర్చించామని సిట్ అధికారులకు చెప్పానన్నారు. ముడుపుల గురించి అడిగారు. నాకు తెలియదని చెప్పాను. రాజ్ కసిరెడ్డి వసూలు చేసిన డబ్బులు ఎవరికి వెళ్లాయో నాకు తెలియదు. ఎవరికైనా సిఫారసు చేశారా? అని అడిగారు. రెండు కంపెనీలకు సిఫారసు చేశానని చెప్పాను. ఒకరికి రూ.60 కోట్లు, మరొకరికి రూ.40 కోట్లు ఇచ్చారని చెప్పా. రుణం మాత్రమే ఇప్పించాను. నిధుల వినియోగం గురించి తెలియదని చెప్పాను. వ్యవసాయం చేసుకుంటానన్న వ్యక్తికి రాజకీయాలు ఎందుకని అంటు-న్నారు. నేను ఎప్పుడూ ఎంపీ కావాలని అడగలేదు. రాజకీయాల్లోకి మళ్లీ రావాలంటే ఇతరుల అనుమతి అవసరం లేదు. ప్రజలు ఎప్పుడు కోరుకుంటే అప్పుడు మళ్లీ రీ ఎంట్రీ- ఇస్తా. వారి న్యూస్ ఛానల్‌లో నాపై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. మద్యం స్కామ్‌లో బిగ్‌బాస్ ఎవరో రాజ్ కసిరెడ్డిని అడగాలని విజయసాయిరెడ్డి అన్నారు.

## మత విద్వేషాలు రెచ్చగొడుతున్న జగన్: నిమ్మల

**పాలకొల్లు,ఏప్రిల్18( వెలుతురు):**
మరోసారి అధికారం కోసం జగన్ విద్వేషాలు రెచ్చగొడుతున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పాస్టర్ ప్రవీణ్ రోడ్డు ప్రమాద ఘటనపై దుష్ప్రచారం చేసి.. మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూశారని అన్నారు. వక్ఫ్ బిల్లుపై వైకాపా ద్వంద్వ వైఖరి దేశవ్యాప్తంగా అందరికీ తెలిసిందని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో శుక్రవారం మంత్రి నిమ్మల పర్యటించారు. పోడూరులో రూ. 2.62 కోట్లతో పంటకాల్వల వద్ద రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్ చరిత్రలో ఓటింగ్ అయ్యాక విప్ జారీ చేసిన ఘనత జగన్‌దే. నాస్తికుడిని తితిదే ఛైర్మన్‌గా నియమించడం జగన్ చేసిన తప్పు. ఆయనకు చెందిన రూ. 800 కోట్ల విలువైన షేర్లను ఈడీ సీజ్ చేసింది. దేశంలోని విచారణ సంస్థలన్నీ ఆయన్ని వేలెత్తి చూపుతున్నాయని పేర్కొన్నారు.

## బెట్టింగ్ యాప్‌లపై త్వరలోనే నిసేధం

- సమగ్రచట్టం తెస్తామన్న మంత్రినారా లోకేశ్



**అమరావతి,ఏప్రిల్18( వెలుతురు):**
బెట్టింగ్ యాప్‌లపై రాష్ట్రంలో ఉక్కుపాదం మోపుతామని మంత్రి లోకేష్ హెచ్చరించారు. బెట్టింగ్ యాప్‌లపై లోకేష్ స్పందించారు. బెట్టింగ్ యాప్‌ల వలన జీవితాలు నాశనం అవుతున్నాయని తనకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఎక్స్‌లో పెట్టిన ఒక పోస్టుపై లోకేష్ తీవ్రంగా స్పందించారు. బెట్టింగ్ యాప్‌లపై రాష్ట్రంలో ఉక్కుపాదం మోపుతామన్న లోకేష్.. ఏపీలో బెట్టింపు యాప్‌ల నిషేదానికి సమగ్ర విధానాన్ని తీసుకువస్తామని తెలిపారు. ఇది దేశానికే ఆదర్శంగా ఉండే విధానంగా ఉంటుందని చెప్పారు. న్యాయపరమైన అన్ని అవకాశాలను ఉపయోగించుకుని బెట్టింగ్ సంస్కృతిని ఆపేందుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. బెట్టింగ్ యాప్‌ల వలన జీవితాలు నాశనం అవుతున్నాయని పేర్కొన్నారు. అనేక మంది బెట్టింగ్ యాప్‌లకు ఆకర్షితులై ఆర్థికంగా దెబ్బతింటున్నారని, ఇట- వంటి పరిస్థితి నుంచి వారిని కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బెట్టింగ్ యాప్‌లలో జూదం ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు కూడా చైతన్యం కావాల్సి ఉందన్నారు.

# డిప్యూటీ సీఎం పవన్ పెద్ద మనసు

- గిరిజనుల ముఖాల్లో చిరునవ్వులు
- కాళ్లకు చెప్పులతో కనిపించిన గిరిజనులు



**అమరావతి,ఏప్రిల్18( వెలుతురు):**
డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం పెదపాడు గ్రామస్థులందరికీ చెప్పులు పంపిణీ చేశారు. ఇటీవల అడవితల్లి బాట అనే కార్యక్రమంలో భాగంగా పవన్ ఆదివాసీ గ్రామం పెదపాడులో పర్యటించిన సమయంలో పాంగి మిథు అనే వృద్ధురాలు పవన్‌కళ్యాణ్ కోసం నడిచి వచ్చి స్వాగతం పలికారు. ఆ వృద్ధురాలితో పాటు గ్రామంలోని అనేక మంది మహిళలు చెప్పులు లేకుండా ఉన్నట్లు ఆయన గుర్తించారు. వారిని కనీసం చెప్పులు లేకండా చూసి చలించి పోయారు. గ్రామంలో ఎంత మంది జనాభా నివసిస్తున్నారని స్థానిక అధికారులను అడిగారు. ఆ గ్రామంలో దాదాపు 345 మంది నివసిస్తున్నారని తెలుసుకున్నారు. వెంటనే వారందకీ ఏ సైజు చెప్పులు సరిపోతాయో తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాజాగా గురువారం గ్రామంలోని అందరికీ డిప్యూటీ–సీఎం కార్యాలయ సిబ్బంది చెప్పులు పంపిణీ చేశారు. పవన్ కళ్యాణ్ నుంచి బహుమతి అందుకున్న తర్వాత గ్రామస్థులు భావోద్వేగానికి గురయ్యారు. డిప్యూటీ సీఎంకు గ్రామస్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మా పవన్ సర్ వచ్చి మా పోరాటాలను గుర్తించారు. మరే ఇతర నాయకుడు మా సమస్యలను పట్టించుకోలేదు. మా గ్రామాన్ని సైతం ఎవ్వరూ సందర్శించలేదు. మా గ్రామాన్ని సందర్శించి తమ ఇబ్బందులను పరిష్కరించినందుకు ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలని ఓ గ్రామస్థుడు భావోద్వేగానికి గురయ్యాడు. తమ కోసం ఏకంగా ఉప ముఖ్యమంత్రే చెప్పులు పంపడంతో వాటిని ధరించి సంతోషం వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బంది బోయిపల్లి పవన్‌తోపాటు బృంద సభ్యులు, స్థానిక సర్పంచి వెంకటరావు గురువారం ప్రతి ఇల్లు తిరుగుతూ వాటిని పంపిణీ చేశారు. తమ కష్టం తెలుసుకొని.. చొరవ తీసుకొని తీర్చిన పవన్‌కల్యాణ్‌కు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.

# కాకాణి ఎక్కడున్నా బయటకు రావాలి

- వీధిభాష మాట్లాడడం జగన్‌కు సరికాదు
- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి




**నెల్లూరు,ఏప్రిల్18( వెలుతురు):**
మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి.. గత నెలరోజులుగా పరారీలో ఉన్నారు. ఆయన కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఏపీ ఇలా తదితర ప్రాంతాల్లో పోలీసుల వేట కొనసాగు తూనే ఉంది.. బంధువులు, స్నేహితుల నివాసాలపై కూడా నిఘా పెట్టారు పోలీసులు.. అయితే, కాకాణి ఆచూకీ చెబితే బహుమతి ఇస్తాను అంటూ బంపరాఫర్ ఇచ్చారు మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఎక్కడున్నాడో తెలియడం లేదు.. నేను ఆఫర్ ఇస్తున్నాను.. వైసీపీ వాళ్లు కానీ ఎవరైనా కావచ్చు ఆయన ఆచూకీ తెలిపితే కాకాణి ఇంటి పక్కన ఉన్న కరోనా హౌస్ ను బహుమతిగా ఇద్దామని ఆలోచిస్తున్నా అని ప్రకటించారు.. అందరూ ముందుకు రండి.. కాకాణి ఆచూకీ తెలపాలని కోరారు.. పోలీసుల చొక్కాలు విప్పుతానని అన్నాడు.. సవాళ్లు విసిరారు.. తొడలు కొట్టారు.. ఇప్పుడు ఎక్కడున్నారు..? పిరికి పందలా దాక్కున్నారు..! అంటూ కాకాణిపై ఘాటు ఎమ్మెల్యే సోమిరెడ్డి వ్యాఖ్యలు చేశారు.. గతంలో నాకు విదేశాలలో ఆస్తులు.. విదేశీ బ్యాంకులలో ఖాతాలున్నట్టు– తప్పుడు పత్రాలు విడుదల చేశారు.. ఆ కేసులో రెండు నెలల పాటు– దాక్కున్నారు.. సుప్రీంకోర్టు ఇచ్చిన కండిషన్ బెయిల్ తో బయటకు వచ్చారు.. ఇక, వైసీపీ ప్రభుత్వం రాగానే దోపిడీకి పాల్పడ్డారు.. నాపై తప్పుడు కేసులు పెట్టారు అని మండిపడ్డారు.. కాకాణి మాట్లాడిన భాష సరికాదు అని హితవు పలికారు.. అలాగే వల్లభనేని వంశీ కూడా.. జగన్ కు ఏమాత్రం మానవత్వం ఉన్నా వల్లభనేని వంశీ మాట్లాడినప్పుడే చర్యలు తీసుకోవాల్సిందని సోమిరెడ్డి అన్నారు.. ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్ కూడా పోలీసులపై మాట్లాడిన బాష సరికాదు.. అంత దిగజారి పోతారనుకోలేదన్నారు. కాకాణి దర్శనమిస్తే చూడాలని ఉంది.. చాలా రోజులైంది.. మంత్రులుగా పనిచేసిన వాళ్లు ఇలా పిరికివాళ్లుగా పారిపోతారని అనుకోలేదు అంటూ సెటైర్లు వేశారు.

# ఎసిబికి చిక్కిన నస్పూర్ ఎస్ఐ

**మంచిర్యాల,ఏప్రిల్18( వెలుతురు):**
మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ నెల్కి సుగుణాకర్ శుక్రవారం ఎసిబికి దొరికిపోయారు. ఎస్ఐపై ఆర్‌టివో కేసు నమోదు చేసినట్లు ఎసిబి, ఎసిపి విజయ్‌కుమార్ తెలిపారు. ఎసిపి విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... జనవరి 25వ తేదిన జరిగిన ఒక కేసు విషయంలో ప్రభంజన్ అనే వ్యక్తి నుండి 2 లక్షలు రుపాయలను ఎస్ఐ సుగుణాకర్ తీసుకొని సీజ్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. నేరంలో పాల్గొన్న వారిని అరెస్టు చేసి 2 లక్షల రుపాయలు స్వాధీనం చేసుకొని వారిని జ్యుడిషియల్ కస్టడికి తరలించడం జరిగిందన్నారు. ఈ విషయంలో ప్రభంజన్ కోర్టును ఆశ్రయించి తన డబ్బు విడుదల ఆర్డర్‌ను పొందడం జరిగిందన్నారు. నిందితుడు ఎస్ఐ సుగుణాకర్ ఈనెల 5వ తేదిన ప్రభంజన్‌ను పిలిచి అతని చేతిలో లక్షా 50 వేలు ఇచ్చి ఫొటోలు తీసుకొని మళ్లీ డబ్బులు గుంజుకోవడంతోపాటు డబ్బులు ముట్టినట్లు రైటర్ వద్ద సంతకం పెట్టాలని అనడంతో ఫిర్యాది ప్రభంజన్ పెట్టకపోవడంతో తరువాత రావాలని పంపించడాన్ని తెలిపారు. తిరిగి ఈనెల 8న ప్రభంజన్ పోలీస్‌స్టేషన్ వెళ్లగా డబ్బులు ఖర్చు అయ్యాయని 50 వేలు రూపాయలు మాత్రమే ఇస్తానని చెప్పడంతో ప్రభంజన్ ఎసిబి శాఖను ఆశ్రయించాడు. దీంతో ఈ నెల 10న ప్రభంజన్‌కు ఆడియో రికార్డు చేయడం కొరకు పంపించడం జరిగిందన్నారు. అన్యాయంగా వ్యవహరించడం వల్ల ఎస్ఐని అరెస్టు చేసి కరీంనగర్ ఎస్‌పిసి, ఏసిబి కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపర్చడం జరిగిందని ఆయన తెలిపారు.

# విద్యార్థుల వీసాల రద్దులో 50శాతం భారతీయులే

- ఆందోళన వ్యక్తంచేసిన కాంగ్రెస్ పార్టీ
- అమెరికా దృష్టికి తీసుకెళ్లాలన్న జైరామ్ రమేశ్



**న్యూఢిల్లీ,ఏప్రిల్18( వెలుతురు):**
అమెరికాలోని విదేశీ విద్యార్థుల వీసాలను ట్రంప్ యంత్రాంగం పెద్ద మొత్తంలో రద్దు చేస్తున్న క్రమంలో కేంద్రం జోక్యం చేసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అమెరికా ప్రభుత్వం రద్దు చేసిన వీసాల్లో 50 శాతం భారతీయ విద్యార్థులవేనని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ అంశాన్ని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జై శంకర్ అమెరికా దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 327 వీసా రద్దు కేసులు తమకు అందినట్లు అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ తాజాగా ప్రకటన జారీ చేసింది. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తంచేసింది. అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్‌కు అందిన నివేదికల ప్రకారం ప్రభుత్వం రద్దు చేసిన 327 వీసాల్లో 50శాతం భారతీయులు ఉన్నారని.. అయితే వారి వీసా రద్దుకు సరైన కారణాలు పేర్కొనలేదని జైరాం రమేశ్ పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారని అన్నారు. ఇటువంటి చర్యల వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. నివేదిక ప్రకారం.. వీసాలు రద్దు చేసిన విద్యార్థుల్లో 50శాతం మంది భారత్‌కు చెందినవారు కాగా 14శాతం మంది చైనా దేశీయులు. తర్వాతి స్థానాల్లో దక్షిణ కొరియా, నేపాల్, బంగ్లాదేశ్ విద్యార్థులు ఉన్నారు. దీనిపై ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ మాట్లాడుతూ.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్, ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అంతర్జాతీయ విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్నాయని పేర్కొంది. ఈవిషయంపై భారత విదేశాంగ శాఖ నుంచి ఎటు–వంటి స్పందన లేదు. చట్టబద్ధమైన పత్రాలు లేని విద్యార్థులను దేశం నుంచి బహిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు. తాజాగా ట్రంప్ యంత్రాంగం పలు యూనివర్సిటీలలోని విద్యార్థుల వీసాలను రద్దు చేసింది. విదేశాంగ శాఖ తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ విదేశీ విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అకస్మాత్తుగా వీసాలు రద్దు చేయడంతో చదువులు కొనసాగించలేకపోతున్నామని.. తమ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. కాగా నిరసన కార్యక్రమాలలో పాల్గొనని వారి వీసాలు కూడా రద్దయినట్లు– కళాశాలలు పేర్కొంటున్నాయి. వీసాల రద్దుకు అధికారులు సరైన కారణాలు కూడా తెలియజేయట్లేదని విద్యార్థులు వాపోయారు.

# అమరావతిలో 2న ప్రధాని మోడీ పర్యటన

- మంత్రులతో ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు

**అమరావతి,ఏప్రిల్18(ఆర్ఎన్ఎ):**
ప్రధాని నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించబోతున్న వేళ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పర్యటన ఏర్పాట్లకు సంబంధించి మంత్రులతో కమిటీలను ఏర్పాటుచేసిది. రాజధాని అమరావతి ప్రాంతంలో ప్రధాని పర్యటన కొనసాగనుంది.. భారత ప్రధాన మంత్రి రాజధాని పునఃనిర్మాణ పనులను ప్రారంభించబోతున్నారు .. ఇప్పటికే ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై ఫోకస్ పెట్టింది కూటమి ప్రభుత్వం.. అందులో భాగంగా.. ప్రధాని మోడీ ఏపీ పర్యటన ఏర్పాట్లకు సంబంధించి ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు దారీ చేసింది.. మంత్రులు పొంగూరు నారాయణ, నారా లోకేష్, పయ్యావుల కేశవ్, సత్యకుమర్ యాదవ్, నాదెండ్ల మనోహర్.. కొల్లు రవీంద్ర సభ్యులుగా ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు అయ్యింది.

ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్ల పరిశీలన.. సభ జరిగే ప్రాంతంలో ఏర్పాట్లు– ... ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని కమిటీ నిర్ణయాలు తీసుకోనుంది. ఇప్పటికే ప్రధాని మోడీ పర్యటన కోసం నోడల్ ఆఫీసర్‌గా వీర పాండ్యన్‌ను నియమించింది. రాజధాని అమరావతి నిర్మాణాల పునఃప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఇప్పటికే ఖరారైంది. మే 2వ తేదీన సాయంత్రం 4 గంటలకు రాజధాని పనులను ప్రారంభించనున్నారు ప్రధాని.. పునఃప్రారంభోత్సవ కార్యక్రమం కోసం సచివాలయం వెనక బహిరంగ సభ వేదికను ఏపీ సర్కారు ఎంపిక చేసింది. ఇందుకోసం ఇప్పటికే ప్రభుత్వం ఏర్పాట్లు ప్రారంభించింది.

ఈ క్రమంలో ప్రధాని పర్యటన ఏర్పాట్ల కోసం మంత్రుల కమిటీని ప్రభుత్వం నియమించింది. మరోవైపు భద్రతా ఏర్పాట్లను ఎస్పీజీ బృందం పర్యవేక్షిస్తోంది. రాజధాని నిర్మాణాల పునఃప్రారంభోత్సవ కార్యక్రమంకు 5 లక్షల మంది హాజరవుతారనే అంచనాతో ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి ప్రజలు హాజరయ్యేలా కార్యాచరణ రూపొందించారు.

# నడ్డా వారసుడి కోసం కసరత్తు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18, ( వెలుతురు)**
భారతీయ జనతా పార్టీకి నూతన జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ముందు కీలక రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించాల్సి ఉంది ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా పలు రాష్ట్రాల రాష్ట్ర అధ్యక్షుల పేర్లను ప్రకటించనున్నారు. ఇప్పటికే అనేక రాష్ట్రాలకు అధ్యక్షులు ప్రకటించినప్పటికీ సగానికి పైగా రాష్ట్రాల అధ్యక్ష ఎన్నికలు పూర్తయితే తప్ప జాతీయ అధ్యక్షుడి ఎన్నిక సాధ్యం కాదు. సామాజిక సమీకరణాలు, సీనియారిటీ సమర్థత, ఆర్ఎస్ఎస్ అండదండలు ఉండే నేతకు జాతీయ అధ్యక్షుడు అయ్యే అవకాశాలున్నాయి. నూతన అధ్యక్షుడి ఎంపిక పార్టీ సంస్థాగత నిర్మాణానికి కొత్త దిశను ఇవ్వడంతోపాటు రాబోయే శాసనసభ ఎన్నికల వ్యూహంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. దక్షిణాదిలో ప్రధానంగా తెలంగాణ, కర్ణాటకలో సొంతంగా పాగా వేయాలని చూస్తున్న అధిష్ఠానం ఆచితూచి అధ్యక్ష ఎంపికపై నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్ర నాయకత్వం నుంచి వచ్చిన సలహాలు సూచనలు ,రాజకీయ పరిస్థితులు, సామాజిక సమీకరణాల ఆధారంగా రాష్ట్ర అధ్యక్షులు ఎంపిక ప్రక్రియ రెండు మూడు రోజుల్లో పూర్తిచేయనుంది.నూతన జాతీయ అధ్యక్షుడు ఎన్నిక తర్వాత పార్టీలో సంస్థాగత మార్పులు, ఎన్నికల వ్యూహాలపై పెద్ద ప్రభావం చూపవచ్చు. అధ్యక్షుడి ఎన్నిక జనవరిలో జరగాల్సి ఉండగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఏప్రిల్ సగం గడిచినప్పటికీ ఇంకా ఎన్నిక జరగలేదు. అధ్యక్షుడి ఎంపికలో సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసే నాయకుడికి ప్రాధాన్యత ఇస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. నూతన అధ్యక్షుడు వచ్చిన తర్వాత 50 శాతం జాతీయ ప్రధాన కార్యదర్శులను తొలగించే అవకాశం ఉందని సమాచారం. దీంతో పాటు, కొత్త అధ్యక్షుడి బృందంలో యువ నాయకులకు ప్రధాన కార్యదర్శులుగా అవకాశం ఇవ్వవచ్చు. అదే సమయంలో, ప్రభుత్వం నుంచి కొంతమంది నాయకులను పార్టీ సంస్థాగత వ్యవహారాల్లోకి తీసుకునే అవకాశం ఉంది.తెలంగాణ బీజేపీ



రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ప్రస్తుతం పలువురు నాయకుల పేర్లు రేసులో ఉన్నాయి. ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, బండి సంజయ్ కుమార్, రఘునందన్ రావు, రామచంద్రరావు, డీకే అరుణ, మురళీధర్ రావు, పాయల శంకర్, చింతల రామచంద్రా రెడ్డి సహా పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జి.కిషన్ రెడ్డి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఉండగా కేంద్ర మంత్రిగా బిజీగా ఉండటం వల్ల రాష్ట్రంలో పార్టీని నడిపించేందుకు కొత్త నాయకుడి అవసరం ఉందని పార్టీ కార్యకర్తలు భావిస్తున్నారు. ఇప్పటికే అధ్యక్షుడి ఎంపికపై బీజేపీ అధిష్ఠానం పరిశీలకులతో అభిప్రాయాలని సేకరించింది. నాయకుల మధ్య అంతర్గత పోటీ, ఫిర్యాదుల వల్ల ఈ ప్రక్రియ ఆలస్యమవుతోంది. అధిష్టానం ఒకరిని అధ్యక్షుడిగా నిర్ణయించి మెజారిటీ జిల్లా అధ్యక్షులు చేత నామినేట్ చేయించి నామినేషన్ ప్రక్రియ పూర్తి చేసి అధికారికంగా అధ్యక్షుడు ప్రకటన పూర్తి చేస్తుంది. అధ్యక్ష పదవి ఎంపిక తెలంగాణలో బీజేపీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల వ్యూహానికి కీలకం. అధిష్ఠానం ఈ విషయంలో రెండు మూడు రోజుల్లో స్పష్టతనిచ్చే అవకాశం ఉంది.బీసీ సామాజికవర్గం.. తెలంగాణాలో పాపులారిటీ.. సహా రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెక్ పెట్టాలంటే ఈటలరకు అధ్యక్ష బాధ్యతలు ఇవ్వాలని చూస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం రేసులో ఉన్న నేతలు సైతం ఈటల రాజేందర్‌కు అధ్యక్ష బాధ్యతలు ఇస్తే తమకు అభ్యంతరం లేదని అధిష్టానానికి తెలిపినట్లు సమాచారం. ఇప్పటికే అనేక సందర్భాల్లో పక్క పార్టీల నుంచి వచ్చిన వారిని అధ్యక్షులు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల తమిననాడు అధ్యక్షుడిగా నైనార్ నాగేంద్రన్‌ను అధ్యక్షుడిగా ప్రకటించారు. పక్కన ఉన్న ఏపీలో పురంధేశ్వరి, కన్నా లక్ష్మీ నారాయణలను అధ్యక్ష పీఠం ఎక్కించిన సందర్భాలున్నాయి. ముఖ్యంగా ప్రస్తుత తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి సైతం ఎవరిని అధ్యక్షుడు చేసినా తనకు అభ్యంతరం లేదని చెప్పినట్లు సమాచారం.ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. కేంద్రంలో మంత్రివర్గంలో స్థానం రాకపోవడంతో ప్రస్తుతం ఉన్న పురంధేశ్వరిని మరోసారి కొనసాగించే అవకాశం ఉంది. పురంధేశ్వరి స్థానంలో అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు పలువురు నేతలు రేసులో ఉన్నారు. ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, ఎమ్మెల్యేలు పార్ధ సారధి, సుజనా చౌదరి ముందు వరుసలో ఉన్నారు. సామాజిక సమీకరణాలు పార్టీ బలోపేతం లక్ష్యంగా ఏపీ బీజేపీ అధ్యక్ష ఎన్నిక ఉండబోతున్నట్లు తెలుస్తోంది

# మహిళలను రాణులుగా మారుస్తున్న ముద్ర..

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ( వెలుతురు)**
ఒక కుటుంబంలో చదువుకున్న మహిళ ఉంటే ఆ కుటుంబం ఎంతో ఉన్నత స్థాయికి చేరుతుంది అన్న సంగతి అందరికీ తెలిసిందే. ఆ కుటుంబంతోపాటు సమాజం, దేశం కూడా ప్రగతి నడుస్తాయి. మహిళలు పారిశ్రామిక రంగంలో ఎదిగితే మరింత ప్రయోజనాలు కలుగుతాయి. ఆమె ఉన్నత స్థాయికి చేరడంతో పాటు ఆ పారిశ్రామిక రంగంలో ఉన్న మిగిలిన చాలామందికి కూడా ఉపాధి కలుగుతుంది. పొదుపుకు ప్రాధాన్యత లభిస్తుంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం కూడా మహిళల అభ్యున్నతి కోసం ఇప్పటివరకు ఎన్నో చర్యలను చేపట్టింది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ముద్ర యోజన ద్వారా ఎంతో మంది మహిళలకు ప్రోత్సాహం అందిస్తుంది. అప్పటి రోజులలో మహిళలు ఎక్కువగా కూలి పనుల మీద ఆధారపడి బతికే వాళ్ళు. చిన్న పరిశ్రమల స్థాపన అనేది అప్పటి వారికి తెలియని అంశంగా ఉండేది. దీనికి ప్రధాన కారణం పెట్టుబడి అని చెప్పొచ్చు. అప్పట్లో తినడానికే తిండి లేక ఇబ్బంది పడే కుటుంబాలు పెట్టుబడిని ఎక్కడ నుంచి వస్తాయి. ఇటువంటి పరిస్థితిని పీఎంఎంవై చాలా సుమూలంగా మార్చిందని చెప్పొచ్చు.ఈ పథకం కింద మహిళలు రుణాలు పొంది టైలరింగ్ యూనిట్లు, బ్యూటీ పార్లర్స్, ఫుడ్ స్టాల్స్, అగ్రిప్రాసెసింగ్ యూనిట్స్ అలాగే దుకాణాలను కూడా ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. ఇది వారి జీవితంలో ఆర్థిక పరిస్థితులతో పాటు సమాజంలో వాళ్లకు గొప్ప మార్పును కూడా మెరుగుపరిచిందని చెప్పడంలో సందేహం లేదు. మహిళలు ఆర్థికంగా మెరుగుపడినప్పుడు వాళ్ళ పిల్లల చదువు మరియు ఆరోగ్యం కూడా బాగుంటుంది. మహిళలు వాటికి ఖర్చు చేయగలిగితే వారి ఆర్థిక స్తోమత కూడా మెరుగుపడుతుంది. ఈ క్రమంలో రాబోయే భవిష్యత్తు తరాలు ఉన్నతంగా ఎదుగుతాయి. ఈ విధంగా పీఎం ఎం వై సూక్ష్మ వ్యవస్థాపకులను ప్రోత్సహించడంతోపాటు సాధికారత మరియు ఆర్థికంగా చురుకైన మహిళలను తయారు చేస్తుందని చెప్పొచ్చు. ప్రధానమంత్రి ముద్ర యోజన రుణాలు తీసుకున్న వాళ్లలో సుమారు 68% వరకు మహిళలే ఉన్నారు.ఈ పథకం కింద రుణం తీసుకున్న మహిళలకు సిఏజిఆర్ 2016 నుంచి 2025 ఆర్థిక సంవత్సరాల మధ్య 13 % గా ఉంటుంది. ఈ క్రమంలో మహిళల పొదుపులో 14% పెరిగాయి. ఈ పథకం కింద రుణాలను తీసుకోవడంతోపాటు వాటిని ఉపయోగించడం వలన జరిగిన ఆర్థిక ప్రగతిని కూడా ఇవి సూచిస్తున్నాయని తెలుస్తుంది. ప్రస్తుతం పీఎంఎంవై మెరుగైన ఫలితాలు సాధించిన క్రమంలో మహిళల సాధికారత మరియు ప్రగతి కోసం ప్రభుత్వం మరింత కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఏర్పడింది. అర్హులైన మహిళలకు పెద్ద మొత్తంలో రుణాలు ఇవ్వడం అలాగే వ్యాపార విస్తరణకు అవకాశం కల్పించడం వంటివి చేయాల్సి ఉంది.



# సింగరేణి కొత్త చరిత్ర




**హైదరాబాద్, ఏప్రిల్ 18, ( వెలుతురు)**

ఒడిశాలో సింగరేణి నైనీ బొగ్గు బ్లాక్ ప్రారంభమైంది. 13 దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రంలోకి సింగరేణి సంస్థ అడుగుపెట్టింది. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రం వరకే పరిమితమై బొగ్గు గనులు నిర్వహిస్తున్న సింగరేణి ఇప్పుడు నైనీ బొగ్గు బ్లాక్ ద్వారా ఇతర రాష్ట్రాల్లోకి అడుగుపెట్టినట్లు అయింది. ఇదొక ఒక చరిత్రాత్మక ఘట్టంగా అధికారులు పేర్కొన్నారు. 2016 మే నెలలో ఈ గనిని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సింగరేణికి కేటాయించింది. అన్ని రకాల అనుమతులు సాధించినప్పటికీ.. తవ్వకం ప్రారంభించడానికి తొమ్మిదేళ్ళ సుదీర్ఘ కాలం నిరీక్షించాల్సి వచ్చింది. ఇటీవలే కాలంలో ప్రభుత్వం ఈ తవ్వకాల విషయంలో మరింత దృష్టి పెట్టడంతో లైన్ క్లియర్ అయిపోయింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో అధికారులు ఒడిశా రాష్ట్రంలో ప్రత్యేకంగా పర్యటించి.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితోనూ, సంబంధిత అధికారులతోనూ సంప్రదింపులు జరిపారు. గని ప్రారంభానికి మార్గం సుగమం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ వల్ల సింగరేణికి అతిపెద్ద బొగ్గు బ్లాక్ లభించింది. తద్వారా వార్షిక అధికోత్పత్తి సాధనకు మార్గం సుగమమై సంస్థ ఆర్థిక పటిష్టతకు దోహదపడనుంది. సింగరేణి సంస్థ చరిత్రలో మొదటిసారి బయటి రాష్ట్రంలో బొగ్గు తవ్వకాలు ప్రారంభించడం అభినందనీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దాదాపు 136 ఏళ్లుగా తవ్వకాలు సాగిస్తూ రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న తెలంగాణ సింగరేణి.. రాష్ట్రం బయట ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకులో తవ్వకాలు ప్రారంభించి భవిష్యత్తు తరాలకు బంగారు బాటలు వేసిందని పేర్కొన్నారు. సింగరేణి కోసం ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవ వల్లే తొలిసారి దేశంలోని ఇతర రాష్ట్రంలోనూ బొగ్గు గనిని ప్రారంభించడం సాధ్యమైందని వ్యాఖ్యానించారు. ఇది మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఒడిశాలోని అంగుల్ జిల్లాలోని నైనీ గని ప్రారంభించడం ద్వారా సింగరేణి కొత్త శకానికి నాంది పలికిందని ముఖ్యమంత్రి ఒక సందేశంలో పేర్కొన్నారు. నైనీ బొగ్గు గనులకు అన్ని అనుమతులు సాధించి అందులో తవ్వకాలు ప్రారంభించిన చారిత్రక ఘట్టం సాకారం కావడం తెలంగాణ ప్రజలందరికీ గర్వకారణమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణకు మణిమకుటంగా, వేలాది కార్మిక కుటుంబాలకు జీవనాధానంగా నిలుస్తున్న సింగరేణి సంస్థ అభివృద్ధికి.. విస్తరణకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి.. సింగరేణి సంస్థకు అభినందనలు తెలియజేశారు.

# టెట్ తో కలిసి డీఎస్సీ




**విజయవాడ, ఏప్రిల్ 18, ( వెలుతురు)**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈసారి డీఎస్సీని పక్కా ప్రణాళికతో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. అందుకు తగ్గట్టుగానే ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి దరఖాస్తులను రెండు విభాగాలుగా స్వీకరించబోతున్నారని తెలుస్తోంది. డీఎస్సీకి అప్లై చేయాలనుకునే వాళ్లు కచ్చితంగా కొన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలి. లేకుంటే తప్పులో కాలు వేస్తారు. అంతే కాకుండా అన్ని సర్టిఫికెట్లు కూడా స్కాన్ చేసి పెట్టుకోవాలి. దరఖాస్తు టైంలోనే వాటిని అప్‌లోడ్ చేయాలి. సాధారణంగా డీఎస్సీలో విజయం సాధించిన తర్వాత పోస్టింగ్ తీసుకునే టైంలో సర్టిఫికేట్ల వెరిఫికేషన్, పాఠశాల ఎంపికను పూర్తి చేస్తారు. కానీ ఈసారి ముందుగానే పాఠశాల ఎంపికను ఇస్తున్నారు. డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే టైంలోనే మీరు ప్రభుత్వం, పురపాలక, పంచాయతీరాజ్, ఆదర్శపాఠశాలలు, ఏపీఆర్జేసీ, సంక్షేమ శాఖ నిర్వహించే పాఠశాల్లో దేనిలో ఆసక్తి చూపిస్తారో చెప్పాల్సి ఉంటుంది. దీనికి ప్రయార్టీ ఇస్తారు. దీని ఆధారంగా మీరు డీఎస్సీలో ఎంపికైన తర్వాత పోస్టింగ్ ఇస్తారు. తర్వాత మార్చుకోవడానికి వీలు ఉండదు. దీన్ని డీఎస్సీ అప్లికేషన్ పార్ట్ ఏలో పెడుతున్నారు. ఇక పార్ట్ బీలో మీ వివరాలు నమోదు చేసి సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఏడో తరగతి నుంచి బీఈడీ వరకు అన్ని సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలి. దీంతోపాటు కుల, పీహెచ్, ధ్రువీకరించే సర్టిఫికెట్లను కూడా సిద్ధం చేసుకోవాలి. అందుకే ముందుగానే వీటిని సిద్ధం చేసుకోవడం ఉత్తమం అని అధికారులు చెబుతున్నారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత రెవెన్యూ ఆఫీసులు కిక్కిరిసిపోతాయని అంటున్నారు. ముందుగానే అప్లై చేసుకొని సద్ధంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. మొదటి నుంచి చెబుతున్నట్టుగానే 16,347 ఉద్యోగాలతో నార్మల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఈ మధ్య ప్రకటించిన 2,260 ప్రత్యేక విద్య టీచర్ పోస్టులను తర్వాత భర్తీ చేస్తారు. ఈ రెండింటిని కలపడం లేదని ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. ప్రిపేర్ అయ్యేందుకు స్పెషల్ బీఈడీ విద్యార్థులకు సమయం ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వారం రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్న ప్రభుత్వం 45 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయనుంది. టెట్ పెట్టి చాలా కాలం అవుతున్నందున రెండూ కలిపి నిర్వహించాలని డిమాండ్ అభ్యర్థుల నుంచి వస్తోంది. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం డీఎస్సీ మాత్రమే నిర్వహించాలని చూస్తోంది. ఇప్పటికే ఆలస్యమైనందున రెండింటినీ కలిపే ఆలోచన లేనట్టుగానే చెబుతోంది.

# ఇద్దరు చిన్నారులను కాపాడిన తిరుమల పోలీసులు

**తిరుమల ఏప్రిల్ 18, ( వెలుతురు)**

వరాహస్వామి అతిథి గృహం పార్కింగ్ వద్ద ఊపిరి ఆడకకుండా కారులో ఉన్న చిన్నారులను పోలీసులు కాపాడారు. టాక్సీ డ్రైవర్లు కారులో ఉన్న చిన్నారులను గుర్తించారు. వెంటనే తిరుమల ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కారు అద్దాలను పగలకొట్టి చిన్నారులను రక్షించారు. వెంటనే తిరుమల అశ్విని ఆస్పత్రికి తరలించారు. చిన్నారుల తల్లిదండ్రులు నడకమార్గంలో రావడంతో పెద్దనాన్న గంగయ్య పిల్లలను నిర్లక్ష్యంగా కారులో వదిలివెళ్లినట్లు గుర్తించారు. చిన్నారులను నిర్లక్ష్యంగా వదిలివెళ్లిన చిన్నారుల పెద్దనాన్నపై ట్రాఫిక్ సిబ్బంది పోలీసులకు పిర్యాదు చేసారు.

# లిక్కర్ స్కామ్... అందరూ డుమ్మాలే

**విజయవాడ, ఏప్రిల్ 18, ( వెలుతురు)**

ఆంధ్రప్రదేశ్‌లో లిక్కర్ స్కాం నిందితులు సిఐడీని అసుల లెక్క చేయడం లేదు. స్కాంలో కీలక నిందితులుగా చెబుతున్న ఒక్కరంటే ఒక్కరు కూడా ఇప్పటి వరకూ పోలీసుల ఎదుట విచారణకు హాజరు కాలేదు. చాలా మమందిని విచారణకు పిలుస్తూ నోటీసులు జారీ చేస్తున్నారు. కానీ పోలీసుల నోటీసుల్ని అందుకని వాటిని గౌరవించిన వారు ఒక్కరూ లేరు. తమకు ముందుగా నిర్ణయించిన పనులు ఉన్నాయని తాము .. మీరు చెప్పిన తేదీల్లో రాలేమని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. విజయసాయిరెడ్డికి సీఐడీ సాక్షిగా నోటీసులు జారీ చేసింది. ఆయన పద్దెనిమిదో తేదీన హాజరు కావాల్సి ఉంది. అయితే తాను పదిహేడునే వస్తానని సీఐడీ అధికారులకు సమాచారం ఇచ్చారు. హఠాత్తుగా గురువారం ఉదయం అనివార్య కారణాలతో తాను రావడం లేదని సమాచారం ఇచ్చారు. సీఐడీ అధికారులు ఈ సమాచారాన్ని సీరియస్ గా తీసుకుంటారో లేదో కానీ.. ఆయన కోసం శుక్రవారం ఎదురు చూసే అవకాశాలు ఉన్నాయి. లిక్కర్ స్కాంలో మరో నిందితుడిగా ఉన్న మిథున్ రెడ్డికి కూడా సీఐడీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. శనివారం విచారణకు రావాలని మిథున్ రెడ్డికి సీఐడీ సిట్ నోటీసులు పంపింది. ఆయనకు రిలీఫ్ ఇవ్వడానికి హైకోర్టు నిరాకరిస్తే సుప్రీంకోర్టుకెళ్లారు. అక్కడ ముందస్తు బెయిల్ లభించింది. విచారణకు సహకరించాలని సుప్రీంకోర్టు చెప్పింది. కానీ మిథున్ రెడ్డి మాత్రం శనివారం తనకు చాలా పనులు ఉన్నాయని.. ఆ పనుల్లో సీఐడీ విచారణ లేదని అంటున్నారు. రాజ్ కసిరెడ్డి కోసం సీఐడీ సిట్ అధికారులు హైదరాబాద్‌లో వెదుకుతు న్నారు. ఆయన ఇళ్లు, కార్యాలయాలతో సహా బంధువుల ఇళ్లలోనూ సోదాలు చేశారు. అయితే ఆయన దొరకలేదు. ఆయనకు నాలుగోసారి నోటీసులు జారీచేశారు. హైకోర్టులో అరెస్టు నుంచి రక్షణ లభించనప్పటి నుండి రాజ్ కసిరెడ్డి పరారీలో ఉన్నారు. రాజ్ కసిరెడ్డికి ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఆయన దేశం దాటిపోయే అవకాశాలు దాదాపుగా ఉండవు. అంతకు ముందే ఆయన విదేశాలకు వెళ్తే ఏమీ చేయలేరు..కానీ ఆయన ఎక్కడున్నారో కూడా ఎవరికీ తెలియదు. లిక్కర్ స్కాం చాలా సీరియస్ ఇష్యూ అని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. అయితే దర్యాప్తు సంస్థల్లో మాత్రం అంత దూకుడు కనిపించడం లేదు. నోటీసులు జారీ చేస్తున్నారు కానీ.. ఒక్కరంటే ఒక్కరూ హాజరు కాకపోవడం.. దర్యాప్తు సంస్థలు కూడా అతం సీరియస్ గా తీసుకోకపోవడం చర్చనీయాంశమవుతోంది.



## సీబీఐకి కేసు

ఆంధ్రప్రదేశ్‌లో మద్యం విధానం పేరుతో జరిగింది ఘోరమైన దోపిడీ అని టీడీపీ మొదటి నుంచి ఆరోపిస్తోంది. మద్యం విధానం మొత్తాన్ని గుప్పిట్లో పెట్టుకుని చీప్ లిక్కర్ ను అత్యంత ఎక్కువ ధరలకు అమ్ముతూ ప్రజల్ని నిలువు దోపిడీ చేశారని అనేక సార్లు మండిపడ్డారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో ఒక్క పాత బ్రాండ్ అమ్మకానికి లేదు. అన్నీ వైసీపీ నేతల డిస్టిలరీల్లో తయారయ్యే ఊరూపేరూ లేని మద్యాన్ని అమ్మారు. టార్గెట్లు పెట్టి మరీ అమ్మించారు. వాటిలో విష రసాయనాలు ఉన్నాయని నివేదికలు వచ్చినా పట్టించుకోలేదు. నగదు లావాదేవీలు మాత్రమే జరిపారు. మద్యం దుకాణాల్లో వైసీపీ నేతలు మాత్రమే ఉన్నారు. మద్యం తయారీ , రవాణా, అమ్మకాలు మొత్తం వైసీపీ గుప్పిట్లో ఉన్నాయి. మద్యం ఎవరు తయారు చేశారు..ఎవరి గుప్పిట్లో తయారీ ఉంది.. వంటి వివరాలన్నీ బయటకు వచ్చాయి. స్వయంగా ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి కూడా గతంలో బయట పెట్టారు. ఇప్పటికే కేంద్రానికి లెక్క లేనన్ని ఫిర్యాదులు అందాయి. ఆధారాలతో సహా టీడీపీ ఫిర్యాదు చేసింది. రఘురామ స్వయంగా ల్యాబుల్లో మద్యాన్ని టెస్టులు చేయించి రిపోర్టులు కేంద్రానికి సమర్పించారు. ఏపీ బీజేపీ అధ్యక్షురాలు ఫిర్యాదు చేశారు. గతంలో ప్రముఖ మద్యం కంపెనీలు కూడా .. కేంద్రానికి ఫిర్యాదు చేశాయి. గడిచిన ఐదేళ్లలో వివిధ శాఖల్లో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని కోరినట్లు తెలిపారు. దీంతోపాటు విద్యుత్ సెక్టార్‌లో స్మార్ట్ మీటర్లు, %ఖ్రాూ%ల్లో భారీ కుంభకోణాలు జరిగినట్లు బీజేపీ నేతలు చంద్రబాబుకు సూచించినట్లు చెప్పారు. సాంఘీక సంక్షేమ శాఖలోనూ అవినీతి జరిగిందని, వైసీపీ అవినీతిపై సీబీఐ, ఈడీలకు ఫిర్యాదు చేస్తామని బీజేపీ నేతలు వెల్లడించారు. లిక్కర్ స్కామ్‌పై విచారణ జరపాలని ఏపీ సీఎం చంద్రబాబుకు ఆమె లేఖ రాశారు. ఈ మేరకు.. లిక్కర్ పేరుతో వైసీపీ నేతలు జేబులు నింపుకున్నారని, ఏపీలో నాణ్యమైన లిక్కర్ అందించాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. పురందేశ్వరి ప్రధానంగా లిక్కర్ కేసుపైనే దృష్టి పెట్టారు. వైసీపీ ప్రభుత్వం ఓడిపోగానే బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా ఉన్న వాసుదేవరెడ్డి పారిపోయే ప్రయత్నం చేశారు. తనతో పాటు చాలా రికార్డుల్ని తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఆయన దొరికిపోయారు. ఆయనపై ఇప్పటికే సీఐడీ కేసు నమోదయింది. రైల్వే సర్వీస్‌కు చెందిన ఆయనను వైసీపీ నేతలు ఏపీకి పిలిపించి.. ఆయన కేంద్రంగానే మద్యం దందా చేశారు. వేల కోట్ల ఈ మద్యం స్కాంలో మొత్తం వాసుదేవరెడ్డినే ప్రధాన పాత్రధారి అనే అనుమానాలు . అయితే ఆయన కేవలం సంతకాలకే పరిమితమని.. కొంత కమిషన్ ఇచ్చి మిగతా అంతా నాటి ప్రభుత్వ పెద్దలే తీసుకునేవారని ఆయన సీఐడీ అధికారులకు వాంగ్మూలం ఇచ్చినట్లుగా తెలుస్తోంది. తన జీవితం కూడా పూర్తిగా జైలుకు పరిమితమవుతుందన్న అంచనాతో ఆయన మొత్తం వివరాలు బయట పెట్టేందుకు సిద్ధమయ్యారని అయన అప్రూవర్ గా మారుతున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఏపీలో ఐదేళ్ల పాటు సాగిన దోపిడీ వ్యవహారం అంతా పూసగుచ్చినట్లుగా వివరించి... అసలు నిందితుల్ని జైలుకు పంపి.. తాను బయటపడేందుకు ఏపీబీసీఎల్ మాజీ ఎడీ వాసుదేవరెడ్డి సిద్ధమయ్యారని అంటున్నారు. ఏపీలో దర్యాప్తు సంస్థలు లిక్కర్ కేసుపై దర్యాప్తు చేస్తే.. అది కక్షసాధింపుగా ప్రచారం చేస్తారు. కానీ సీఐడీ విచారణలో వాసుదేవరెడ్డి వద్ద దొరికిన సాక్ష్యాలకు.. తమ వద్ద ఉన్న సాక్ష్యాలతో సీబీఐ విచారణచేయిస్తే.. అసలు కింగ్ పిన్ దొరికిపోతారని టీడీపీ నేతలు భావిస్తున్నారు. తాము కక్షసాధింపులకు పాల్పడ్డారనే అపవాదు రాకుండానేరుగా సీబీఐ విచారణకు సిఫారసు చేసే అవకాశాలు ఉన్నాయి. బీజేపీ నేతలు కూడా ఇదే స్కాంలో విచారణ కోసం పట్టుబడుతూండటంతో.. చంద్రబాబు కూడా సీబీఐకి అప్పగిస్తేనే మంచిదన్న ఆలోచనకు వచ్చినట్లుగా చెబుతున్నారు. అదే సమయంలో.. ఢిల్లీ లిక్కర్ స్కామ్ తోసంబంధం ఉన్న అరబిందో శరత్ చంద్రారెడ్డి కంపెనీ కూడా ఈ స్కామ్‌లో కీలక పాత్ర పోషించినట్లుగా ఇప్పటికే పత్రాలు బయటకు వచ్చాయి. అనుకున్నట్లుగా జరిగితే జగన్మోహన్ రెడ్డి పై సీబీఐ ఫ్రెష్ కేసులు రెడీ చేయడం ఖాయమేనని అనుకోవచ్చు.

# యాక్టీవ్ పాలిటిక్స్ లోకి విజయసాయి

**నెల్లూరు ఏప్రిల్ 18, ( వెలుతురు)**



రాజకీయ సన్యాసం తీసుకుంటానని స్వయంగా ప్రకటించి వైసీపీకి రాజీనామా చేసిన ఆపార్టీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజకీయ పునరాగమనంపై ఏపీ రాజకీయాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. కేంద్రంలోని బీజేపీ పెద్దలతో సన్నిహిత సంబంధాలు ఉన్న విజయసాయిరెడ్డి ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటున్నారు. అయితే విజయసాయిరెడ్డి ఇన్నాళ్లూ పొలిటికల్ కెరియర్ పై ఆడిన దోబూచులాటకు అతి త్వరలోనే ఎండ్ కార్డ్ పడే అవకాశం ఉంది. సాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఇప్పటికే షెడ్యూల్ విడుదలైంది. ఏప్రిల్ 22వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేస్తారు. వచ్చే మే నెల 9న ఎన్నిక నిర్వహిస్తారు. విజయసాయిరెడ్డి..రాజ్యసభ సస్పెన్స్ ఎపిసోడ్ విషయంలో ఓ స్పష్టత రానుంది. ఎందుకంటే వైసీపీకి, ఎంపీ పదవికి రాజీనామా చేసిన తర్వాత తాను వ్యవసాయం చేసుకుంటానని సాయిరెడ్డి చెప్పినా బీజేపీ నుంచి ఆయన కచ్చితంగా రాజ్యసభకు వెళ్తారనే టాక్ రాజకీయవర్గాల్లో తెగ జరుగుతోంది. ఇటీవల కొద్ది రోజుల క్రితం మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా ఇదే తరహాలో కామెంట్ చేయడంతో మరింత ఆసక్తికరంగా మారింది. ఈ విషయమై ఇప్పటి వరకు బీజేపీ మాత్రం ఎలాంటి ప్రకటనగానీ..మాటగానీ మాట్లాడలేదు. కానీ కమలం పార్టీలో కూడా ఇవే తరహా గుసగుసలు, చర్చలు తెగ వినిపిస్తున్నాయంట. దీంతో సాయిరెడ్డి రాజ్యసభకు వెళ్లడం ఖాయమనే టాకే చాలా మందిలో వ్యక్తమవుతోందట. వాస్తవానికి వైసీపీకి రాజీనామా చేసిన సమయంలోనే విజయసాయిరెడ్డి బీజేపీలో చేరతారని ప్రచారం జరిగింది. కానీ, ఆయన అప్పట్లో ఆ ప్రచారాన్ని ఖండించారు. దక్షిణ భారతదేశంలో బలపడాలని చూస్తున్న బీజేపీ.. ఏపీలో వీలైనంత ఎక్కువ మందిని సమీకరించుకోవాలని ప్లాన్ చేస్తోందన్న టాక్ నడుస్తోంది. దీంతో విజయసాయిరెడ్డిని బీజేపీలో చేర్చుకుని ఆయన రాజీనామా చేసిన స్థానం నుంచే మళ్లీ రాజ్యసభకు పంపాలని కమలం పార్టీ ప్లాన్ చేస్తోందన్న టాక్ రాజకీయవర్గాల్లో వినిపిస్తోంది. ఆయనను బీజేపీలో చేర్చుకుని ఏపీలో వైసీపీ అసమ్మతి నేతలను పార్టీలోకి లాగాలని బీజేపీ ప్లాన్ చేస్తోందట. అంతేకాదు..ఈ ప్రాంతంలో పలుకుబడి ఉన్న నేతలను పార్టీలో చేర్చుకుని వచ్చే ఎన్నికల నాటికి ప్రధాన పోటీదారుగా అవతరించాలని కమలం పార్టీ ప్రణాళికలు రచిస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అయితే టీడీపీని, జనసేనను విపరీతంగా విమర్శించిన సాయిరెడ్డికి రాజ్యసభ టిక్కెట్ ఇస్తామని బీజేపీ చెబితే దానికి కూటమి అధినేత అయిన చంద్రబాబు ఒప్పుకుంటారా లేదా అన్న చర్చ జరుగుతోంది. ఒకవేళ ఓకే చెప్తే బీజేపీ తరపున విజయసాయిరెడ్డి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఉందంటూ రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వైసీపీలో ఉండగా, విజయసాయిరెడ్డిపై అనేక ఆరోపణలు వచ్చాయి. వాటిపై ఓ పక్క సిట్..మరో పక్క సీఐడి విచారణ కొనసాగుతోంది. లిక్కర్ స్కాంలో తనకు సంబంధం లేదని, ఆ స్కాంలో కర్త, కర్మ, క్రియ అంతా వైసీపీ నేత కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అంటూ అప్పట్లోనే పెద్ద బాంబు పేల్చారు విజయసాయిరెడ్డి. ఇలా వైసీపీ నేతలను ఇరికించేలా ప్రకటనలు చేయడం వెనుక ప్రత్యేక వ్యూహం ఉందని రాజకీయ విశ్లేషకులు అనుమానిస్తున్నారు. గత ప్రభుత్వంలో చోటుచేసుకున్న కుంభకోణాలపై తాను సహకరిస్తానని కూటమి ప్రభుత్వానికి సంకేతాలివ్వడం..ఇవన్నీ తాను బీజేపీలో చేరేందుకు చేస్తున్న వ్యూహాల్లో భాగమే అన్న చర్చ నడుస్తోంది. అయితే ఈనెల 17న మరోసారి సిట్ ముందు విచారణకు హాజరుకాబోతున్న విజయసాయిరెడ్డి విచారణ తర్వాత ఆరోజు ఏ బాంబు పేల్చుతారో అన్న ఉత్కంఠ కూడా ఉంది. మొత్తానికి విజయసాయిరెడ్డి యూటర్న్ తీసుకొని యాక్టీవ్ పాలిటిక్స్ లోకి వస్తారా లేదా అన్నది కొద్దిరోజుల్లోనే తేలిపోనుందనే టాక్ ఏపీ రాజకీయాల్లో నడుస్తోంది.

# మరో వివాదంలో దువ్వాడ

**శ్రీకాకుళం, ఏప్రిల్ 18, ( వెలుతురు)**

సిక్కోలు రాజకీయాల్లో దువ్వాడ శ్రీనివాస్ రూటే సెపరేటు. వైసీపీ నేతగా ఉన్న ఆయన రోజుకో వివాదంలో చిక్కుకుంటూ పాలిటిక్స్ లో హాట్ టాపిగ్గా మారుతున్నారు. ఇప్పటికే కుటుంబ వివాదంలో చిక్కుకొని రాష్ట్ర వ్యాప్తంగా పెను దుమారమే రేపారు. అది కాస్తా సర్దుమనిగిందకునేలోపే.. తాజాగా ఆయన తీసుకున్న డాక్టరేట్ పెద్ద దుమారమే రేపింది. ఊరు పేరు లేని యూనివర్సిటీ, యూజీసీ అనుమతి లేని యూనివర్సిటీ నుండి డాక్టరేట్ తీసుకున్నారంటూ ఆయన ప్రత్యర్థులు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ట్రోలింగ్ చేశారట. ఆ వివాదం ముగిసేలోపే ఆయన ఇంటికి పవర్ కట్ మరో వివాదంగా మారింది. దువ్వాడ శ్రీనివాస్ ఇంటి కరెంట్ బిల్లులు కట్టలేదని పవర్ కట్ చేశారట విద్యుత్ శాఖ అధికారులు. దీంతో ఆ అధికారికి ఫోన్ చేసిన దువ్వాడ..నోటికి ఎంత వస్తే అంతలా మాట్లాడారంటా. దళిత అధికారిపై ఇలా దుర్భాషలేంటంటూ లీకైన ఆడియో ఇప్పుడు వైరల్ గా మారింది. ఇలా దువ్వాడ ఏం చేసినా అది



వివాదాలకు, కాంట్రవర్సీలకు దారి తీస్తుండటం ఇటు వైసిపి అధిష్టానానికే కాదు అటు ఆయన అనుచరులకు సైతం మింగుడు పడటంలేదట. దువ్వాడను నిత్యం వివాదాలు వెంటాడుతుండడంతో పార్టీ అధిష్టానం కూడా ఆయనపై చర్యలకు దిగుతోంది. కుటుంబ వివాదంతో పార్టీకి భారీగా డ్యామేజి అవుతుందని భావించిన వైసిపి ఆయన్ని టెక్కలి నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యతల నుంచి ఇటీవల తప్పించింది. ఆ బాధ్యతలను.. ఇటీవల ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన పేరాడ తిలక్ కి అప్పగించారు. దీంతో అప్పటి నుండి దువ్వాడ శ్రీనివాస్ పార్టీకి అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారట. పార్టీ కార్యక్రమాలకు పిలుపునిచ్చినా కూడా వాటికి దూరంగా ఉంటూ సొంత వ్యవహారాలనే చక్కబెట్టుకుంటున్నారంట. అంతేకాదు దువ్వాడ భార్య వాణి సైతం దువ్వాడకు చెక్ పెట్టేందుకు టెక్కలి వైసీపీ ఇంచార్జ్ పేరాడ తిలక్ తో కలిసి పనిచేస్తున్నారంట. ఓ వైపు కుటుంబ వివాదాలు..మరో వైపు వరుసగా చుట్టుముడుతున్న కాంట్రవర్శిలు..ఇలా దువ్వాడకు ముందు నుయ్యి..వెనక గొయ్యిలా మారిందంటున్నారు ఆయన కేడర్. వరుస వివాదాలు వెంటాడుతున్న దువ్వాడ ప్రస్తుతం తన సహచరి దివ్వల మాదురితో కలిసి వస్త్ర వ్యాపారాన్ని ప్రారంభించారంట. అక్కడ బిజిగా ఉంటూనే కాంట్రవర్శిలకు మాత్రం కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తూనే ఉన్నారు దువ్వాడ శ్రీనివాస్.

# జలమండలి మోటార్ ఫ్రీ టాప్ డ్రైవ్

## మోటర్ పంపులు సీజ్



హైదరాబాద్, ఏప్రిల్ 18, ( వెలుతురు)

నీటి పంపింగ్ కోసం మోటార్లను వాడుతున్న వారిపై జలమండలి అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. 'మోటార్ ఫ్రీ టాప్ డ్రైవ్' పేరుతో నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నారు. బుధవారం 32 మోటార్లను స్వాధీనం చేసుకోగా.. 38 మందికి జరిమానా విధించారు.జలమండలి సరఫరా చేసే నీటిని అక్రమంగా మోటార్లతో తోడుతున్న వారిపై జలమండలి అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. రెండు రోజులుగా మోటార్ ఫ్రీ టాప్ డ్రైవ్ పేరుతో ఎక్కడికక్కడ తనిఖీలు చేపడుతున్నారు. నగరంలోని ఓ అండ్ ఎం డివిజన్ – 6, ఎస్ఆర్ నగర్ లోని మధురానగర్ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా హాస్టళ్లు, వాణిజ్య సముదాయాలు ఉన్న ప్రాంతంలో లో–ప్రెషర్ తలెత్తుతున్న ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేశారు. కొంతమంది వినియోగదారుల ఇండ్లలో అక్రమంగా మోటార్లు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఎండీ అశోక్ రెడ్డి ఓ హాస్టల్ ప్రాంగణంలోకి వెళ్ళగా.. ఆ యజమాని తన నల్లాకు వ్యవసానికి వినియోగించే 2 హెచ్ పి మోటర్ తో నీటిని తోడడంతో యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పది ఇళ్లకు సరిపడా నీటిని ఒక్కడే వాడితే మిగతా వాళ్ళు ఏమైపోవాలని ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి తప్పు చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే ఆ హాస్టల్ కు నెలవరకు నీటిని నిలిపివేసి... ట్యాంకర్ సైతం బుక్ చెయ్యకుండా బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని అధికారులను ఆదేశించారుఇదే ప్రాంతంలో మరో భవనానికి సైతం వ్యవసాయ మోటార్ వాడుతూ పట్టుపడగా కనెక్షన్ తొలగించారు. నెల వరకు ట్యాంకర్ కూడా సరఫరా నిలిపివేయమని ఎండీ అధికారులకు సూచించారు. ఈ డ్రైవ్ ను ఎస్ ఆర్ నగర్ ప్రాంతంలో వారం పాటు కొనసాగించాలన్నారు.ప్రతిరోజూ వాటర్ సప్లై సమయంలో తనిఖీ చేసి మోటార్లు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఈ డ్రైవ్ మరో 60 రోజుల వరకు నగరం అంతా కొనసాగుతుందని.... మోటార్లు బిగించి పట్టుబడితే మోటార్లు సీజ్ చేస్తారని స్పష్టం చేశారు. రెండోసారి కొనసాగిస్తే రూ.5 వేలు జరిమానా విధించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కాబట్టి వినియోగదారులెవరూ నల్లాకు మోటార్లు బిగించవద్దని ఈ సందర్భంగా ఎండీ హెచ్చరించారు.ఈ మోటార్ ఫ్రీ టాప్ డ్రైవ్ లో జలమండలి ప్రధానంగా రెండు అంశాలపై దృష్టి సారించింది. హైదరాబాద్ నగరంలో లో ప్రెజర్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో నీటి వృథాను అరికట్టాలని నిర్ణయించింది. ఆయా ప్రాంతాలలో జలమండలి ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి ఉద్యోగి వరకు పర్యటిస్తున్నారు. జలమండలి చర్యలపై లో ప్రెజర్ ఏరియా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# మామిడిని దెబ్బతీసిన అకాల వర్షాలు



వరంగల్ ఏప్రిల్ 18, ( వెలుతురు)

ఉమ్మడి వరంగల్ జిల్లా మామిడి రైతులను అకాల వర్షాలు కోలుకోలేని దెబ్బ తీశాయి. వీచిన ఈదురుగాలులకు ఉమ్మడి జిల్లాలోని చాలా చోట్ల మామిడి కాయలు రాలిపోయాయి. పంట చేతికొచ్చే సమయంలో కాయలన్నీ నేలరాలడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందల ఎకరాల్లో మామిడి కాయలు నేలరాలగా.. అధికారులు పంట నష్టంపై వివరాలు సేకరించే పనిలో పడ్డారుమామిడి తోటలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 34 వేల ఎకరాల్లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలోనే ఎక్కువ శాతం మామిడి తోటలు ఉన్నాయి. ఈ జిల్లాలో మొత్తంగా 14,560 ఎకరాల మేర మామిడి తోటలు ఉండగా, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో 9,600, జనగామ జిల్లాలో 6,700, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1,500, ములుగు జిల్లాలో 750 ఎకరాల పైగా మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఏటా పూత పూసింది మొదలు.. కాయలు కోతకు వచ్చే వరకు మామిడి రైతులు పెట్టుబడి రూపంలో రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. అయినా వాతావరణ పరిస్థితులు అనుకూలించక పూత రాలడం, అకాల వర్షాలు, వడగండ్ల వానలు దిగుబడిని చాలావరకు దెబ్బ తీస్తున్నాయి. ఫలితంగా ఏటా మామిడి రైతులకు నష్టాలే మిగులుతుండగా, ఈసారి కూడా పరిస్థితి అలాగే ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారుఇప్పటికే మామిడి పంట్ల సీజన్ నడుస్తుండటంతో చాలా చోట్లా కాయలు కోతకు వచ్చాయి. ఈ క్రమంలోనే నాలుగైదు రోజుల కిందట ఉమ్మడి జిల్లాలోని మహబూబాబాద్, జనగామ, వరంగల్ జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో ప్రధానంగా కోతకు వచ్చిన మామిడి కాయలు రాలాయి. ఇదిలాఉంటే మంగళవారం అర్ధరాత్రి కురిసిన ఈదురుగాలుల వానకు నష్టం మరింత ఎక్కువైంది. ప్రధానంగా మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలతో పాటు హనుమకొండ జిల్లాలోని పరకాల, నడికూడ, శాయంపేట మండలాల్లో కురిసిన వర్షానికి చాలాచోట్ల మామిడి పంటలు దెబ్బతిన్నాయి. చెట్లకు ఉన్న కాయలన్నీ నేలరాలడంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి వీచిన ఈదురు గాలులు, భారీ వర్షాలకు చాలా చోట్లా పంటలు దెబ్బతిన్నాయి. పరకాల, శాయంపేట, ఆత్మకూరు, నడికూడ మండలాల్లో నష్ట తీవ్రత ఎక్కువగా ఉంది. చాలా చోట్లా కోతకు వచ్చిన వరి నేలవాలగా, కల్లాల్లో ఆరబోసిన వడ్లు తడిసి ముద్దయ్యాయి. ఇక మొక్కజొన్న కూడా నేలవాలగా, మామిడి తోటల్లో చాలావరకు కాత నేలరాలి తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కాగా పంట నష్టంపై నివేదిక తయారు చేసేందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ఫీల్డ్ విజిట్ చేస్తున్నారు. ఎక్కడెక్కడ.. ఏఏ పంటలు.. ఎంత మేర దెబ్బతిన్నాయో రిపోర్ట్ తయారు చేస్తున్నారు. నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని ఆఫీసర్లు చెబుతుండగా, నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

# పాతబస్తీలో మెట్రో సవాల్



హైదరాబాద్, ఏప్రిల్ 18, ( వెలుతురు)

హైదరాబాద్‌లో మెట్రో రైలు పట్టాలెక్కిన నాటి నుంచి నగరంలో ట్రాపిక్ రూపురేఖలే మారిపోయాయి. మెట్రో నడిచే మార్గాల్లో అభివృద్ధి సైతం అంతే వేగంగా పెరిగిపోయింది. రియల్ ఎస్టేట్ ప్రభావం సైతం ఊహించని స్థాయికి చేరింది. వ్యాపార, వాణిజ్య సముదాయాలు, పెరిగిన ఉపాధి అవకాశాలు.. ఇలా ఒక్కమాటలో చెప్పాలంటే మెట్రో ఏర్పాటుకు ముందు హైదరాబాద్, ఏర్పాటు తరువాత హైదరాబాద్ అనేంతలా నగరంలో ఊహించని మార్పులు చకచకా జరిగిపోయాయి. ఫేజ్ వన్‌లో నగరంలోని ప్రధాన మార్గాలను కలుపుతూ మెట్రో స్టేషన్ల నిర్మాణం జరిగింది. దాదాపు ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉండే ప్రాంతాల్లో మెట్రో ఏర్పాటుతో ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు చాలావరకూ తగ్గాయి. అయితే నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్ నగరంలోని పాతబస్తీ ఏరియా మీదుగా మాత్రం మెట్రో ఏర్పాటు జరగలేదు. రాజకీయ, ఆర్థిక కారణాలతో మెట్రోకు ఇన్నాళ్లు మోక్షం కలగలేదు. తాజాగా మెట్రో ఏర్పాటుకు మోక్షం లభించడంతో ఓల్డ్ సిటీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.హైదరాబాద్ మెట్రో నిర్మాణం మొదటి దశలోనే ఓల్డ్ సిటీ మీదుగా లేన్ వేసేందుకు సన్నాహాలు జరిగాయి. అప్పట్లో ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నూమా వరకూ 7.5 కిలోమీటర్ల మేర మెట్రోరైలు మార్గాన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు జరిగాయి. కానీ కొన్ని రాజకీయ పరిణామాలు, ప్రభుత్వంపై ఒత్తిడితో ఓల్డ్ సిటీ మెట్రోకు మోక్షం లభించలేదు. రేవంత్ రెడ్డి సర్కారు అధికారం చేపట్టిన తరువాత తాజాగా ఓల్డ్‌సిటీలో మెట్రోనిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మెట్రో రూట్‌లో స్వల్ప మార్పులు చేసిన రేవంత్ రెడ్డి సర్కార్.. ఫైనల్‌గా ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణగుట్ట వరకూ 7.5 కిలోమీటర్ల మార్గంలో నయా మెట్రో నిర్మాణానికి చకచక చర్యలు తీసుకుంటోంది. ఈ మార్గంలో మెట్రో నిర్మాణం వల్ల ప్రభావితమయ్యే 1100పైగా ప్రైవేటు ఆస్తులను ఇప్పటికే అధికారులు గుర్తించారు. వీటిలో 205 ఆస్తులకు నష్టపరిహారం చెక్కులు పంపిణీ చేశారు. మెట్రో ఏర్పాటుతో భూములు, ఆస్తులు కోల్పోతున్న, నిర్మాణాలు పాక్షికంగా ధ్వంసమవుతున్న కుటుంబాలను గుర్తించి వారికి 212కోట్ల రూపాయలు చెల్లించారు. మెట్రో నిర్మాణానికి ముందు ఓల్డ్ సిటిలో రోడ్లు విస్తరించే పనిలో పడింది ప్రభుత్వం. ఇందులో భాగంగా విద్యుత్ లైన్లు, టెలిఫోన్ కేబుళ్లను తొలగించి లైన్ క్లియర్ చేస్తున్నారు. మెట్రో అధికారులతోపాటు పోలీస్, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో పనులు వేగంగా సాగుతున్నాయి. విస్తరణ పూర్తైన వెంటనే కేంద్రం అనుమతి తీసుకుని మెట్రో నిర్మాణ పనులు మరింత వేగవంతం చేస్తారు.ఓల్డ్‌సిటీలో మైనార్టీ, హిందూ మతాలు సెంటిమెంట్‌కు ముడిపడిన ప్రార్థనాస్థలాలు, ఆస్తులు కీలకంగా మారాయి. చారిత్రాత్మక కట్టడాలకు మతపరమైన స్థలాలకు ఇబ్బందిలేకుండా విస్తరణ పనులు చేయడమనేది మెట్రో సిబ్బందికి పెను సవాలుగా మారింది. విస్తరణలో భాగంగా అడ్డుగా ఉన్న నిర్మాణాలు తొలిగించడంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే మెట్రో సిబ్బందికి ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. మెట్రో మార్గం విస్తరణలో భాగంగా 1100 ఆస్తులను తొలిగించాల్సి ఉంది. వీటిలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన అధికారులకు సహకరించే వాళ్లు చాలా తక్కువ మంది ఉన్నారు. మిగతావారిని ఒప్పించి ,రోడ్ల విస్తరణ చేయడం ప్రభుత్వానికి ఎదురయ్యే మరో ఛాలెంజ్. ఇవన్నీ సమస్యాత్మక ప్రాంతాలు కావడం మరో సమస్య. అందుకే ఆచితూచి అడుగులు వేయాల్సి వస్తోంది.స్వచ్ఛంధంగా ఆస్తులను మెట్రో నిర్మాణానికి ఇచ్చేందుకు ముందుకు రావాలంటూ ప్రభుత్వం స్థానికులను కోరుతోంది. అవగాహన కల్పిస్తోంది. ఇలా భూసేకరణ సవాళ్లు అధిగమించి, మెట్రో రైలును ఓల్డ్ సిటీలో పట్టాలెక్కించడమే ఇప్పుడు అధికారుల ముందు ఉన్న బిగ్ ఛాలెంజ్. మెట్రో నిర్మాణానికి భూసేకరణ అడ్డంకులు తొలగి, సాధ్యమైనంత వేగంగా మెట్రో నిర్మాణం పూర్తైతే ఓల్డ్ సిటీ రూపురేఖలు మారిపోతాయి. ఆర్థిక అభివృద్ధితోపాటు రియల్ ఎస్టేట్ పీక్స్‌కు చేరుకుంటుంది. కొత్తగా నిర్మించబోతున్న ఎంజీబీఎస్ టూ చంద్రయాణగుట్ట మెట్రో మార్గంలో మొత్తం నాలుగు మెట్రో స్టేషన్లు ఏర్పాటు చేయబోతున్నారు. ఎంజీబీఎస్ నుంచి మొదలైన మెట్రో రైలు సాలర్జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, ఫలక్ నూమా స్టేషన్ల మీదుగా చంద్రాయణగుట్ట చేరుకుంటుంది. మెట్రో అందుబాటులోకి వస్తే ఓల్డ్ సిటీవాసులకు చుక్కలు చూపిస్తున్న ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టినట్లే. పర్యాటకుల తాకిడి పెరిగి టూరిజం మరింతగా అభివృద్ది చెందుతుంది.కోర్టును ఆశ్రయించిన . యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ హైదరాబాద్ పాతబస్తీ మెట్రో కారిడార్ నిర్మాణంలో చారిత్రక కట్టడాలకు నష్టం కలిగించవద్దని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం పురవాస్తు శాఖ గుర్తించిన కట్టడాలను కూల్చొద్దని ఆదేశించింది.హైదరాబాద్ పాతబస్తీ మెట్రో కారిడార్ నిర్మాణంలో పురావస్తు కట్టడాలను కూల్చడంపై దాఖలైన పిల్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. పాతబస్తీలో మెట్రో కారిడార్ ఏర్పాటులో భాగంగా పురాతన కట్టడాలను కూల్చి వేస్తున్నారంటూ యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ హైకోర్టును ఆశ్రయించింది.పురాతన కట్టడాలను కూల్చడం లేదని అదనపు అడ్వకేట్ జనరల్ కోర్టుకు వివరించారు. మెట్రో కారిడార్ నిర్మాణంలో ఆర్కియాలజీ గుర్తించిన కట్టడాల జోలికి పోవద్దని ధర్మాసనం ఆదేశించింది. మెట్రో అలైన్‌మెంట్‌లో తొలగించే కట్టడాల వివరాలతో పూర్తి అఫిడవిట్ సమర్పించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ వ్యవహారంపై కేసు విచారణ ఏప్రిల్ 22కు వాయిదా పడింది.హైదరాబాద్ పాతబస్తీలో మెట్రో లైన్ నిర్మాణం కోసం కొద్ది రోజుల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఇళ్లను తొలగించే ప్రాంతంలో బాధితులకు పరిహారం చెల్లించి కట్టడాలను తొలగిస్తున్నారు. ఈ క్రమంలో చారిత్రక కట్టడాలకు నష్టం కలుగుతోందని పిల్ దాఖలైంది


# ఉప ఎన్నికల బరిలో కవిత



కరీంనగర్, ఏప్రిల్ 18, ( వెలుతురు)

పార్టీ మారితే పవర్ వస్తుందనుకున్న ఎమ్మెల్యేలను అనర్హత వేటు టెన్షన్ వెంటాడుతోంది. వేటు పడితే మాత్రం ఉప ఎన్నిక జరగడం ఖాయం. అయితే ఓ నియోజకవర్గంలో బై ఎలక్షన్ వస్తే మాత్రం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రంగంలోకి దిగబోతున్నారనే చర్చ ఇప్పుడు జోరందుకుంది. పార్టీ క్యాడర్ సైతం కవిత పోటీ చేయాలని డిమాండ్ చేస్తోందట.అదే జరిగితే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కంటే..వారిద్దరి మధ్య జరిగే బై ఎలక్షన్ పోరు తెలంగాణ రాజకీయాలను మరింత హీటెక్కించడం ఖాయంగా కన్పిస్తోంది. ఇంతకీ అనర్హత వేటు లిస్టులో ఉన్న ఆ ఎమ్మెల్యే ఎవరు? ఎమ్మెల్సీ కవిత పోటీ చేస్తే సిట్టింగ్ సీటు దక్కుతుందా? ఇంతకీ కవిత పోటీకి దిగాలని కోరుతున్న ఆ నేత ఎవరు? వాచ్ దిస్ స్టోరీ.కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఇప్పుడు బై ఎలక్షన్ టెన్షన్ పట్టుకుంది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కండువాను మార్చేశారు. బీఆర్ఎస్ పార్టీకే కాదు..ఎమ్మెల్సీ కవితకు వీర విధేయుడిగా ఉన్న సంజయ్ కుమార్ పార్టీ మారుతాడని ఎవరూ ఊహించ లేదు. ఐతే ఎమ్మెల్యేల పార్టీ మార్పును సవాల్‌గా తీసుకున్న బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో కేసు వేసింది. దీనిపై ప్రస్తుతం సుప్రీం ధర్మాసనం విచారిస్తోంది.దీంతో సంజయ్‌కు బై ఎలక్షన్ టెన్షన్ పట్టుకుందట. ఎందుకంటే ఓ వైపు బీఆర్ఎస్ నుంచి విమర్శలు రోజురోజుకి తీవ్రతరం అవుతుంటే.. మరో వైపు కాంగ్రెస్ నాయకులు సంజయ్ రాకను ఇప్పటికీ బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నారు..అంతేకాదు జగిత్యాలలో మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి సంజయ్‌కి అస్సలు పొసగడంలేదనేది బహిరంగరహస్యం. అధిష్టానం ఇద్దరి మధ్య రాజీకుదర్చాలని ప్రయత్నించినా జీవన్ రెడ్డి మాత్రం వెనక్కి తగ్గడంలేదటఇలాంటి పరిస్థితుల్లో జగిత్యాలలో ఉప ఎన్నిక వస్తే పరిస్థితి ఏంటనే టెన్షన్‌లో సంజయ్ ఉన్నారని లోకల్ టాక్. 2014 ఎన్నికల్లో జగిత్యాలలో బీఆర్ఎస్ తరపున పోటీచేసిన సంజయ్..కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత 2018 ఎన్నికల్లో గెలిచారు. అయితే సంజయ్ గెలుపు కోసం కవిత అంత కష్టపడినా చివరకు సంజయ్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. దీంతో పార్టీ మారిన సంజయ్ ని ఓడించి రివేంజ్ తీసుకోవాలనుని కవిత భావిస్తున్నట్లు లోకల్ టాక్.సుప్రీంకోర్టు తీర్పుతో ఒకవేళ ఉప ఎన్నికలు వస్తే..జగిత్యాల నియోజకవర్గంలో తాను పాదయాత్ర చేసి కవితను గెలిపించుకుంటామని ఎమ్మెల్సీ రమణ చేసిన వాఖ్యలు ఇప్పుడు చర్చనీయంశంగా మారాయి. ఇప్పటికిప్పుడు ఉప ఎన్నిక వస్తే..జగిత్యాలలో కవిత, సంజయ్ ప్రత్యర్థులుగా నిలబడతారనే టాక్ విన్పిస్తోంది.అయితే సంజయ్ రాకను వ్యతిరేకించిన మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి..బై ఎలక్షన్లో సంజయ్ కి సపోర్ట్ చేస్తారా? లేదా అనేది ఆసక్తికరంగా మారనుంది. జీవన్ రెడ్డి గురించి తెలిసిన వారు మాత్రం ఖచ్చితంగా సపోర్ట్ చేయరంటూ ఓపెన్ గానే చెప్తేస్తున్నారంట. ఒకవేళ ఉప ఎన్నికల్లో జీవన్ రెడ్డి తనకే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తే మాత్రం సంజయ్ పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారే అవకాశం ఉంది.ఇదిలా ఉంటే జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారినా.. కవిత అనుచరులు, పార్టీ క్యాడర్ మాత్రం అలానే ఉన్నారు. జగిత్యాల అభ్యర్థిగా కవిత రంగంలోకి దిగితే వార్ వన్ సైడే అంటోంది గులాబీ దళం. నాడు సంజయ్ గెలుపు కోసముమ్మర ప్రచారం చేసిన కవిత.. ఇప్పుడు తన గెలుపు కోసం ఏ రేంజ్ లో ప్రచారం చేస్తారో ఊహించుకోండి అంటున్నాయట పార్టీ శ్రేణులు. ఒకవేళ బై ఎలక్షన్స్ వస్తే జగిత్యాల జగడం రసవత్తరంగా మారనుంది.

# భారీగా పెరుగుతున్న కాస్ట్ ఆఫ్ లివింగ్





హైదరాబాద్, ఏప్రిల్ 18, ( వెలుతురు)

ప్రాథమిక విద్య పూర్తి అయిన తర్వాత ఉన్నత విద్యా కోసం చాలామంది విద్యార్థులు పట్టణాలకు లేదా నగరాలకు వెళుతూ ఉంటారు. పట్టణాల్లో చదువు పూర్తి చేసుకున్న వారు ఉపాధి కోసం నగరాలకు వెళుతూ ఉంటారు. తెలంగాణలో ఏ మూలనో ఉన్న వారు సైతం హైదరాబాదులో జీవించాలని కోరుకునే వారు ఎక్కువగానే ఉన్నారు. ఎందుకంటే హైదరాబాదులో ఏదో ఒక పని చేసుకుంటూ ఉపాధి పొందవచ్చని.. అలాగే డబ్బు బాగా సంపాదించవచ్చని అనుకుంటారు. అయితే ప్రస్తుత కాలంలో జీతాలతో పాటు.. ఖర్చులు కూడా బాగానే పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఇంటి అద్దె విషయంలో తడిసి మోపెడ అవుతుందని ఇక్కడకి వలస వచ్చిన వారు చెబుతున్నారు. వచ్చే జీవితంలో సగం వరకు ఇంటి అద్దె చెల్లించడానికి సరిపోతుందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రస్తుతం అద్దె రేట్లు హైదరాబాదులో ఎలా ఉన్నాయో చూద్దాం..ఇటీవల ఇన్ఫోమెన్స్ ఆన్లైన్ మీడియా స్టార్ టాప్ ఇన్ఫర్మేషన్ ప్లాట్ ఫామ్ ఓ సర్వే నిర్వహించింది. హైదరాబాదులో లివింగ్ కాస్ట్ ఎలా ఉంది? అనే దానిపై రీసెర్చ్ చేసి వివరాలను బయటపెట్టింది. ఈ పరిశోధనలో భాగంగా మొత్తం దేశవ్యాప్తంగా 10 ప్రధాన నగరాలను ఎంచుకుంది. ఇందులో ముంబై రూము 35, 887 తో మొదటి స్థానంలో ఉండగా.. జైపూర్ 27,813 తో చివరి స్థానంలో నిలిచింది. హైదరాబాదు ఆరవ స్థానంలో నిలిచింది.హైదరాబాదులో జీవించాలంటే నెలకు కనీసం 30 నుంచి 50 వేల వరకు ఖర్చు అవుతుందని ఈ సంస్థ తెలిపింది. ఇందులో ప్రధానంగా అద్దె ఇంటికి రూ.8, 000 చెల్లించాల్సిందే. ఇది కూడా సింగిల్ రూమ్ మాత్రమే. కాస్త ఫ్లెక్సిబుల్ రూమ్ కావాలంటే కనీసం రూపం 15 వేల వరకు అవుతుంది. ఇక కిరాణా ఖర్చులు, రవాణా ఖర్చులు, నిత్యవసరాలు, అదనపు ఖర్చులు కలిపి మొత్తం 31,000 అవుతుందని ఈ సంస్థ తెలిపింది. ఇక పిల్లల స్కూల్ ఫీజులు తోపాటు వైద్య ఖర్చులు అదనంగా భరించాల్సి వస్తుంది. ప్రస్తుతం సామాన్యులు వీటితోనే సతమతమవుతున్నారు. సినిమా లేదా ఇతర వ్యసనాలు ఉంటే మాత్రం ఈ ఖర్చుల్లో కొన్ని మాయం అవుతుంటాయి. ఎందుకంటే ఫ్యామిలీతో కలిసి సినిమాకు వెళ్లాలంటే కనీసం రూ.1500 వరకు అవుతుంది. సామాన్యులు నెలకు ఒక్కసారి సినిమాకు వెళ్లిన కనీసం రూ.2,000 వరకు చెల్లించాల్సిందే.ఇక పార్కులు లేదా ఫంక్షన్ల లాంటి కార్యక్రమాలకు మరింత ఖర్చు అయ్యే అవకాశం ఉంది. అయితే కొందరు వచ్చిన ఆదాయం సరిపోకపోవడంతో అదనంగా అప్పులు చేయాల్సి వస్తుంది. ఇలా బ్యాంకు నుంచి కూడా రుణాలు తీసుకొని జీవితాన్ని గడుపుతున్నారు. అయితే మిగతా ప్రదేశాల్లో కంటే హైదరాబాదులో అన్ని ధరలు పెరిగిపోయాయి. దీంతో సగటు మానవుడు ఇక్కడ జీవించాలంటే కనీసం రూ. 50వేల ఆదాయం వస్తూ ఉండాలి. కానీ చాలామందికి ఆ పరిస్థితి లేదు. ఒకవేళ అంత జీతం వచ్చినా అదనపు అనారోగ్యాలు వచ్చే అవకాశాలు ఉంటున్నాయి. అయితే ఖర్చులను తగ్గించుకొని ప్రయత్నం చేస్తేనే ఆదాయం సరిపోయే అవకాశం ఉంటుందని కొందరు నిపుణులు తెలుపుతున్నారు.

# బద్రీ..రీ రిలీజ్‌కు సన్నాహాలు

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కెరీర్ తొలినాళ్లలో వచ్చిన సినిమా బద్రి. బ్యాక్ టు బ్యాక్ హిట్స్ కొడుతున్న టైమ్ లో పూరి జగన్నాథ్ ని దర్శకునిగా పరిచయం చేస్తూ చేసిన సినిమా బద్రి. 2000లో విడుదలైన ఈ సినిమా సెన్సేషన్ క్రియేట్ చేసింది. మరి ముఖ్యంగా పవర్ స్టార్ చెప్పిన 'నువ్వు నంద అయితే నేను బద్రి బద్రీనాథ్ అయితే ఏంటి అన్నటువంటి డైలాగ్స్ యూత్ లో మంచి క్రేజ్ ను తీసుకువచాయి. పవర్ స్టార్ బెస్ట్ సినిమాలో బద్రికి స్పెషల్ ప్లేస్ ఉంటుంది. కాగా ఇప్పుడు మరోసారి బద్రి తన మాస్ మ్యానరిజం చూపించేందుకు రెడీ అవుతున్నాడు. టాలీవుడ్ లో ఇటీవల రీరిలీజ్ ట్రెండ్ జోరుగా సాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బద్రి కూడా రిరిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. వాస్తవానికి ఈ సినిమా ఎప్పుడో రీరిలీజ్ కావాల్సి ఉంది కానీ అనుకోని కారణాల వలన వాయిదా పడుతూ వస్తుంది. కానీ ఈ ఏడాది పవన్ బర్త్ డే కానుకగా అనగా సెప్టెంబర్ 2కి రిరిలీజ్ చేసే ప్లానింగ్స్ లో ఉన్నట్టుగా తెలుస్తుంది. ప్రస్తుతం ప్రింట్ పనులు జరుగుతున్నాయని సమాచారం. మంచి క్వాలిటీతో, పర్ఫెక్ట్ ఆడియో క్వాలిటీతో ఈ సినిమాను రిలీజ్ తీసుకురానున్నారని టాక్.




# విజయవాడలో కీర్తి సురేశ్ సందడి

విజయవాడలో టాలీవుడ్ మహానటి కీర్తి సురేశ్ సందడి చేశారు. నగరంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఓ షాపింగ్ మాల్ ఓపెనింగ్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కీర్తి సురేశ్‌ను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నటితో సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు ఎగబడ్డారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. నేను శైలజా' అనే మూవీతో తెలుగు ప్రేక్షకులని పలకరించింది కీర్తి సురేశ్. ఆ తర్వాత 'మహానటి'తో ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ఈ సినిమాతో జాతీయ ఉత్తమనటిగా అవతరించింది. ఆ తర్వాత తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో వరుస పెట్టి సినిమాలు చేస్తోంది. ప్రస్తుతం కీర్తి ఓ క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కీర్తి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్‌లో బాలీవుడ్ నటి రాధికా ఆప్టే కీలక పాత్రలో నటించబోతుంది.



# గుడి కావాలంటున్న ఊర్వశి రౌతేలా

వెండితెరపై హీట్ పుట్టించే ఊర్వశి రౌతేలా... ఆఫ్ స్క్రీన్ లో తన నోటి దురదతో వివాదాలు కోరి తెచ్చుకుంటుంది. మొన్నామధ్య తాను నటించిన సినిమా వందకోట్లు రాబట్టింది, కియార నటించిన సినిమా ఫ్లాప్ అయిందని కామెంట్స్ చేసింది. రోజు రోజుకి ఈ బ్యూటీకి పైత్యం పెరిగిపోతుందనే చెప్పాలి. తాజాగా మరోసారి అతిగా అనిపించే కామెంట్స్ చేసింది ఊర్వశి. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూ లో మాట్లాడుతూ' నార్త్ ఇండియాలో నా పేరు మీద ఒక గుడి ఉంది. బద్రీనాథ్ టెంపుల్ పక్కన ఉన్నఊర్వశి టెంపుల్ నా కోసం కట్టారు. అలాగే టాలీవుడ్ లో చిరు సీనియాతో ఎంట్రీ ఇచ్చి బ్యాక్ టు బ్యాక్ స్టార్ హీరోల సినిమాలతో నాకు ఫ్యాన్స్ వచ్చారు. నార్త్ లో లాగే నాకు సౌత్ లో కూడా నా ఫ్యాన్స్ గుడికట్టాలని కోరుతున్నాను' అని చెప్తోంది. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పైత్యం ఎక్కువైతే ఇంతే ఇలానే మాట్లాడుతారని బాలీవుడ్ బ్యూటీపై నెటిజన్స్ ట్రోలింగ్ చేస్తున్నారు.



# థగ్ లైఫ్ నుంచి ఫస్ట్ సింగిల్ విడుదల

కమల్ హాసన్ హీరోగా ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కిస్తోన్న చిత్రం 'థగ్ లైఫ్'. పాన్ ఇండియా స్థాయిలో భారీ తారాగణంతో ఈ చిత్రం రూపొందుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ విడుదలైంది. ఏఆర్ రెహమాన్ అందించిన సంగీతం అందరినీ ఆకట్టు-కుంటోంది. ఈ పాటకు కమల్ హాసన్ లిరిక్స్ అందించారు. ఆయనతో పాటు- శింబు కూడా ఈ పాటలో చిందేశారు. జూన్ 5న ఈ సినిమా విడుదల కానుంది.




# కన్నప్ప అద్భుతంగా ఉంటుంది

## నటుడు మంచు మనోజ్ వెల్లడి

మంచు విష్ణు కీలక పాత్రలో ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'కన్నప్ప' ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్ర ప్రచారంలో భాగంగా మంచు విష్ణు పలు విషయాలపై మాట్లాడారు. ముఖ్యంగా దక్షిణాది చిత్రాలను హిందీ ప్రేక్షకులకు మరింత చేరువ చేయాలన్నారు. అన్ని వర్గాలు, భాషల వారు చూసేలా మనం సినిమా తీస్తున్నప్పుడు హిందీ ప్రేక్షకుల వద్దకు కూడా వెళ్లి మన సినిమాను ప్రచారం చేసుకోవాలని అన్నారు. అందుకే 'కన్నప్ప' నా గత చిత్రాల మార్కెట్‌కన్నా మించిపోవడమే కాదు, భారీ బడ్జెట్‌తో రూపొందించాం. ఈ సినిమాను ఎక్కువ మంది ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లాలన్నది మా ఆలోచన. మా 'కన్నప్ప' ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. ఎన్నో అద్భుతమైన కథలు ఇంకా ఉన్నాయి. అవి కార్యరూపం దాల్చే విషయమై బాలీవుడ్ స్టార్స్‌తో ఇప్పటికే చర్చలు కొనసాగిస్తున్నాం అని మంచు విష్ణు అన్నారు. ప్రజలెప్పుడూ వీళ్లు దక్షిణాది, వాళ్లు ఉత్తరాది నటులు అని చూడరు. అందరూ మన నటులే అనుకుంటారు. దర్శక-నిర్మాతలు మూలాలకు వెళ్లి కథా రచనపై దృష్టిపెట్టాలి. అప్పుడే అందులోని భావోద్వేగాలను కథలోకి తీసుకురాగలరు. ప్రస్తుతం దక్షిణాది చిత్రాలు ఇదే పంథాను అనుసరిస్తున్నాయి. అదే సమయంలో విజయాల రేటు మాత్రం అన్ని ఇండస్ట్రీల్లోన్రూ ఒకేలా ఉంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ ఇండస్ట్రీలను బాలీవుడ్‌కు వ్యతిరేకంగా చూపించడం సరైనది కాదని నా అభిప్రాయం అని అన్నారు.



# అర్జున్ సన్నాఫ్ వైజయంతి

## పాత కథకు కొత్త మెరుగులు

నిర్మాణంలో ఉండగానే చర్చనీయాంశమైన సినిమా 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్‌రామ్ సినిమా అనగానే మాస్ ఆడియన్స్ సినిమాపై ఆసక్తి చూపించడం సాధారణం. ఈ సినిమాలో ఆయనకు సీనియర్ నటి విజయశాంతి కూడా తోడవ్వడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. పైగా తల్లీకొడుకుల నేపథ్య కథాంశంతో రూపొందిన ఈ సినిమాలో విజయశాంతి తనకు బాగా కలిసొచ్చిన పోలీసాఫీసర్ రోల్ చేశారు. కల్యాణ్‌రామ్ పాత్ర అత్యంత శక్తిమంతంగా ఉంటుందని ప్రమోషన్స్‌లో మేకర్స్ తెలియజేశారు. కథలోకి వెళితే..వైజయంతి(విజయశాంతి) సిన్సియర్ ఐపీఎస్ ఆఫీస్. ఆమెకు ఒక్కకానొక్క కొడుకు అర్జున్(కల్యాణ్‌రామ్). అర్జున్‌ని ఎలాగైనా ఐపీఎస్ ఆఫీసర్‌గా చూడాలనేది వైజయంతి కల. అందుకు తగ్గట్టే తనను ఐపీఎస్ చదివిస్తుంది. ట్రైనింగ్ కోసం ఢిల్లీ పంపిస్తుంది. ఏడాది ట్రైనింగ్ పూర్తి చేసుకొని తిరిగిరావాల్సిన అర్జున్.. వెళ్లిన అయిదోరోజే తిరిగి వచ్చేస్తాడు.



కారణం తన తండ్రి మరణం. నేవీ అధికారి అయిన తన తండ్రి సముద్రంలో ప్రమాదవశత్తూ మరణించాడని పోలీసులు చెబుతారు. నిజానికి అర్జున్ తండ్రి మరణానికి కారణం ప్రమాదం కాదు.. అదో హత్య. ఆ విషయం తెలుసుకున్న అర్జున్.. తన తండ్రిని చంపిన వ్యక్తులపై పగ తీర్చుకోవాలనుకుంటాడు. కానీ.. అర్జున్‌ని వైజయంతి వారిస్తుంది. చట్టప్రకారం దోషులకు శిక్షపడేలా చేస్తానని, నువ్వు ఐపీఎస్ పూర్తి చేయాలని చెప్పి కొడుకుని మళ్లీ ట్రైనింగ్‌కి పంపించేస్తుంది. ఏడాది తర్వాత అర్జున్ శిక్షణ ముగించుకొని తిరిగొస్తాడు. తన తండ్రి కేసుకు సంబంధించిన జడ్జిమెంట్ ఆరోజే. అర్జున్ తండ్రిది హత్య కాదని, అది ప్రమాదవశత్తే జరిగిందని కోర్టు తీర్పు ఇస్తుంది. హంతకులు కోర్టు నుంచి బయటకొస్తూనే వైజయంతిని అవమానంగా మాట్లాడతారు. అన్యాయం ముందు చట్టం, న్యాయం ఓడిపోవడం కళ్లారా చూస్తాడు అర్జున్. తన కళ్లముందే తల్లిని అవమానిస్తుంటే భరించలేకపోతాడు. అతని కోపం కట్టలు తెంచుకుంటుంది. కోర్టు ఎదురుగానే హంతకుడ్ని కొట్టి చంపేస్తాడు. అంతేకాదు, తన తండ్రి హత్యకు కారణమైన ముఠాలో 41మందిని నరికి చంపేస్తాడు. ఐపీఎస్ కావాల్సిన కొడుకు కంటిముందే హంతకుడుగా మారడం చూసిన వైజయంతి నిశ్చేష్టురాలైపోతుంది. గూండాగా మారిన కొడుకు మీదే యుద్ధానికి సిద్ధమవుతుంది. మరి విధి విడదీసిన ఈ తల్లీబిడ్డలు మళ్లీ ఎలా కలిశారు? ఐపీఎస్ అవ్వాల్సిన అర్జున్ గూండాగా మారి సాధించిందేంటి? అన్నదే సినిమా కథ.భావోద్వేగాలతో కూడిన మాస్ ఎంటర్‌టైనర్ ఇది. దర్శకుడు ప్రదీప్ చిలుకూరి సినిమాను నడిపించిన విధానం బావుంది. హీరోను గూండాగా ఓపెన్ చేసి, తాను అలా మారడానికి గల కారణాన్ని హృద్యంగా చెప్పిన తీరు బావుంది. తండ్రిని చంపిన వారిపై పగతీర్చుకోవడం.. ఈ క్రమంలో కష్టాల్లోవున్న జనాలకు అండగా నిలవడం.. కథలో ప్రధానమైన అంశాలు ఈ రెండు అయితే.. వీటికి తోడు డ్రగ్స్‌ని, మాఫియాని కూడా లింక్ చేశాడు దర్శకుడు. ఒకడ్ని మించిన ఒకడ్ని విలన్‌గా పరిచయం చేసుకుంటూ.. ఒకడి తర్వాత ఒకడ్ని చంపుకుంటూ మొత్తంగా తెరంతా రక్తపాతాన్ని సృష్టించేశాడు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. యాక్షన్ ఎపిసోడ్స్ అన్నీ బావున్నాయి. ఓ దశలో కథలోని ఎమోషన్‌ని యాక్షన్ డామినేట్ చేసిందా అనిపిస్తుంది.

# దివంగత అధ్యక్షుడు జిమ్మీకార్టర్‌పై ప్రేలాపన

- జో బైడెన్ చెత్త అధ్యక్షుడని గుర్తించాడని వ్యాఖ్య



**వాషింగ్టన్, ఏప్రిల్18 ( వెలుతురు):**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మాజీ అధ్యక్షుడి మరణంపై అనుచితంగా మాట్లాడారు. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ పరిపాలన గురించి మాట్లాడుతూ ఇటీ-వల మరణించిన మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ మరణంపై ట్రంప్ అవహేళనగా మాట్లాడారు. జో బైడెన్ తన కంటే 'చెత్త' అధ్యక్షుడు అని తెలుసుకుని జిమ్మీ కార్టర్ సంతోషంగా కన్నుమూశారని వ్యాఖ్యానించారు. గురువారం ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో కలిసి ఓవల్ ఆఫీసులో విలేకర్లతో మాట్లాడుతూ ట్రంప్ ఈ అనుచిత వ్యాఖ్యలు చేశారు. జో బైడెన్ పరిపాలన చాలా భయంకరమైందన్నారు. ఎన్నికల్లో ప్రజలను మోసం చేయడంలో సమర్థులని వ్యాఖ్యానించారు. ఆ అసమర్థులు ప్రజలకు ఏమీ చేయలేకపోయారని ధ్వజమెత్తారు. అమెరికా చరిత్రలోనే బైడెన్‌ది చెత్త పరిపాలన అంటూ మండిపడ్డారు. జిమ్మీ కార్టర్ కంటే బైడెన్ అధ్వానంగా పరిపాలించారని.. ఈ విషయం తెలుసుకుని కార్టర్ సంతోషంగా కన్నుమూశారని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా 39వ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ బాధ్యతలు నిర్వర్తించారు. గతేడాది డిసెంబరు 29న ఆయన మరణించారు. జనవరిలో జరిగిన అంత్యక్రియలకు ట్రంప్‌తో సహా పలువురు మాజీ అధ్యక్షుల దంపతులు హాజరయ్యారు.

# బంగ్లా మైనార్టీ హిందువులను రక్షించండి

- యూనస్ వ్యాఖ్యలకు భారత్ ధీటుగా జవాబు




**న్యూఢిల్లీ, ఏప్రిల్18 ( వెలుతురు):**
పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ సవరణ చట్టంతో నెలకొన్న హింసపై బంగ్లాదేశ్ ముఖ్య సలహాదారు ముహమ్మద్ యూనస్ స్పందించిన తీరుపై భారత్ ఘాటుగా సమాధానం చెప్పింది. గత వారం బెంగాల్ రాష్ట్రంలోని ముర్షిదాబాద్ జిల్లాలో చెలరేగిన హింసలో ముగ్గురు మరణించగా, వందలాది మంది గాయపడిన మైనారిటీ ముస్లిం వర్గాలను రక్షించాలని భారత ప్రభుత్వాన్ని యూనస్ కోరారు. ఇక, బంగ్లాదేశ్ వ్యాఖ్యలను విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తోసిపుచ్చారు. ఇలాంటి అనవసరమైన వ్యాఖ్యలు చేయడం కంటే, తమ దేశంలోని మైనారిటీల హక్కులను కాపాడు కోవడంపై దృష్టి పెట్టాలని చురకలు అంటించాడు. బంగ్లాదేశ్ మైనార్టీలపై కపట ప్రేమ చూపిస్తుందని ఆరోపించారు. బంగ్లాలో మైనారిటీలపై జరుగుతున్న హింస నుంచి దృష్టిని మళ్లించే ప్రయత్నంగా అభివర్ణించారు. ఇక, గత సంవత్సరం మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనా పదవీచ్యుతులైనప్పటి నుంచి బంగ్లాదేశ్‌లో పరిస్థితి గందరగోళంగా ఉంది. బంగ్లాలో మైనార్టులుగా ఉన్న హిందువులపై తీవ్రవాద ఇస్లామిస్టులు అనేకసార్లు దాడులకు పాల్పడ్డారు. దాదాపు 200 దేవాలయాలను ధ్వంసం చేయగా.. పూజారులను అరెస్టు చేశారు.. మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని హింసించారనే ఆరోపణలను బంగ్లాదేశ్ తరచుగా ఖండించింది.

# ఫెరగనున్న మద్యం ధరలు



**హైదరాబాద్, ఏప్రిల్18 ( వెలుతురు):**
మందు బాబులకు తిప్పలు తప్పడం లేదు. ఇది వారికి షాకింగ్ న్యూస్ అనే చెప్పవచ్చు. త్వరలోనే మళ్లీ మద్యం ధరలు పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే బీర్ల ధరలను 15 శాతం పెంచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు లిక్కర్ ధరలు పెంచాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.ఒక చీప్ లిక్కర్ తప్ప.. రూ.500 కంటే ఎక్కువ ఉన్న మందు బాటిళ్లపై కనీసం 10 శాతం పెంచనున్నట్లు తెలుస్తోంది. దీన్ని బట్టి ప్రతి లిక్కర్ బాటిల్‌పై కనీసం రూ. 50 పెరిగే అవకాశం ఉంది. ఎక్సైజ్ అధికారులతో, ఇతరు ముఖ్య అధికారులతో సమీక్షించిన అనంతరం ధరల పెంపుపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. త్వరలోనే.. మద్యం ధరలను పెంచి ఆ వివరాలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలుస్తోంది. మద్యం ధరలు పెంచడం ద్వారా ఏడాదికి తక్కువలో తక్కువ అనుకున్నా రూ. 2000 కోట్లు అదనపు ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నట్టు తెలుస్తోంది.రెండు నెలల క్రితం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీర్ల ధరలను పెంచిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం బీర్ల ధరలను దాదాపు 15 శాతం వరకు పెంచింది. దీనివల్ల ఒక్కో బీరుపై సగటున రూ. 20 నుంచి రూ. 30 వరకు ధర పెరిగిన విషయం తెలిసిందే. ఈ ధరలకే మందు బాబులు తలలు బాదుకుంటున్నారు. తాజాగా లిక్కర్ బాటిళ్లపై కూడా మద్యం ధరలు సైతం పెరుగుతాయని వార్తలు వస్తుండటంతో మందుబాదులకు తిప్పడం తప్పడం లేదు.

# ధన్‌ఖడ్ వ్యాఖ్యలు సుప్రీంపై దాడే

- వక్ఫ్ బిల్లు రాజ్యాంగ విరుద్ధమే
- సిపిఐ కార్యదర్శి రామకృష్ణ విమర్శలు







**విజయవాడ, ఏప్రిల్18 ( వెలుతురు):**
న్యాయవ్యవస్థపై ముఖ్యంగా సుప్రీం తీరుపై ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. జడ్జీలకు బాధ్యత లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన.. సుప్రీంకోర్టు తాజా తీర్పు రాష్ట్రపతిని ఆదేశిస్తోందని. ఇది ప్రజాస్వామ్యానికి ముప్పు అని కామెంట్ చేశారు.. అయితే, ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలను సుప్రీంకోర్టుపై దాడిగానే భావిస్తున్నాం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు.. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన.. భారతదేశంలో అధికారంలో ఉన్న పెద్దలు న్యాయవ్యవస్థ పై దాడి చేస్తున్నారు.. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యలు సుప్రీంకోర్టుపై దాడిగానే భావిస్తున్నాం.. రాష్ట్రాల గవర్నర్ల పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆయనకు నచ్చడం లేదు.. దేశంలో ఎమర్జన్సీ నాటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి అని ఆందోళన వ్యక్తం చేశారు.. ?వక్ఫ్ లో ఇతర మతస్తులను పెట్టొద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.. వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగం పై దాడిగా పేర్కొన్నారు. వక్ఫ్ బిల్లు పై సొలిసిటర్ జనరల్ కూడా సుప్రీంకోర్టును అవమానించే పద్ధతిలో మాట్లాడుతున్నారు.. ప్రమాదకరమైన వక్ఫ్ బిల్లు పాస్ కావడానికి టీడీపీ కారణమవ్వడం దురదృష్టకరం అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతిచ్చి చంద్రబాబు, నితీష్ కుమార్.. దేశవ్యాప్తంగా చిచ్చు పెట్టారు.. చంద్రబాబు ఇచ్చిన సవరణలను ఆమోదించకపోయినా.. ఎందుకు బిల్లుకు మద్దతు తెలిపారు? అని నిలదీశారు.. చంద్రబాబు తన స్వార్ధ రాజకీయాలు పక్కన పెట్టాలని సూచించారు. ఏపీలో కామెడీ రాజకీయం నడుస్తోంది.. రకరకాల కారణాలతో గోశాల ఆవులు చనిపోయుండొచ్చు.. దానికి అంత చర్చ దేనికి..? ఆవుల మృతి పై కరుణాకర్ రెడ్డి చేసిన సూచనలు తీసుకుంటే తప్పేముంది? కూటమి పార్టీలన్నీ కలిసి పక్కా కామెడీ ట్రాక్ నడిపిస్తున్నారు అంటూ ఎద్దేవా చేశారు.. రాజధాని అమరావతి విషయంలో చంద్రబాబు పారదర్శకంగా వ్యవహరించాలని రామకృష్ణ సూచించారు .. రాజధాని అప్పులకు కేంద్రమే ష్యూరిటీ- ఇస్తుందని.. చివరకు హడ్కో, వరల్డ్ బ్యాంక్, ఏషియన్ బ్యాంకు నుంచి అప్పులు తెచ్చారన్న ఆయన.. జర్మనీ సంస్థ నుంచి ఐదువేల కోట్లు- అప్పుతెచ్చారు.. అమరావతి కోసం 62 వేల కోట్లు అప్పులు తెచ్చారు .. ఈ అప్పుల్లో కేంద్రం ఏమైనా గ్రాంట్ ఇచ్చిందా..? ఈ అప్పును కేంద్రం చెల్లిస్తుందా..? అని ప్రశ్నించారు. సెల్ఫ్ స్టసైనబుల్ ప్రాజెక్ట్ అని చెప్పి మరో 44 వేల ఎకరాలు తీసుకోవాలని చూడటమేంటి..? అని నిలదీశారు.. సీఎం సొంతజిల్లా చిత్తూరులో అన్నీ మూతపడ్డాయి.. కడప స్టీల్ ఫ్యాక్టరీ గురించి చంద్రబాబు మాట్లాడటం లేదు.. 26 జిల్లాల్లో అత్యధికంగా వలసలున్న జిల్లా కర్నూలు.. గోదావరి బనకచర్ల ప్రాజెక్టు ఎవరడిగారు నిన్ను.. మే2వ తేదీ మళ్లీ ప్రధాని రావడం దేనికి? అంటూ సీఎం చంద్రబాబుపై సీపీఐ కార్యదర్శి రామకృష్ణ ప్రశ్నల వర్షం కురిపించారు.

# ఐపీఎల్ లో ఫిక్సింగ్...అనుమానాలు




**హైదరాబాద్, ఏప్రిల్18 ( వెలుతురు):**
ఐపిఎల్ 2025లో మ్యాచ్ ఫిక్సింగ్ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయా? తెర వెనక ఐపీఎల్ జట్లను నయానా భయానా లొంగదీసుకోవటానికి హైదరాబాద్ కేంద్రంగా లాబీయింగ్ నడుస్తోందా? హైదరాబాద్?లోనే ఓ బడా వ్యాపారవేత్త ఈ ఐపీఎల్ మ్యాచ్ ఫిక్సింగ్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశాడా? అంటే అవుననే సమాధానం వస్తుంది. ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని అన్ని ఐపీఎల్ జట్ల ఆటగాళ్లకు బీసీసీఐ వార్నింగ్ ఇచ్చింది. ఐపీఎల్ సీజన్ వచ్చిందంటే చాలు.. ఏదో ఒక వివాదం లేకుండా సీజన్ పూర్తి కాదు. తాజాగా జరుగుతున్న సీజన్ అందుకు మినహాయింపు కాదు. గతంతో పోలిస్తే ఇటీవల కాలంలో ఐపీఎల్ సీజన్‌లో వెలుగు చూస్తున్న వివాదాలు కొంత తగ్గాయన్న మాట వినిపిస్తోంది. అందుకు చెక్ పడేలా.. తాజాగా బీసీసీఐ నేరుగా రంగంలోకి దిగటం.. స్పష్టమైన హెచ్చరికను జారీ చేయటం సంచలనంగా మారింది.ఐపీఎల్ ఎడిషన్ 18 రసవత్తరంగా సాగుతోంది. ఇప్పటికే దాదాపు అన్ని జట్లు సగం మ్యాచులు ఆడేశాయి. మరో ఆఫ్ సీజన్ మిగిలి ఉంది. ఎలాంటి అవాంతరాలు లేకుండా ఫస్ట్ హాఫ్ సక్సెస్?ఫుల్?గా కంప్లీట్ అయ్యింది. ఓ వైపు పరుగుల వరద పారుతుండగా.. కొన్ని మ్యాచుల్లో బౌలర్ల అద్భుత ప్రదర్శనతో ఓడిపోయే మ్యాచ్?లను కూడా టర్న్ చేశారు. ఇలా ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగుతోన్న ఐపీఎల్?లో మ్యాచ్ ఫిక్సింగ్ వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. ఐపీఎల్?లో మ్యాచ్ ఫిక్సింగ్ చేసేందుకు కొన్ని శక్తులు ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యాపారి చట్టవ్యతిరేక పనులు చేసేలా వ్యక్తుల్ని ఒత్తిడికి గురి చేస్తున్నట్లుగా బీసీసీఐ వెల్లడించింది. ఈ సందర్భంగా ఐపీఎల్‌తో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేసింది. ఆ వ్యాపారి విషయంలో జాగ్రత్తగా ఉండండి. క్రికెటర్లు.. కోచ్‌లు.. సహాయ సిబ్బంది.. వ్యాఖ్యాతలు.. ఐపీఎల్‌తో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేసింది. అలాగే అతనికి దూరంగా ఉండాలని ఐపీఎల్ జట్లకు.. బీసీసీఐ హెచ్చరించడం సంచలనంగా మారింది.అయితే గతంలో క్రికెట్ బెట్టింగ్స్, మ్యాచ్ ఫిక్సింగ్?లు చేసిన అనుభవం ఆ వ్యాపారవేత్తకు ఉందని.. అతడికి పంటర్లు, బుకీలతో దగ్గరి సంబంధాలు ఉన్నాయని బీసీసీఐ పేర్కొంది. అతడు మళ్లీ యాక్టివ్ అయ్యాడని, మ్యాచ్ ఫిక్సింగ్ చేసేందుకు జట్టు యజమానులుఆటగాళ్లను కలిసేందుకు ట్రై చేస్తున్నాడని.. అతడితో జాగ్రత్తగా ఉండాలని సూచించింది. డబ్బే కాకుండా విలువైన వస్తువులు, గిఫ్ట్?లు ఎరగా వేస్తాడనీ, కుటుంబ సభ్యులకు కూడా విలువైన గిఫ్టులు పంపి రొంపిలోకి లాగుతాడని హెచ్చరించింది. అతడితో జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఇప్పటికే అతడు ఎవరినైనా సంప్రదిస్తే తమకు సమాచారం అందించాలని సూచించింది. బుకీల వలలో చిక్కుకుని భవిష్యత్ పాడు చేసుకోవద్దని హెచ్చరించింది.ఎవరీ హైదరాబాదీ వ్యాపారి? అన్న చర్చ ఇప్పుడు జోరుగా సాగుతోంది. గతంలో ఎప్పుడూ ఈ విధంగా ఒక బిగ్ షాట్ ను ఉద్దేశించి ఈ తరహా వార్నింగ్ లు ఇచ్చింది లేదని చెబుతున్నారు. ఐపీఎల్ వ్యక్తులతో స్నేహం చేయటానికి.. సంబంధాలు పెంచుకోవటానికి సదరు వ్యాపారి ప్రయత్నిస్తున్న ట్లుగా బీసీసీఐ పేర్కొంది. ఖరీదైన బహుమతులతో బుట్టలో వేసుకోవటం అనే వ్యూహాన్ని అమలు చేస్తున్న సదరు వ్యాపారి.. ఇప్పటికే పలువురికి ఖరీదైన బహుమతుల్ని ఇచ్చి కొందరితో పరిచయాలు పెంచుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

# రజతోత్సవ సభకు అడ్డంకులెన్నో

**హైదరాబాద్, ఏప్రిల్18 ( వెలుతురు):**
BRS రజతోత్సవ సభ గులాబీ దళంలో గుబులు రేపుతోందట. 2001 ఏప్రిల్ 27న పురుడు పోసుకున్న నాటి తెలంగాణ రాష్ట్ర సమితే నేటి భారత రాష్ట్ర సమితి.. BRSగా అవతరించింది. తన 24 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తిచేసుకొని ఈ నెల 27న 25వ ఏట అడుగు పెడుతోంది. ఈ పాతికేళ్ల పండుగ ఉత్సవాలను 10 లక్షల మందితో బహిరంగ సభను ఘనంగా నిర్వహించి సక్సెస్ చేయాలని గులాబీ బాస్ కేసీఆర్ నిర్ణయించారు.వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బహిరంగ సభకు ప్లాన్ చేసి ఆ బాధ్యతలను హరీశ్ రావుకు అప్పగించారు కేసీఆర్. ఇంతవరకు బాగానే ఉన్నా ఇక్కడే అసలు సమస్య మొదలైందట. సభా నిర్వహణ కోసం అప్పటివరకు యాక్టివ్‌గా తిరిగిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సభ ఏర్పాట్ల విషయంలో చుట్టపు చూపుగా మారిపోయారట.ఇక సభ నిర్వహించే వరంగల్ లోనే మకాం వేస్తానని చెప్పిన హరీశ్ రావు ఇంత వరకు సభా నిర్వహణ ప్రాంతానికిగానీ, వరంగల్ నగరానికిగాని రానే రాలేదట. హరీశ్ దరావు ఒక్కసారిగా రజతోత్సవ సభా నిర్వహణ బాధ్యతల నుంచి తెరమరుగయ్యారనే చర్చ జిల్లా రాజకీయాల్లో హాట్ హాట్ గా సాగుతోంది.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ కీలక నేత, ఎమ్మెల్సీ కవిత కూడా సభా నిర్వహణ విషయంలో కీలక పాత్ర పోషిస్తారని ఇంటర్నల్ సమావేశాల్లో కేసీఆర్ ఆదేశించారని గులాబీ శ్రేణుల్లో గుసగుసలు విన్పిస్తున్నా.. వాళ్లు కూడా ఇప్పటివరకు ఓరుగల్లు మొహం చూడలేదు. ఈ పరిణామం అటు గులాబీ శ్రేణుల్లోనూ, ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది.రజతోత్సవ సభా వేదిక ఎల్కతుర్తికి షిఫ్ట్ అయ్యాక ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నిర్వహణ బాధ్యతల విషయంలో అనూహ్యంగా ఒక్కసారిగా తెరపైకి వచ్చారు. వీళ్లు వచ్చీ రాగానే అనుమతి విషయంలో ఆదిలోనే అడ్డంకి ఎదురైంది.దీంతో పార్టీ అధినేత కేసీఆర్ రంగంలోకి దిగి సభ అనుమతి కోసం హైకోర్టు మెట్లు ఎక్కగా%ొ% ఆ లోపే వరంగల్ కమిషనరేట్ సభకు అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ విషయంలో కేసీఆర్ వరంగల్ నాయకులపై అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారట. నాయకుల తీరు వల్ల అనుమతి కోసం హైకోర్టు మెట్లెక్కే పరిస్థితి వచ్చిందని వారిపై ఫైర్ అయ్యారట. ఇక లాభంలేదంటూ పార్టీ అధినేత కేసీఆరే ఇప్పుడు వరంగల్ సభ నిర్వహణ బాధ్యతలను స్వయంగా అంతా తానై పర్యవేక్షిస్తున్నారు.పార్టీ రజతోత్సవ సభలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటే ఆ స్థాయి ప్రాచుర్యం ఇంత వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాకపోవడంపై అధినేత కేసీఆర్ తీవ్ర అసహనంతో ఉన్నారంట. ఓరుగల్లు నేతలకు ఒకరంటే మరొకరికి పొసగక పోవడంతో తీవ్ర అసహనంతో ఉన్న కేసీఆర్.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి.ఈ ముగ్గురికి తలా ఓ రెండు నియోజకవర్గాలను మాత్రమే అప్పగించారంట. మరో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌కు మహబూబాబాద్ బాధ్యతలిచ్చారు. మొత్తం 10 లక్షల జనసమీకరణ కోసం ఇప్పటికే నియోజకవర్గాల వారీగా నేతలకు టార్గెట్లు పెట్టారు.ఏది ఏమైనా పార్టీ శ్రేణులన్నీ కలిసికట్టుగా కదిలి ఎల్కతుర్తి సభను విజయవంతం చేస్తాయా? రాష్ట్రంలో పార్టీకి ఏ మాత్రం ఆదరణ తగ్గలేదని నిరూపించాలనుకున్న కేసీఆర్ ప్లాన్ వర్కవుట్ అవుతుందా? వేచి చూడాలి..




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com